
భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



సమకాలీన సాహిత్యంలో మారుతున్న ధోరణులు

అమెరికా–యూరప్ మధ్య ఉక్రేన్ చిచ్చు

అక్రమంగా బంగారు గనుల తవ్వకం మాలీలో 48 మంది కార్మికులు మృతి

లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 239 | సోమవారం | 17-02-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## భారత్‌కు అమెరికా భారీ షాక్

- భారత్‌కు అందిస్తున్న 21 మిలియన్ డాలర్ల సాయం నిలిపివేత
- మస్క్ సారథ్యంలోని డోజ్ ప్రకటన
- మోదీ, ట్రంప్ సమావేశమైన రెండురోజుల్లోనే ఈ పరిణామం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్, బంగ్లాదేశ్ సహా పలు దేశాలకు భారీ షాక్ ఇచ్చారు. భారత్‌లో ఓటరు శాతం పెంపుదలకు ఇప్పటి వరకు అందజేస్తున్న 21 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 182 కోట్లు) సాయాన్ని నిలిపివేశారు. ప్రపంచ బిలియనీర్ తరువాయి 2లో

## ఎసి గదులు వీడండి



- క్షేత్రస్థాయిలో పర్యటించండి
- అధికారుల ఆలోచనలు, విధానాలు మారాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- కొందరు అధికారులు ఎసి గదులను వదిలి బయటికి రావడం లేదని అసంతృప్తి
- "లైఫ్ ఆఫ్ ఎ కర్మ యోగి- మిమైర్ ఆఫ్ సివిల్ సర్వెంట్" పుస్తకావిష్కరణ




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని కొందరు అధికారుల వ్యవహార శైలి, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల పట్ల తాను సంతోషంగా లేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎసి గదులను' వదిలి క్షేత్రస్థాయిలో పర్యటించాలని తాను పదే పదే చెబుతున్నప్పటికీ, ఎందుకో వారు సంకోచిస్తున్నారని, వారికేమైనా 'ఎసి జబ్బుఉన్నదో, ఏమో తనకు తెలియదని ఐఎఎస్ అధికారులనుద్దేశించి సిఎం వ్యాఖ్యానించారు. అధికారుల ఆలోచనలు, విధానాలు మారాలని, నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని సూచించారు. ఎంతో మంది బ్యూరోక్రాట్స్, సివిల్ సర్వెంట్స్ వారి కుటుంబాలను, జీవితాలను త్యాగం చేసి, తరువాయి 2లో

### నాయకులు ఒకటి చెబితే అధికారులు 'మూడు తప్పులు'

పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ల అనుభవాలకు,వారికి కేటాయించే ప్రభుత్వ శాఖలకు ఎటువంటి సంబంధం లేదని, అందుకే వారికి అవగాహన కల్పించి, తగిన నిర్ణయాలు తీసుకునేందుకు 'హెల్పింగ్‌హ్యాండ్స్' నిమిత్తం సెక్రటేరియెట్స్ రూల్స్‌ను అందిస్తారని సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఏదైనా ఫైల్‌వస్తే, దానికి సంబంధించిన నోట్ ప్రిపేర్ చేయడం, వాటి గురించి వివరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని, రాజకీయ ఎగ్జిక్యూటివ్‌లు ఒక తప్పు చేస్తే, అధికారులు మరో రెండు కలిపి మొత్తం ఒకేసారి మూడు తప్పులు చేద్దామని, తద్వారా మరింత బలంగా ఉంటుందని చెబుతున్న అధికారులను తాను చూస్తున్నానని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి సమాజానికి మంచిది కాదన్నారు. ఒక నిర్ణయంతో జరిగే పరిణామాలు, ప్రజలకు, నిర్ణయాలు తీసుకునే వారికి జరిగే నష్టాలను కూడా అధికారులు అంచనా వేసి తెలియజేసేవారని చెప్పారు. ప్రస్తుతం ఈ విధానం ఎందుకు తగ్గిందో తనకు కారణాలు తెలియదని చెప్పారు. పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌లు తమకు తాముగా సంతోష పడాలని పలు ఆదేశాలు జారీ చేస్తారని, వాటిని విశ్లేషించే బాధ్యత అధికారులదేనని, ఈ విషయాన్ని తాను బలంగా విశ్వసిస్తానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.



## గందరగోళ ప్రకటనే కొంపముంచింది!

### ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటలో మృతులు 18 మంది



- రైళ్ల పేర్లే ఘటనకు మూలకారణం
- ప్రాథమిక దర్యాప్తులో తేల్చిన పోలీసులు
- రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం
- రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- ఘటనపై దర్యాప్తునకు ఇద్దరు ఉన్నతాధికారులతో కమిటీ

**న్యూఢిల్లీ :** కిక్కిరిసిన ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం జరిగిన తొక్కిసలాటలో 18మంది మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. కొందరు ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దిగుతుండగా జారి తోటి ప్రయాణికులపై పడడంతో ఈ తొక్కిసలాట జరిగినట్టు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనలో మరో 12మంది గాయపడినట్టు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్, ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైళ్లకు సంబంధించి ప్రకటన ప్రయాణికులను గందరగోళానికి గురిచేశాయని, దీనితో ప్రయాణికులు తమ రైలు మిస్ అవుతామన్న గందరగోళమే తొక్కిసలాటకు మూలమని పోలీసులు గుర్తించారు. మహా కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే రైలు ఎక్కేందుకు ప్రయాణికులు 14, 15 ప్లాట్‌ఫామ్‌లకు పోటెత్తడంతో తొక్కిసలాట జరిగినట్టు తెలిసింది. తొక్కిసలాట జరిగిన సమయంలో పాట్నా వెళ్లే మగధ్ ఎక్స్‌ప్రెస్ 14వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై, న్యూఢిల్లీ–జమ్ము ఉత్తర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ 15వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్నట్టు ఉత్తర రైల్వే ప్రధాన పౌర సంబంధాల అధికారి(సిపిఆర్ఒ) హిమాంశు ఉపాధ్యాయ తెలిపారు. ఆ రెండు ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న ప్రయాణికులు కొందరు తరువాయి 2లో

## నడిరోడ్డుపై యువకుడి హత్య

### మేడ్చల్ పట్టణంలో పట్టపగలే దారుణం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి



మద్యం మత్తులో నిత్యం వేధిస్తున్న సోదరుడిని మరో వ్యక్తితో కలిసి కత్తులతో నడి రోడ్డుపై పొడిచి హతమార్చిన ఘటన మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకొంది. మేడ్చల్ ఎసిపి బి.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ తరువాయి 2లో

## మళ్లీ సంకెళ్లతోనే

- 116 మంది వలసదారులను తిప్పిపంపిన అమెరికా
- అత్యధికులు 18–30 ఏళ్ల వయసులోపు వారే
- 112 మందితో బయల్దేరిన మరో విమానం



**హోషియార్‌పూర్ :** అక్రమ వలసప్రజలను వెనక్కు తిప్పి పంపే ప్రక్రియలో భాగంగా రెండో విడత 116 మంది భారతీయులు సి–17 విమానంలో శనివారం రాత్రి అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగారు. వీరిలో ఎక్కువమంది 18 నుండి 30ఏళ్ళలోపు వయసువారే. ఆదివారం రాత్రి పొద్దుపోయాక మరో 112 మందితో మరో విమానం కూడా అమృత్‌సర్‌కు చేరుకుంటుదని అధికారులు అంచనావేశారు. సిక్కు యువకులను తలపాగా కూడా పెట్టుకోనివ్వలేదు. దీంతో గురుద్వారా ప్రభంధక్ కమిటీ వారిని ఇళ్ళవద్ద దింపేందుకు బస్సులు సమకూర్చింది. వారికి తలలకు టర్బన్లను సరఫరా చేసింది. ఆదివారం తెల్లవారుజాము తరువాయి 2లో






## చికెన్ షాపులు చిన్నబోయాయ్!

- బర్డ్ ఫ్లూ ప్రభావంతో కన్నెత్తిచూడని వినియోగదారులు
- కిటకిటలాడిన మటన్‌షాపులు, చేపల మార్కెట్లు
- ధరలు పెరగడంతో ప్రజల అసహనం

ప్రజాపక్షం /హైదరాబాద్




ఆదివారం వచ్చిందంటే చాలు నాన్‌వెజ్ ఉండాల్సిందే.. దాదాపు ప్రతి ఆదివారం మటన్ ముక్కనో... చికెన్ ముక్కనో లేనిది ముద్ద దిగడం అనేది మాంసం ప్రియులకు కష్టమే... అందుకే ఆదివారం అయితే చాలు మాంసం దుకాణాలన్నీ జనాలతో కిటకిటలాడుతున్నాయి. అయితే ఈ ఆదివారం మాత్రం చికెన్ షాపులు వెలవెలబోగా, మటన్ షాపులు కిటకిటలాడాయి.. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ వ్యాపారులు పూర్తిగా చిన్నబోయారు. చికెన్ ధరలు నిరుపేదలకు సైతం అందుబాటులో ఉండడంతో మటన్ కొనలేని వారంతా చికెన్ షాపులకు క్యూకట్టేవారు. దీంతో తరువాయి 2లో




## సర్వే జరగని కుటుంబాల వివరాల సేకరణ

ఆదివారం ప్రారంభమైన సమగ్ర కుటుంబ, కులగణన సర్వే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లో బిసి కమిషన్ పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ, కులగణన సర్వే ఆదివారం తిరిగి ప్రారంభమైంది. ఈ సర్వే ఆదివారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెల్సిందే. ఆదివారం ఉదయం నుండే ఇంతకు ముందు సర్వే కాని ప్రాంతాల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి వివరాలు తరువాయి 2లో



## లింగా... ఓలింగా

### వైభవంగా పెద్దగట్టు జాతర ప్రారంభం

- కేసారం నుండి దేవరపెట్టె తరలింపు
- ఘనంగా గంపల ప్రదర్శన
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- శివనామ స్మరణతో మార్మోగిన దురాజ్‌పల్లి

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. సూర్యాపేట మున్సిపాలిటీ దురాజ్‌పల్లి గ్రామంలో పెద్దగట్టుపై కొలువుదీరి భక్తులకు కొంగు బంగారంలా విరాజిల్లుతున్న శ్రీ లింగమంతులస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా రాష్ట్రాల తరువాయి 12లో

# అమెరికా–యూరప్ మధ్య ఉక్రేన్ చిచ్చు

## మా ప్రమేయం లేకుండా శాంతి ఒప్పందాన్ని ఒప్పుకోం

## నేడు ఫ్రాన్స్‌లో ఇయు ఎమర్జెనీ సదస్సు





**లండన్ :** ఉక్రేన్ యుద్ధంపై ట్రంప్ చేస్తున్న శాంతి చర్చల ప్రక్రియ పెద్ద రసాభాసగా మారుతోంది. ఇది అమెరికా–యూరప్ మధ్య చిచ్చు రేపుతున్నది. తమ ప్రమేయం లేకుండా ట్రంప్–పుతిన్‌ల శాంతి చర్చలు జరగడం పూర్తిగా యూరప్ ఖండాన్ని నిర్లక్ష్యం చేసినట్లే అవుతుందని యూరోపియన్ యూనియన్ విమర్శిస్తున్నది. ఉక్రేన్‌లో యుద్ధ పరిస్థితులపై వివరంగా చర్చించేందుకు యూరోపియన్ యూనియన్ సోమవారంనాడు అత్యవసర సమావేశానికి సన్నద్ధమైంది. ఫ్రాన్స్ దేశం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నది. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ ఉక్రేన్ యుద్ధం యూరోపియన్ యూనియన్ యుద్ధమని అన్నారు. పుతిన్‌తో యూరప్‌కు పెద్ద ముప్పు పొంచి ఉందని, రష్యాను ప్రతిఘటించడానికి ఒక "యూరప్ ఆర్మీ"ని సృష్టించాల్సిన అవసరం ఉందని, ఇంకెంతోకాలం యూరప్ ఖండానికి అమెరికా భద్రత కొనసాగబోదని జెలెన్‌స్కీ మ్యూనిచ్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో హెచ్చరించారు. మ్యూనిచ్ సెక్యూరిటీ సమ్మిట్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ యూరోపియన్ యూనియన్‌పై చేసిన వ్యాఖ్యలు ఇ.యుకు తీవ్ర ఆగ్రహం కలిగించాయి. పుతిన్‌తో ట్రంప్ ఇటీవల సుదీర్ఘ ఫోన్ సంభాషణ తర్వాత యూరోపియన్ యూనియన్‌లో ఆందోళన పెరిగింది. నాటో, ఉక్రేన్ ప్రయోజనాలను ట్రంప్ విస్మరించారా? అనే మీమాంస వారికి ఎదురైంది. ట్రంప్–పుతిన్ శాంతి ఒప్పంద ప్రయత్నాల గురించి తమకు ఎలాంటి ఆహ్వానం, అధికారిక సమాచారం లేదని జెలెన్‌స్కీ చెప్పారు. తమ ప్రమేయం లేకుండా అమెరికా–రష్యా మధ్య జరిగే ద్వైపాక్షిక ఒప్పందాన్ని తాము అంగీకరించే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. బ్రిటన్‌లో జర్మనీ రాయబారి బెర్గర్ స్పందిస్తూ, నాటో సభ్యత్వ తిరస్కారంతోపాటు ఉక్రేన్‌కు వ్యతిరేకంగా ట్రంప్ అనేక విషయాలు చెబుతున్నారనీ, ఈ పరిస్థితుల్లో ఎలాంటి చర్చలు జరిగినా యూరోపియన్ యూనియన్, ఉక్రేన్‌ల ప్రాతినిధ్యం, వారి ఉనికి చర్చల్లో ఉండాల్సిందేననీ అన్నారు. మ్యూనిచ్‌లో సెక్యూరిటీ సమావేశంలో కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రష్యాతో యుద్ధాన్ని కొంతకాలం స్థిరంగా కొనసాగించాలని యూరోపియన్‌యూనియన్ భావిస్తున్నది. ఎందుకంటే అనేక రకాల ఆంక్షల వల్ల రష్యా ఆర్థికంగా, సైనికంగా సమస్యల్లో పడింది. కొద్దినెలలు గనుక ఈ యుద్ధ పరిస్థితిని ఇదేవిధంగా కొనసాగిస్తే ప్రస్తుతం జరిగే సంభాషణల కంటే కొద్ది నెలలు తర్వాత శాంతి సంభాషణలు జరిగినప్పుడు ఉక్రేన్‌పై చర్చల్లో బేరసారాలు చేయడానికి నాటో కూటమి మెరుగైన స్థానంలో ఉంటుందని యూరోపియన్ యూనియన్ భావిస్తున్నది. కానీ ట్రంప్ మాత్రం వాటిని పెడచెవినపెట్టి మాస్కోకు మేలు చేసే యత్నాలు చేస్తున్నారని యూరోపియన్ యూనియన్ విమర్శిస్తున్నది. ట్రంప్ రష్యాకు చేరువ కావడం మారుతున్న ప్రపంచ పరిస్థితులకు తార్కాణమన్న తరహాలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు చేశారు. సౌదీ అరేబియాలో రాబోయే రోజుల్లో అమెరికా రక్షణమంత్రి మార్కో రుబియో రష్యా అధికారులతో సమావేశంపై ఇ.యు ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటో కూటమిలో సభ్యత్వం ఉంటేనే ఉక్రేన్‌కు పూర్తి భరోసా ఉంటుందని పదే పదే నొక్కి చెబుతున్నారు.

నాటో కూటమిలో సభ్యతమే తమకు ప్రధాన సమస్య అనీ, ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇవ్వడానికి వీల్లేదని రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ మొదటి నుండీ చేస్తున్న వాదనకు ట్రంప్ స్వరం కలపడం యూరోపియన్ యూనియన్‌పట్ల ఆయన ఆలోచనల్లో మార్పుగా జెలెన్‌స్కీ భావిస్తున్నారు. తమకు పూర్తి భద్రతా హామీ కావాలని మ్యూనిచ్‌లో సదస్సు సందర్భంగా జె.డి.వాన్స్ (అమెరికా ఉపాధ్యక్షుడు)తో జెలెన్‌స్కీ అన్నా రు. ఎన్నికల ప్రచారం సమయం నుండి ఇ.యుపై ట్రంప్‌లో సానుకూల దృక్పథం లేకపోవడం, 2.0 పాలనలో టారిఫ్‌ల విషయంలో కూడా ఇది కొట్టొచ్చినట్లు కనిపించడం ఒక పరిణామమైతే, ఉక్రేన్ యుద్ధాన్ని ముగించే విషయంలో ఇ.యు, ఉక్రేన్‌ల ప్రమేయాన్ని విస్మరించడంతో ఇ.యు నాయకులు ఎమర్జెన్సీ సమ్మిట్ నిర్వహిస్తున్నారు.

ప్రపంచం

## పుతిన్ ఉన్నంతవరకూ బ్రిటన్, యూరోపియన్ యూనియన్

# రక్షణ రంగానికి భారీగా ఖర్చు

### డేవిడ్ లమ్మీ





**లండన్ :** ఉక్రేన్‌లో ఒకవేళ శాంతి ఒప్పందం కుదిరినాగానీ బ్రిటన్, యూరోపియన్ యూనియన్‌లు రక్షణరంగంపై భారీగా ఖర్చు చేయాల్సిందేనని బ్రిటన్ కామన్‌వెల్త్–డెవలప్‌మెంట్ వ్యవహారాల విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ అన్నారు. యూరప్ ఖండం ఇప్పుడు తన ఉనికితో పోరాడుతోందనీ, తన ఉనికికే సమస్య వచ్చిందని అన్నారు. యూరప్ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జర్మనీ నగరం మ్యూనిచ్‌లో జరిగిన సెక్యూరిటీ సదస్సులో డేవిడ్ లమ్మీ మాట్లాడుతూ, వ్లదిమీర్ పుతిన్ రష్యా అధ్యక్ష పదవిలోనే ఉంటారనీ, ఆయన ఆ పదవి వదలి ఎక్కడికీ వెళ్ళే అవకాశం లేదనీ, ప్రస్తుతం యూరోపియన్ యూనియన్‌లో ఉన్న 23 దేశాలు రక్షణరంగంపై రెండు శాతం ఖర్చు చేస్తున్నాయనీ, అందువల్ల ఈ ఖర్చును ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉందని యూరోపియన్ దేశాలకు బాగా తెలుసుననీ అన్నారు. రక్షణ బడ్జెట్‌ను పెంచుకోవాలని బ్రిటన్ ఇప్పటికే నిర్ణయించుకుందనీ, 2.5 శాతం మేరకు తన రక్షణ బడ్జెట్‌ను పెంచుకునే విషయంలో ఇంకా కొద్ది నెలలు బ్రిటన్‌కు గడువు అవసరమని అన్నారు. అమెరికాలో వరుసగా అధికారంలోకి వచ్చిన పలువురు దేశాధ్యక్షుడు యూరోపియన్ యూనియన్‌కు ఎంతగానో హితవు చెప్పారనీ, రక్షణ బడ్జెట్ కేటాయింపులను పెంచుకోవాలని నచ్చజెప్పారనీ డేవిడ్ లమ్మీ తన ప్రసంగంలో గుర్తుచేశారు. ఆయన ప్రసంగం చేస్తుండగా ఫ్రాన్స్, పోలాండ్, జర్మనీ దేశాధిపతులు కూడా పక్కనే ఉన్నారు. మొత్తం జిడిపిని చూసినప్పుడు అందులో 0.01 శాతం ఉక్రేన్‌లో యుద్ధానికి ఖర్చుపెడుతున్నామన్నారు.

ఉక్రేన్ యుద్ధం ఒక కీలకసరిహద్దు అనీ, ఇది కేవలం ఉక్రేన్‌కు మాత్రమే కీలక సరిహద్దు కాదనీ, యావత్ యూరప్‌కూ ఉక్రేన్ ఒక కీలక సరిహద్దుగా ఉందనీ అన్నారు. పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రమాదం ఎదురవుతున్న తరుణంలో ఆ ప్రాంతంలో భద్రతకు అమెరికా భారీగా ఎందుకు ఖర్చు చేస్తోందో ఇప్పుడు తనకు బాగా అర్థం అవుతున్నదని ఆయన అన్నారు.

**యూరప్‌లోంచే యూరప్‌కు ముప్పు : వాన్స్**

మ్యూనిచ్ సెక్యూరిటీ సదస్సులో అమెరికా, యూరప్ మధ్య విభేదాలు కనిపించాయి. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ రష్యా నుండి ప్రమాదం ఎదురవుతుందని, యూరప్ సిద్ధంగా ఉండాలని హెచ్చరిక చేయగా, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మాత్రం ఈ సదస్సులో మాట్లాడుతూ, యూరప్‌కు రష్యా, చైనాల నుండి ఎలాంటి ప్రమాదం వాటిల్లదనీ, యూరప్‌కు యూరప్‌లోంచే అంతర్గతంగా ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించి దిగ్భ్రాంతపరచారు. ఆయన చేసిన ప్రసంగాన్ని ఇరవై నిమిషాలసేపు సదస్సులో ఉన్నవారంతా మౌనంగా ఉండిపోయి బొమ్మల్లా వింటూ కూర్చున్నారు.

# అక్రమంగా బంగారు గనుల తవ్వకం

## మాలీలో 48 మంది కార్మికులు మృతి

**బొమాకో :** పశ్చిమ ఆఫ్రికాదేశం మాలీలోని బంగారు గనుల్లో జరిగిన ప్రమాదంలో 48 మంది కార్మికులు మరణించారు. తాజా సంఘటన శనివారంనాడు జరిగింది. అత్యంత పేద దేశమైన మాలీ, ఆఫ్రికాలో బంగారు గనుల్లోంచి చేసే ఉత్పత్తుల్లో మూడవస్థానంలో ఉంది. ఈ దేశంలో తరచూ అక్రమంగా బంగారు గనుల తవ్వకాలు జరగడం, కార్మికులు మరణించడం నిత్యకృత్యాలుగా మారుతున్నాయి. తాజాగా జరిగిన 48 మంది కార్మికుల మరణాలతో ఇటీవలికాలంలో మొత్తం బంగారు గనుల అక్రమ తవ్వకాల్లో మరణించిన కార్మికుల సంఖ్య 1800కు చేరుకుంది. శనివారం గనిలో జరిగిన ప్రమాదంలో చంటి బిడ్డను వీపులో కట్టుకుని తవ్వకాలు చేస్తున్న ఒక మహిళ నీళ్ళల్లో పడిపోయి బిడ్డతో సహా మరణించింది. కొనియా గోల్డ్ మైనర్స్ అసోసియేషన్ కూడా ఈ మృతుల సంఖ్యను ధృవీకరించింది. ఒక పర్యావరణ సంస్థ మృతుల దేహాల కోసం తీవ్రంగా గనిలో గాలిస్తోంది. గతంలో ఒక చైనా కంపెనీ ఈ గనిలో తవ్వకాలు చేసి దానిని వదిలేసింది. ఇదే ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రోజుల తరబడి అక్రమంగా బంగారు గనులు తవ్వే కార్మికులు రోజుల తరబడి గనుల లోపల ఉండిపోవడం లోపల ప్రమాదాలు జరగడం, చరియలు విరిగిపడి కార్మికులు మరణించడం తరుచూ జరుగుతున్న సంఘటనలు. అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎంత యత్నించినప్పటికీ వీటిని అడ్డుకోలేకపోతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు అక్రమతవ్వకాల్లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు కూడా మాలీ ప్రభుత్వం తిరస్కరిస్తూ ఉండటంతో నిరసనలు కార్మికుల కుటుంబాల నుండి ఎదురవుతున్నాయి. గతనెలలో జరిగిన ప్రమాదంలో పదిమంది మరణించగా గత ఏడాది ఇదే నెలలో జరిగిన ప్రమాదంలో 70 మంది కార్మికులు మరణించారు.

## భారీ షాక్ (మొదటి పేజీ తరువాయి)

ఎలాన్ మస్క్ సారథ్యంలోని 'ప్రభుత్వ సామర్థ్య విభాగం' (డిఒజిఇ డోజ్) తాజాగా ఈ ప్రకటన చేసింది. ట్రంప్ క్రితం నెల డోజ్‌కు సారథిగా మస్క్‌ను ఎంపిక చేశారు. పాలన మెరుగుదల, వృథా ఖర్చుల కట్టడి బాధ్యత చేపట్టిన డోజ్ శనివారం 'ఎక్స్' పోస్ట్‌లో ఈ కోతలు ప్రకటించింది. అదేవిధంగా బంగ్లాదేశ్‌ను రాజకీయంగా బలోపేతం చేసే లక్ష్యంతో అమెరికా కేటాయిస్తున్న 29 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.251 కోట్లు) సాయాన్ని కూడా డోజ్ నిలిపివేసింది. అంతర్జాతీయ సాయంలో విస్తృతంగా విధిస్తున్న కోతల్లో భాగంగానే డోజ్ ఈ నిర్ణయం తీసుకున్నది. భారత్, బంగ్లాదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ, రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో అమెరికా ఇప్పటి వరకు ఈ గ్రాంట్ అందజేస్తోంది. డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైన కొన్ని రోజులకే అమెరికా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. స్పేస్ ఎక్స్ సిఇఒ మస్క్ కూడా ఇటీవల తన ముగ్గురు పిల్లలతో సహా తన కుటుంబంతో కలసి మోదీతో భేటీ అయ్యారు. అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ, ఇంధనశక్తి రంగాల్లో అవకాశాలపై ఉభయులూ చర్చించుకున్నారు. భారత్, యుఎస్‌లలో సుపరిపాలనకు కృషిపై వారు పత్రాలు మార్చుకున్నారు. కాగా, బడ్జెట్‌లో కోతలు లేకపోతే అమెరికా దివాలా తీస్తుందని మస్క్ ఇటీవల పలుమార్లు నొక్కి చెప్పారు. ఇప్పుడు బడ్జెట్‌లో కోత విధించడం ద్వారా భారత్, బంగ్లాదేశ్‌లకు అందజేస్తున్న సాయాన్ని నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఆమెరికా తాజా నిర్ణయంతో మరికొన్ని దేశాలకూ సాయం నిలచిపోనున్నది.

## వివరాల సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సేకరించారు. జిహెచ్ఎంసితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో పురపాలిక సిబ్బంది, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సర్వే జరగని కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం వివరాల సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 'మూడు' పద్ధతుల్లో సర్వే వివరాలను నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. టోల్ ఫ్రీ నెంబర్‌కు ( 040 21 11 11 11 ) ఫోన్ చేస్తే, వారే ఇంటికి వచ్చి కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నెంబర్‌ను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. 'ప్రజాపాలన సేవా కేంద్రం(పిపిఎస్‌కె))' ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్లి సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని సైతం కల్పించారు. అయితే పట్టణ ప్రాంతాల్లో వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు, సిబ్బంది ఉన్నారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు సమర్పించేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. https://seeepcsurvey.cgg.gov.in. వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని, ఆ దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసి, స్థానికంగా ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు.

**సర్వేపై అవగాహన కల్పించనున్న బిసి కమిషన్ :** కుల గణన సర్వే నేపథ్యంలో ప్రజలలో సర్వే పట్ల అవగాహన కల్పించేందుకు స్వయంగా బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు సభ్యులు హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కులగణన వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి సర్వేపై ప్రజలకు వివరించారు. అలాగే సోమవారం కూడా ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తామని చెప్పారు.

## మళ్లీ సంకెళ్లతోనే

(మొదటి పేజీ తరువాయి)

నాటికి వీరిలో సిక్కు యువకులు వారి వారి ఇళ్ళకు ఈ బస్సుల్లో చేరుకున్నారు. అగౌరవంగా స్వదేశానికి తిప్పిపంపవద్దని ఎన్ని డిమాండ్లు, విమర్శలు వెల్లువెత్తినప్పటికీ సైనిక విమానంలో రెండోసారి కూడా సంకెళ్ళతోనే ట్రంప్ ప్రభుత్వం భారతీయులను వెనక్కు తిప్పిపంపింది. శనివారం రాత్రి విమానం దిగినవారిలో పలు రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. 65 మంది పంజాబ్‌కు చెందినవారు, హర్యానాకు చెందిన 33 మంది, గుజరాత్‌కు చెందిన 8 మంది, ఉత్తరప్రదేశ్‌వారు ఇద్దరు, గోవా నివాసితులు ఇద్దరు, మహారాష్ట్రీయులు ఇద్దరు, రాజస్థానీయులు ఇద్దరు, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీరులకు చెందినవారు ఒక్కొక్కరూ వీరిలో ఉన్నారు. అమృత్‌సర్‌కు చేరుకున్న తర్వాత వారికి కడుపునిండుగా భారతీయ ఆహారాన్ని పుష్కలంగా సమకూర్చారు. పూర్తి విశ్రాంతి సమకూర్చారు. ఈ విమానంలోంచి దిగిన పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్ జిల్లా కురల కలాన్ గ్రామ నివాసి దల్జీత్‌సింగ్ పాత్రికేయులకు చెప్పిన ప్రత్యక్ష కథనం ప్రకారం ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్న పిల్లలను మాత్రం సంకెళ్ళు వేయకుండా వదిలిపెట్టారు. విమానంలో మిగిలిన అందరి చేతులు, కాళ్ళకు బేడీలు వేసి భారత్‌కు పంపారు. అమృత్‌సర్‌కు విమానం చేరుకుంటుండగా కొద్దిసేపటికి ముందుగా చేతులకు, కాళ్ళకు ఉన్న బేడీలను తొలగించారు. ఇటీవల అమెరికా పర్యటనలో అక్రమంగా వలసవెళ్ళిన భారతీయులను వెనక్కు తీసుకుపోతామని ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు. ఐతే అమర్యాదకరమైన పద్ధతులలో అమెరికా విమానాలలో పంపేకంటే భారత్ ప్రత్యేక సర్వీసుల ద్వారా వారిని గౌరవప్రదంగా వెనక్కు తీసుకురావాలని పిపిఐ సహా పలుపార్టీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఈ విషయంపై అమెరికా అధికారులకు తమ అసంతృప్తిని తెలియజేశామని చెప్పారు. ఐనాగానీ రెండోసారి కూడా అక్రమ వలసల పేరుతో తిరుగు విమానం ఎక్కిన భారతీయులకు అగౌరవం తప్పలేదు. మొదటి విడతగా ఈనెల ఐదోతేదీన 104 మంది భారతీయులను అమెరికా రవాణా విమానంలో వెనక్కు పంపారు. తాజాగా శనివారం రాత్రి రెండో విమానంలో 115 మందిని పంపారు.

**112 మందితో మరో విమానం రాక :** ఇక ఆదివారం రాత్రి (16వ తేదీ) పొద్దుపోయాక మూడో విమానంలో మరో 112 మంది భారతీయులు అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగుతారని అంచనావేస్తున్నారు. ఇక వారికి కూడా ఇదేవిధంగా సంకెళ్ళ గతే పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ విమానంలో హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన యువకులు ఉన్నారు. శిరోమణి గురుద్వారా ప్రభంధక్ కమిటీ ఆదివారంనాడు ఈవిధమైన అక్రమ రవాణాను తీవ్రంగా ఖండించింది. సిక్కు యువకులను తలకు టర్బన్‌లు కూడా పెట్టుకోనివ్వలేదని ఆందోళన వ్యక్తం చేసింది. తలకు ఎలాంటి టర్బన్లు లేకుండా వారిని తరలిస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో చూసి శిరోమణి గురుద్వార ప్రభంధక్ కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ కమిటీ అమృత్‌సర్ విమానాశ్రయానికి యువకులను తీసుకువెళ్ళేందుకు బస్సులను పంపింది. వారికి టర్బన్లు కూడా సరఫరా చేసుకునేందుకు వాటిని కూడా పంపింది.

**అమెరికామోజులో పడి దారుణంగా మోసపోయిన పంజాబ్‌రైతు :** రాజమార్గంలో అధికారికంగా అన్ని ఏర్పాట్లతో అమెరికా తీసుకువెళతానని నమ్మించి దళారీ తనను దారుణంగా మోసం చేశాడని, అక్రమ మార్గంలో ఎలాంటి పత్రాలు లేని వలసదారుడుగా తనను అమెరికా పంపించాడనీ అమృత్‌సర్ విమానాశ్రయంలో శనివారం రాత్రి 11.35 గంటలకు దిగిన దల్జీత్‌సింగ్ అనే పంజాబ్ రైతు తీవ్ర ఆవేదన చెందాడు. అక్రమమార్గంలో అమెరికా వెళ్ళేవారికి, నమ్మిపోకుండా జాగ్రత్తపడేవారికి ఆయన అనుభవం ఒక గుణపాఠంగా ఉంటుంది. తన కష్టాలన్నింటినీ పాత్రికేయులకు వివరంగా చెప్పారు. పంజాబ్ హోషియార్‌పూర్ జిల్లా నుండి ఆయన అమెరికా వెళ్ళారు. ఒకవ్యక్తి 2022లో తన గ్రామం కురలాకలాన్‌కు వచ్చి ట్రావెల్ ఏజంటుగా తనను తాను పరిచయం చేసుకున్నాడనీ, చట్టబద్ధమైన మార్గంలో అమెరికా పంపిస్తానని చెప్పాడనీ, అందుకు ప్రతిగా 65 లక్షల రూపాయలు ఇమ్మని అడిగాడని దల్జీత్‌సింగ్ చెప్పారు. మొత్తం ఐదున్నర ఎకరాలు భూమిని అతడు స్వాధీనం చేసుకున్నాడన్నారు. వెళ్ళడానికి ముందుగానే అడ్వాన్స్ కింద ఒక ఎకరం పొలం దల్జీత్‌సింగ్ భూమిని ఆ ట్రావెల్ ఏజంటు తన పేరన రాయించుకున్నాడు. అంతకుముందు దల్జీత్ సింగ్ వ్యవసాయం చేసుకునేవాడు. పొలం పనులపై వచ్చే చాలీచాలని ఆదాయంతో కష్టాలు పడేవాడు. అమెరికా వెళితే తనకు తన బిడ్డలకు మంచి జీవితం లభిస్తుందని ఆశపడ్డాడు. 2022 ఆగస్టులో ఆయన అమెరికా ప్రయాణం ప్రారంభమైంది. మొదట ఆయన ముంబయిలో బయలుదేరి దుబాయ్ చేరుకున్నారు. అక్కడ నెలరోజులు ఉన్న తర్వాత బ్రెజిల్ వెళ్ళి నెలరోజులు ఉన్నారు. కాలిబాటలో, ట్యాక్సీ ప్రయాణం చేసి వెళ్ళారు. పనామా కాలువ దాటడానికి మూడు రోజులు పట్టింది. అనేక నదులు, పర్వతాలు దాటి ఆయన ప్రయాణంచేశారు. చివరకు మెక్సికో చేరుకున్నారు. అలా మెక్సికోలో నెలరోజులు గడిపారు.

## వీడండి (మొదటి పేజీ తరువాయి)

దేశం కోసం సేవ చేశారని, అందుకే ప్రస్తుతం భారతదేశం ఆర్థికంగా బలంగా నిలదొక్కుకోగలిగిందన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ ఎం.గోపాలకృష్ణ నాయుడు రాసిన "లైఫ్ ఆఫ్ ఎ కర్మ యోగి – మిమైర్ ఆఫ్ సివిల్ సర్వెంట్" పుస్తకాన్ని సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని బేగంపేటలో ఆదివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఐఎఎస్ అధికారి శంకరన్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని, కొత్తగా వచ్చే అధికారులకు ఆయన పేరు కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఉన్నదని అందరినీ తట్టిలేపేలా, గొప్ప నిర్ణయాలను తీసుకున్న వ్యక్తి టి.ఎన్.శేషన్ అని, బ్యూరోక్రాట్స్ నుంచి రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అనేక సేవలను అందించారని, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు విజయవంతంగా అమలు చేశారని సిఎం కొనియాడారు. ప్రపంచలోనే భారతదేశాన్ని మూడవ ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు బ్యూరోక్రాట్స్ సేవలే కారణమన్నారు. రాజకీయ వ్యవహారాలను కూడా బ్యూరోక్రాట్స్ నిర్వహించగలరని మన్మోహన్‌సింగ్ నిరూపించారని చెప్పారు. గోపాలకృష్ణ నాయుడు తన జీవిత అనుభవాన్ని నిక్షిప్తం చేసి, భవిష్యత్ తరాల కోసం ఒక మంచి పుస్తకాన్ని తీసుకురావడాన్ని సిఎం ప్రశంసించారు. ఈ పుస్తకం కొత్తగా సర్వీసులో వచ్చిన వారికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఆరు దశాబ్దాల అనుభవాలను సంక్షిప్తం చేయడం సాధారణ విషయం కాదని, దేనినైనా కొనుగోలు చేయవచ్చుని, కానీ అనుభవాన్ని మాత్రం కొనుగోలు చేయలేమని, దీనికి వెలకట్టలేమని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ గత జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు జిల్లాలో ఆదివాసిలు, చెంచులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేవారని సిఎం గుర్తు చేసుకున్నారు. రాజకీయ నాయకులకంటే కూడా ప్రజలు అధికారులతోనే తమ బాధలను చెప్పుకునేవారని, వారితో మమేకమయ్యేవారని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులుగా తాము కేవలం పాలసీ నిర్ణయాలను మాత్రమే చేయగలమని, దీనిని అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని చెప్పారు.

**శిక్షణలో కాలంలోనే 'సివిల్ పంచాయతీ'ల్లో జోక్యం :** ప్రస్తుతం వస్తున్న అధికారులల్లో కొందరు సమాజంలోని తప్పుడు వాటిని మార్గదర్శిగా తీసుకుంటున్నట్టుగా ఉన్నదని, అందుకే శిక్షణలో ఉన్నప్పడే పోలీస్ స్టేషన్లకు వెళ్లి సివిల్ పంచాయతీలలో జోక్యం చేసుకోవడం బాధాకరమని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

అనుభవం ఉన్న రిటైర్డ్ అధికారులతో కలెక్టర్లు, ఎస్‌పిలకు ముఖాముఖి నిర్వహిస్తే బాగుంటుందని, తద్వారా వారి అనుభవాలను పంచుకునే అవకాశం ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సిఎం ఆదేశించారు. పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌లు వస్తుంటారు, పోతుంటారని, అత్యంత గౌరవప్రదమైన ఐఎస్, ఐపిఎస్‌లు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, పేదలకు ఏవిధంగా సహాయం చేయాలో ఆలోచన చేయాలని సిఎం కోరారు. ప్రభుత్వం వద్దకు వచ్చే ఫైల్స్‌ను ఏ విధంగా అడ్డుపెట్టాలి?, వాటిపై నెగెటివ్ రాయాలనే ఉద్దేశంతో కాకుండా, ప్రజలకు ఎలా ఉపయోగపడాలనే సానుకూల దృక్పథంతో పనిచేయాలని, అలాంటి అధికారులను ప్రజలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. గోపాలకృష్ణ నాయుడు మాట్లాడుతూ 'నా తల్లినే' నాకు గురువు అని, ఆమె నుంచి తాను అనేక విషయాలను నేర్చుకున్నానని వివరించారు.

## కొంపముంచింది!

(మొదటి పేజీ తరువాయి)

ఫుట్‌వోవర్ బ్రిడ్జి దిగుతుండగా జారి ఇతర ప్రయాణికులపై పడడంతో తొక్కిసలాట జరిగినట్టు ఆయన వెల్లడించారు. రైళ్లు బయలుదేరే సమయంలో ఆలస్యం, గంటకు 1500 సాధారణ టిక్కెట్ల అమ్మకం స్టేషన్‌లో గందరగోళ పరిస్థితిని సృష్టించాయిని కొందరు తెలుపగా, రైళ్ల ప్లాట్‌ఫామ్ నంబర్లు మారినట్టు ప్రకటించడంతో ఏర్పడిన గందరగోళం తొక్కిసలాటకు దారితీసినట్టు కొందరు తెలిపారు. ఈ సంఘటనపై ఇద్దరు ఉన్నతాధికారులతో కూడిన దర్యాప్తు సంఘాన్ని నియమించినట్టు రైల్వేస్ ప్రకటించింది. ఉత్తర రైల్వేకు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నర్సింగ్ దేవ్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటి కమిషనర్ పంకజ్ గంగ్వార్ దర్యాప్తు బృందం సభ్యులు. తొక్కిసలాట జరిగిన సమయంలో వీడియో ఫుటేజ్‌లను అందజేయాలని దర్యాప్తు బృందం స్టేషన్ అధికారులను ఆదేశించింది.

**మృతుల కుటుంబాలకు 10 లక్షల పరిహారం :** తొక్కిసలాటలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి లక్ష రూపాయలు అందజేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నంకూడా స్టేషన్‌లో ప్రయాణికులు రద్దీ కనిపించింది. తొక్కిసలాట అనంతరం ప్లాట్‌ఫామ్‌పై చెల్లాచెదురుగా పడివున్న చెప్పులు, చిరిగిన సంచులు, ప్రయాణికులకు సంబంధించిన వస్తువులు తొలగించడానికి రైల్వే సిబ్బంది రాత్రంతా శ్రమించారు. తాను చూసిన ఇటువంటి సంఘటననలో ఇదే అత్యంత దారుణమని రైల్వే సిబ్బంది ఒకరు అన్నారు. 'ప్లాట్‌ఫామ్‌పై ఎక్కడ చూసినా చెల్లాచెదురుగా చెప్పులు, సగం తిన్న తినుబండారాలు, పిల్లల స్కూల్ బ్యాగులు పడివున్నాయి. ప్రయాణికులు తమ వస్తువులను తీసుకునే సమయంకూడా లభించలేదు. తమ ప్రాణాలు రక్షించుకోడానికి పరుగులు పెట్టారు' అని తెలిపాడు. తొక్కిసలాట రాత్రి 9.55 గంటల సమయంలో సంభవించింది. కుంభమేళాకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో స్టేషన్ నిండిపోయింది. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ 14పై నిలిచి ఉంది. అప్పటికే స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనితో 12, 13, 14 ప్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. అదే సమయంలో రైళ్ల ప్లాట్‌ఫామ్‌లు మారినట్టు చేసిన ప్రకటన ప్రయాణికులలో ఆందోళన, గందరగోళం సృష్టించాయి. 16వ నంబర్ ప్లాట్‌ఫామ్ చేరుకునేందుకు ప్రయాణికులు ఒక్కసారిగా ఫుట్‌వోవర్ బ్రిడ్జిపైకి చేరడంతో తొక్కిసలాట సంభవించినట్టు అధికారులు వెల్లడించారు. దీనికితోడు ఎస్కలేటర్ పనిచేయకపోవడంకూడా దుర్ఘటనకు దారితీసిందని తెలిపారు. పరిస్థితిని అదుపు చేసేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించినా ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో సాధ్యం కాలేదు. పలువురు పక్కనున్న ఇనుపకంచె ఎక్కగా, కొందరు కాళ్లకింద నలిగిపోయినట్టు అధికారులు వెల్లడించారు. తొక్కిసలాట సద్దుమణిగిన తరువాత మొత్తం 18మంది.. 14మంది మహిళలు, నలుగురు పిల్లలు మృతి చెందినట్టు, వారిలో ఇద్దరు పిల్లలు పదేళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. చనిపోయినవారిని గుర్తించేందుకు లోక్‌నాయక్ జయప్రకాష్ ఆస్పత్రి బంధువుల ఆక్రందనలతో నిండిపోయింది. వారిలో ఒక వ్యక్తి తన 12 ఏళ్ల కుమారుడు కనిపించడం లేదని, అతడు తనతో రైలు ఎక్కాల్సి ఉందని తెలిపాడు. తన కుమారుడి బ్యాక్‌ప్యాక్‌ను పోలిన సంచిని చూసి అతడు దుఃఖించాడు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం :** తొక్కిసలాటలో మృతులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంతాపం వ్యక్తం చేశారు. 'ఢిల్లీ స్టేషన్ తొక్కిసలాటలో ప్రయాణికులు మృతిచెందిన వార్తతో ఎంతో వేదన కలిగింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను' అని ముర్మ సంతాప సందేశంలో తెలిపారు. ప్రధాని మోదీ సంఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ 'మృతుల కుటుంబాల వేదన తీరనిది. నా ఆలోచనలన్నీ వారి గురించే. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. అధికారులు బాధితులకు అన్నివిధాల సహాయంగా ఉంటారు' అన్నారు. కాగా సంఘటనపై ప్రతిపక్షాలు ప్రభుత్వం వైఫల్యంతోనే దుర్ఘటన జరిగిందని దుయ్యబట్టాయి. తొక్కిసలాట కారణాలను తొక్కిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది రైల్వేల వైఫల్యానికి మరో నిదర్శమని, పరిణామాలను ఊహించడంలో ప్రభుత్వం మరోసారి విఫలమైందని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ప్రయాణికులను నియంత్రిచడంలో వైఫల్యానికి నిదర్శనమని ఆప్ విమర్శలు గుప్పించింది. తొక్కిసలాటలో మృతి చెందిన వారిని ఆషా దేవి (79), పింకి దేవి (41), షీలా దేవి(50), వ్యోమ్(25), పూనమ్ దేవి(40), లలిత దేవి(35), సురుచి(11), కృష్ణాదేవి (40), విజయ్ సాహ్(15), నీరజ్(12), శాంతి దేవి(40), పూజ కుమారి(8), సంగీత మాలిక్(34), పూనమ్(34), మమతా ఝా(40), రియా సింగ్(7), బేబి కుమారి(24), మనోజ్(47)గా గుర్తించారు. చనిపోయినవారి మృత దేహాలను కుటుంబీకులకు అప్పగించినట్టు, వారు తమ స్వస్థలాలకు వెళ్లిపోయినట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కొందరు పోస్ట్‌మార్టమ్ చేయకుండానే తమ బంధువుల మృతదేహాలను తీసుకెళ్లినట్టు తెలిపారు. అయితే దీనిపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

**'ప్రకటనలో గందరగోళమే కారణం' :** ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటకు ప్రకటనలో గందరగోళమే కారణమని ఢిల్లీ పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో కనుగొన్నారు. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్, ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైళ్లకు సంబంధించి ప్రకటన ప్రయాణికులను గందరగోళానికి గురిచేశాయని, దీనితో ప్రయాణికులు తమ రైలు మిస్ అవుతామన్న గందరగోళమే తొక్కిసలాటకు మూలమని పోలీసులు గుర్తించారు. రెండు రైళ్ల పేర్లలో ప్రయాగ్‌రాజ్ పదం ఉండడంతో ప్రయాణికులు అయోమయానికి గురయ్యారన్నారు. ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు 16 నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వస్తోందని ప్రకటించడంతో అప్పటికే 14వ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు అయోమయంతో 16 నంబరు ప్లాట్‌ఫామ్‌కు పరుగులుపెట్టారు. దీనికితోడు ఆ సమయంలో ప్రయాగ్‌రాజ్‌వైపు వెళ్లాల్సిన మరో నాలుగు రైళ్లు ఆలస్యమవడంతో స్టేషన్‌లోని ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. అందరూ 16నంబరు ప్లాట్‌ఫామ్‌వైపు బయలుదేరడంతో తొక్కిసలాట జరిగినట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు.

## చిన్నబోయాయ్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఆదివారం చికెన్ సెంటర్లన్నీ జనాలతో కిటకిటలాడేవి. అయితే ఈ ఆదివారం మాత్రం ఇందుకు పూర్తి విభిన్నంగా జరిగింది. మటన్ షాపుల వద్ద జనాలు క్యూ కట్టగా, చికెన్ షాపులు పూర్తిగా ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో ఉదయం 11 గంటల లోపే చాలా మేరకు మటన్ దుకాణాలు ఖాళీ అయ్యాయి. మారో వైపు చేపలు, రొయ్యలకు ఒక్కసారిగా భారీగా గిరాకీ పెరిగింది.

**పెరిగిన ధరలతో మాంసం ప్రియులు దిగాలు :** బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ ధరలు తగ్గుముఖం పట్టగా, మటన్, చేపలు, రొయ్యల ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి. కిలో మటన్ ధర రూ.800 నుంచి 850 మధ్య ఉండేంది. బర్డ్‌ఫ్లూతో వ్యాపారులు ఒక్కసారిగా ధరలను పెంచివేశారు. దీంతో మాంసంప్రియులు మటన్ ధరలను చూసి ఖంగుతిన్నారు. అసలు కిలో రూ.800 వందలు అంటేనే కొనేందుకు వెనకా ముందు ఆడేవారు. అలాంటి ఒక్కసారి కిలో మటన్ రూ. 1000 నుంచి 1200లు, మరికొన్ని ప్రాంతాల్లో ఏకంగా రూ.1400లకు పెంచారు. దీంతో చేసిది లేక చాలా మంది పావు కిలో, అర్ధ కిలోలతోనే సరిపెట్టుకోగా, మరికొంతమంది మాత్రం ధరల నుంచి చేపల వైపు మొగ్గు చూపారు. దీంతో చేపలకు ఒక్కసారిగా గిరాకీ పెరగడంతో వాటి ధరలను సైతం వ్యాపారాలు అమాంతం పెంచివేశారు. గత వారం కొర్రమీను కిలో ధర రూ.450 నుంచి రూ.500 వరకు ఉండగా, ఈ వారం రూ.600 నుంచి రూ.650కి పెంచారు. అదేవిధంగా రహు, కిలో ధర 150 నుంచి రూ.200 వరకు ఉండగా, ఈవారం మాత్రం 220 నుంచి రూ.260 వరకు పెరిగింది. అదే విధంగా పాంప్లేట్ ధరలు సైతం రూ.300 వరకు పలికాయి. రొయ్యలు అయితే ఏకంగా రూ.1000లు పలికింది.

## యువకుడి హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేసే కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ప్రాంతానికి చెందిన గూగులోత్ గన్యా స్థానికంగా అద్దె ఇంట్లో భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులైన ఉమేష్, రాకేష్‌లతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన ఉమేష్ తరచు మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవలు పడేవాడు. తల్లిదండ్రులు ఎన్నిసార్లు చెప్పినా మారకుండా అదే తీరులో ఆదివారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన ఉమేష్ మరోసారి గొడవ చేయసాగాడు. అతడిని అడ్డుకొనే ప్రయత్నంలో అతడి సోదరుడు రాకేష్‌తో పాటు వారి ఇంటికి వచ్చిన వరుసకు సోదరుడైన లక్ష్మణ్‌లు వారించారు. ఎంతకూ వినని ఉమేష్‌పై రాకేష్, లక్ష్మణ్‌లు ఇద్దరూ ఇంట్లో ఉన్న కత్తులు తీసుకొని దాడి చేయటంతో సమీపంలోని జాతీయ రహదారి వైపు పరుగెత్తిన ఉమేష్ వెనుకనే వెంబడిస్తూ వచ్చి దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మాలలకు న్యాయం జరిగేలా చూస్తాం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మాల సంఘాల జెఎసి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని విషయాలు పరిశీలించి, మాలలకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి. చెన్నయ్య నేతృత్వంలో ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. ఎస్‌సి వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని, అందుకు సంబంధించిన వివరాలను మాల జెఎసి నాయకులు భట్టి విక్రమార్కకు వివరించారు. అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి, తగిన విధంగా న్యాయం చేస్తానని వారికి ఆయన హామీనిచ్చారు. భట్టి విక్రమార్కను కలిసిన వారిలో మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య, కో ఛైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, చెరుకు రాంచందర్, గోపోజు రమేష్, బేరా బాలకిషన్, తాళ్ళపెల్లి రవి, ఆవుల సుధీర్, విశాల్, ఉమాకాంత్, చేతన్, నవీన్, సరళ, అంజలి తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎవరు లబ్ధిపొందారో లెక్కలు వెల్లడించాలి : చెన్నయ్య**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుండి 2024 వరకు ఎస్‌సిలలో విద్యా, ఉద్యోగాలలో, ప్రభుత్వ పథకాలలో దళిత బంధు, భూమి, సబ్సిడీలు, రాజకీయ పదవులలో ఎవరూ ఎక్కువ లబ్ధి పొందారో లెక్కలతో బయటపెట్టాలని చెన్నయ్య డిమాండ్ చేశారు. భట్టి విక్రమార్కను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2011లో ఉప కులాల వారీగా జనాభా లెక్కలు జరుగలేదన్నారు. అందులోనూ ఆ జనాభా లెక్కలకు వర్గీకరణ చేసిన లెక్కలకు 2లక్షలకు పైగా వ్యత్యాసముందన్నారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రకు చెందిన మాలలు కొంత ఎక్కువగా లబ్ధి పొంది ఉండటం వాస్తవమని, కానీ తెలంగాణలోని మాలలు మాదిగల కన్నా వెనుకబడిన మాట కాదనలేని నిజమన్నారు. రిజర్వేషన్ శాతాన్ని పెంచి పంజాబ్ రాష్ట్రం మాదిరిగా రెండు గ్రూప్‌లుగా విభజించి సమానంగా కేటాయించాలని, లేదా తమిళనాడు తరహాలో ఉమ్మడి రిజర్వేషన్లను అలాగే ఉంచి, రిజర్వేషన్ శాతాన్ని పెంచి దానిని అత్యంత వెనుకబాటుకు గురైన వారికి కేటాయించాలని కోరారు. ఒకవేళ వర్గీకరణను ఇలాగే ఉంచదలిస్తే గ్రూప్ 1లో అత్యంత వెనుకబడిన కులాలకు 3 శాతం రిజర్వేషన్‌ను, గ్రూప్ 2లో కొంత మెరుగైన స్థితిలో ఉన్న మాలలను ఉంచి 6 శాతం రిజర్వేషన్‌ను, గ్రూప్ 3లో మరింత మెరుగైన స్థితిలో ఉన్న మాదిగలను ఉంచి 6 శాతం రిజర్వేషన్‌ను కేటాయించాలన్నారు. కులాల వారీగా వర్గీకరణ చేయాలని సుప్రీం కోర్టు ఎక్కడ చెప్పలేదన్నారు. మాలల మనోభావాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా మాలలకు నష్టం జరిగేలా వర్గీకరణ చేస్తే నికర ఓటు బ్యాంకుగా ఉన్న మాలలను దూరం చేసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన గొయ్యి తనే తవ్వుకున్న చందంగా ఉంటుందని చెన్నయ్య అన్నారు.

## రైతు సంక్షేమమే లక్ష్యంగా

# రైతు కమిషన్ ఏర్పాటు

### రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు కమిషన్ ఏర్పాటు చేసిందని కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి స్పష్టం చేశారు. రైతు కమిషన్ అవసరమా అంటూ వార్త ప్రచురితం కావడాన్ని రైతు కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే వ్యవసాయానికి పెద్దపీట వేయాలని, రైతు సంక్షేమానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వాలనే లక్ష్యంతో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేశారని కోదండ రెడ్డి వెల్లడించారు. దేశంలో పంజాబ్ రాష్ట్రం తర్వాత రైతు కమిషన్ ఏర్పాటు చేసిన రాష్ట్రం మన తెలంగాణే అని అన్నారు. కమిషన్ ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా కమీషన్ నిరంతరం పనిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల వరకు రైతులు ఉన్నారని, వారికి అండగా, ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ అని తెలిపారు. రైతు కమిషన్ పూర్తి స్థాయిలో ఛైర్మన్, సభ్యుల నియామకమైన ఈ మూడు నెలల కాలంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలను అందించిందన్నారు. సాగునీరు, విత్తనాలు, భూమి హక్కులు, పంట రుణాలు, రైతు ఆత్మహత్యలు లాంటి కీలక సమస్యలపై మేధోమథనం చేసి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. కొన్ని సమస్యలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమాచారాన్ని సేకరించామని, నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు, పత్తి రైతుల మార్కెట్ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావన, వరి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం లాంటివి కమీషన్ కృషితో సాధ్యపడ్డాయని కోదండ రెడ్డి వెల్లడించారు. మరోవైపు సాంప్రదాయ పంటలైన చెరుకు, పసుపుతోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన చర్యలపై కమిషన్ ఉద్యానవన శాఖ అధికారులకు దిశానిర్దేశం చేసిందన్నారు. ఇక భూగర్భ జలాలు పెంచుకోడానికి గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదికను అందించిందని, గత ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్‌ను మేజర్ ఇరిగేషన్‌లో విలీనం చేయడంతో దానిని వీడదీసి ఆ చెరువుల నిర్వహణ గ్రామీణ ప్రాంతంలో వుండే నీటి సంఘాలకు అప్పగించాలని ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఇంత ప్రాముఖ్యత గల రైతు కమిషన అవసరమా అంటూ వార్త రావడం శోచనీయమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు.

## రాహుల్ కుటుంబానికి చరిత్ర ఉన్నది: జగ్గారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాహుల్‌గాంధీ అంటే ఒక చరిత్ర అని, ఆయన కుటుంబానికి మహా సంగ్రామం నుండి వచ్చిన చరిత్ర ఉన్నదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. రాహుల్ కులం విషయంలో బిజెపి నాయకులు, బండి సంజయ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎప్పుడూ కులం గురించి మాట్లాడబోరని, ఆయనొక బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని, బ్రాహ్మణులు హిందూవులు కాదా? అని బండి సంజయ్‌ని జగ్గారెడ్డి ప్రశ్నించారు. పదవుల కోసం పాకులాడే వారు ఇందిరా, సోనియా, రాహుల్‌గాంధీల గురించి మాట్లాడుతారా? అని ప్రశ్నించారు. వాజ్ పేయ్ తర్వాత ప్రధాని కావాల్సిన అద్వానీని పక్కనపెట్టి మోదీ ప్రధాని అయ్యారని ఆరోపించారు. అద్వానీ లేకపోతే బిజెపినే లేదని, ఆయన రథయాత్ర చేయకపోతే బిజెపి ఎక్కడుండేదని నిలదీశారు. సోనియా, రాహుల్‌గాంధీ ప్రధాని పదవిని వదిలేసి, ఆ పదవిని మన్మోహన్ సింగ్, పివి.నర్సింహారావు లాంటి వారికి అవకాశాన్ని కల్పించారని జగ్గారెడ్డి తెలిపారు.

## ఎసిబి పేరుతో బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వండి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎసిబి పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, డబ్బులు డిమాండ్ చేసినా తమ దృష్టికి తీసుకురావాలని ఎసిబి వెల్లడించింది. ఎసిబి పేరుతో ఫోన్లు చేసి, కేసులు లేకుండా చూస్తామని ఎవరైనా చెబితే వెంటనే ఎవ్వరూ నమ్మవద్దని, వెంటనే తమ టోల్ ఫ్రీ నంబర్‌కు (1064), లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎసిబి డిజి విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎసిబికి చెందిన వాట్సాప్ (94404461606), తెలంగాణ ఎసిబి ఫేస్‌బుక్, ట్విట్టర్ వేదిక ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు జాగ్రత్త వహించాలని తెలిపారు.

## తునికాకు సేకరణ ప్రక్రియ ప్రారంభించాలి

### తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలలో తునికాకు సేకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజ య్య నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా జనవరిలోనే ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి తునికాకు సేకరణ పనులు ప్రారంభం అవుతాయని, కాని ఏడాది ఇప్పటికీ ఈ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఆదివాసీ గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. గిరిజనులు, గిరిజనేతరులకు జీవన భృతికి ఆధారమైన తునికాకు సేకరణ టెండర్ పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ ద్వారా ప్రతి ఏటా రాష్ట్రంలో ఏజెన్సీ జిల్లాలను కలుపుకుని మొత్తం 14 జిల్లాల్లో తునికాకు సేకరణ జరుగుతుండగా, దాదాపు 10 లక్షల మంది గిరిజన, గిరిజనేతర ప్రజలు తునికాకు సేకరణపై ఆధారపడి జీవనం సాగిస్తూ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అదేవిధంగా లోడింగ్ అన్‌లోడింగ్, ఉల్టా పల్టా జట్కా పనులతో పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి లభిస్తోందని, ఈ సీజన్ ద్వారా వచ్చే ఆదాయయే గిరిజనుల జీవనానికి ఆధారమని అంజయ్య నాయక్ తెలిపారు.



ఏజెన్సీ ప్రాంతాలలో తునికాకు దొరికే ప్రాంతాలలో తునికాకు కార్మికులు, గిరిజనులు ఉపాధి కోల్పోకుండా తక్షణమే ప్రక్రియ పూర్తి చేసి తునికాకు ప్రూనింగ్ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం జిల్లా భద్రాచలం లాంటి ఏజెన్సీ ప్రాంతంలో తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి భూక్య శ్రీనివాస్ అధ్యక్షులు సొందే కుటుంబరావుల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి టెండర్లు ప్రక్రియను పూర్తి చేసి గిరిజనులకు ప్రధాన ఆదాయ వనరులైనటువంటి తునికాకు సేకరణ పనులను మొదలుపెట్టి గిరిజనులను ఆదుకోవాలని గిరిజనుల పక్షాన తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర రాష్ట్ర కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిచ్చేందుకు గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను చేపడుతామని అంజయ్య నాయక్ హెచ్చరించారు.

## నేడు ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

### సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరుగుతున్న ఏర్పాట్లను తలసాని, ఎంఎల్‌సి మహమూద్ అలీ, తెలంగాణ భవన్ ఇన్‌చార్జ్ రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతో పరిశీలించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఎంతో వైభవంగా నిర్వహించే ఈ వేడుకలలో భాగంగా డప్పు కళాకారులు, గిరిజన వేషధారణ నృత్యాల ప్రదర్శన, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, కెసిఆర్, జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శించనున్నట్లు చెప్పారు. 71వ జన్మదిన సందర్భంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్ రావు, ఎంఎల్‌సి కవిత, మాజీ మంత్రులు, పార్టీ నాయకులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, పళ్ల పంపిణీ, అన్నదానం, వివిధ ప్రార్థన మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తలసాని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్, ఆనంద్ గౌడ్, విప్లవ్ కుమార్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు మన్నె కవిత రెడ్డి, వెంకటేశ్, కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కమీషన్లు, కుట్రలు తప్ప కాంగ్రెస్, బిఆర్‌ఎస్ చేసిందేమిటి?



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** టీచర్, గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి అర్హతే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. టీచర్లు, గ్రాడ్యుయేట్ల పక్షాన ఎన్నడైనా పోరాటాలు చేశారా? 317 జీవో కు వ్యతిరేకంగా ఎన్నడైనా కెసిఆర్ సర్కారుతో కొట్లాడారా? గ్రూప్–1 సహా నిరుద్యోగుల పక్షాన ఎన్నడైనా జైలుకు వెళ్లారా? మరి కాంగ్రెస్ అభ్యర్థులకు ఎందుకు ఓట్లేయాలి? టీచర్లు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం కొట్లాడింది, జైలుకు వెళ్లింది, లాఠీ దెబ్బలు తిన్న చరిత్ర బిజెపిదే అని స్పష్టం చేశారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు బిజెపి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడితే సోషల్ మీడియా లో పోస్టు చేసినందుకు అనేక మంది బిజెపి కార్యకర్తలపై నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పలు కేసులు పెట్టి వేధించిందన్నారు. గ్రూప్–1 ఉద్యోగుల పక్షాన కేంద్ర మంత్రిగా ఉంటూ మద్దతు తెలిపి పోరాటం చేశానన్నారు. బిఆర్‌ఎస్ నేతలు ఆనాడు గ్రూప్–1 నిరుద్యోగుల మద్యకు చేరి విధ్వంసం సృష్టించాలని చూశారన్నారు. తద్వారా గ్రూప్–1 అభ్యర్థుల భవిష్యత్తు నాశనం చేయాలని చూశారన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతలు తమ స్వార్థం కోసం తప్ప నిరుద్యోగుల పక్షాన ఉద్యమాలు చేసిన చరిత్ర లేదని, కేవలం కమీషన్ల కోసమే పనిచేశారన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రతి పనికి సంబంధించి బిల్లులో 14 నుంచి 18 శాతం కమీషన్ అడుగుతున్నారని, కమీషన్ ఇవ్వకుండా బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. టీచర్ల కోసం పోరాడిన ఫలితంగా ప్రతినెల సక్రమంగా జీతాలు వస్తున్నాయన్నారు. 317 జీవోను సవరించాలని కరీంనగర్ ఎంపి కార్యాలయంలో దీక్ష చేస్తుంటే ఆఫీసు గేట్లను గ్యాస్ కట్టర్లతో పోలీసులు కత్తిరించి కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారని, ఆఫీసు జేసిబితో కూల్చాలని నాటి సిపికి కెసిఆర్ వార్నింగ్ ఇచ్చారని, అయినా భయపడకుండా పోరాడామన్నారు. టీచర్లు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వ మెడలు వంచిన చరిత్ర బిజెపిదేనన్నారు. కులగణన పేరుతో బిసి రిజర్వేషన్లు తగ్గిస్తూ ముస్లింలను బిసిల్లో కలుపుతుంటే పోరాడుతున్నది బిజెపియేనని, ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించి బిజెపి అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి





### వార్డెన్ నిర్లక్ష్యమే అంటున్న బంధువులు

### మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ నాయకుల ధర్నా

**ప్రజాపక్షం/వాజేడు :** జ్వరంతో బాధపడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఆదివారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం పేరూరు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సోయం వినీత్ (14) అనే విద్యార్థికి మంగళవారం జ్వరం వచ్చింది. అక్కడి హెల్త్ వర్కర్ జ్వరం టాబ్లెట్ ఇవ్వడంతో ఆ పూటకు జ్వరం తగ్గింది. రెండు రోజులు సెలవు రావడంతో ఆ విద్యార్థిని ఇంటి కి పంపించారు. ఇంటికి పంపిన తర్వాత మర ల జ్వరం రావడంతో తన మేనమామ శ్రీకాంత్ ధర్మవరం ఆర్‌ఎంపి వద్ద వైద్యం చేయించారు. అయినప్పటికీ తగ్గకపోగా కడుపులో నొప్పి రావడంతో ఏటూరు నాగారం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి తల్లి శైలజ హైదరాబాదులో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంది. తండ్రి ఈ విద్యార్థి చిన్నతనంలోని కుటుంబాన్ని వదిలేశాడు. వార్డెన్ ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లనే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్యం ముందే అందించినట్లయితే విద్యార్థి చనిపోయేవాడు కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనతో పేరూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

**ఆశ్రమ పాఠశాల ముందు బంధువులు ధర్నా**

ఆశ్రమ పాఠశాల ముందు ఆదివాసీ నాయకులు బంధువులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆదివాసీ నాయకులు కోర్స నరసింహమూర్తి మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు అసౌకర్యాలు కల్పిస్తూ వారి అనారోగ్యానికి కారణం అవుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను సరిగా పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారని, పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఆదివాసి విద్యార్థి జ్వరంతో చనిపోతే కనీసం స్పందించిన ఐటీడీఏ విద్యా శాఖ అధికారులు తీరుపై ఆదివాసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# శాస్త్రీయ సంగీతం సార్వజనీయం







### సామాజిక ప్రయోజనాలను చేకూర్చే గేయాలు మాత్రమే మనుగడను కొనసాగిస్తాయి : ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సామాజిక ప్రయోజనాలను చేకూర్చిన గేయాలు మాత్రమే మనుగడను కొనసాగిస్తాయని ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ బాలోత్సవం' ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రజాపాటకు నృత్యనీరాజనం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భవ్య గ్రామర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చేసిన చేసిన నృత్యాలు సభికులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భవ్య గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, నవీన్, బ్రాహ్మణితో పాటు 300 మంది నృత్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నృత్య గురువులు పాల్గొన్నారు. అనంతరం నృత్య విద్యార్థులకు దూరదర్శన్ న్యూస్ రీడర్ విజయ దుర్గ సర్టిఫికెట్లను, మెడల్, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి సుద్దాల అశోక్ తేజ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ భారత దేశంలో 9 నృత్యాలు ఉన్నాయని వాటిని శాస్త్రీయ నృత్యాలుగా గుర్తించిన భరతముని నాట్య శాస్త్రాన్నే అందరూ అనుసరిస్తారని చెప్పారు. ఒకప్పుడు సంపదను, అక్షరాన్ని కైవసం చేసుకున్న వర్గాలు, ఉత్పత్తి వర్గాలకు చదువును కూడా దూరం చేశారన్నారు. తెలంగాణ బాలోత్సవం' ప్రజల వద్దకు 'ప్రజాపాట'ను శాస్త్రీయ నృత్య నీరాజనం పేరుతో తీసుకెళ్ళడం గొప్ప పరిణామమని ఆయన అభినందించారు. శాస్త్రీయ సంగీతం సార్వజనీయమని రుజువైందన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.సుజావతి అధ్యక్షత వహించగా, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి ఎన్. సోమయ్య, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు ఇ.మమత, నృత్య గురువులు, రమణి సిద్ధి, తెలంగాణ బాలోత్సవం కల్చరల్ కో ఆర్డినేటర్ ఇందిరా పరాశరం, నృత్య గురువులు రేణుక ప్రభాకర్, ప్రసూన నూతి, గుమ్మడం శైలజ పాల్గొన్నారు. కాగా ఈ నృత్యనీరాజనం కార్యక్రమం ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగింది.

# హైటెక్ సిటీలో భారీ స్కాం

### ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ సంస్థ పేరుతో రూ.850 కోట్ల వసూళ్లు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** హైదరాబాద్‌లో మరో భారీ స్కాం వెలుగు చూసింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో జరిగిన భారీ మోసం బయటపడింది. చిన్నతరహా పెట్టుబడుల పేరుతో ఫాల్కన్ సంస్థ మోసాలకు పాల్పడినట్లు పోలీసులు సైబరాబాద్ గుర్తించారు. ఈ సంస్థ కేవలం ఒక్క హైదరాబాద్‌లోనే రూ.850 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది.
ఫాల్కన్ క్యాపిటల్ ప్రొటెక్షన్ డైరెక్టర్ కావ్య నల్లూరితో పాటు సంస్థ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్ ఓదెలుపై సైబరాబాద్ పోలీసులు చీటింగ్ కేసులో అరెస్ట్ చేశారు. కాగా వీరు దేశవ్యాప్తంగా 6,979 మంది బాధితుల నుంచి 17 వేల కోట్లు వసూలు చేసిన ఈ ఘరానా మోసం గురించి తెలిసి పోలీసులే కంగుతిన్నారు. బ్రిటానియా, గోద్రెజ్, అమెజాన్ వంటి సంస్థలో పెట్టుబడుల పేరుతో మోసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఫాల్కన్‌కు అనుబంధంగా 14 సంస్థలు ఏర్పాటు చేసి ఈ వసూళ్లకు పాల్పడ్డారు. ఇదిలా ఉండగా ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ (ఎఫ్ఐడి) సంస్థకు చెందిన ముగ్గురు కీలక వ్యక్తులు ఇప్పటికే దుబాయ్‌కి పారిపోయారు. ఎఫ్ఐడి చైర్మన్ అమరీప్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) ఆర్యన్ సింగ్, సందీప్‌లు దుబాయ్ పారిపోయారు. ఈ ముగ్గురిపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. మొత్తం ఈ సంస్థకు చెందిన 20 మందిపై సైబర్ క్రైం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సంస్థకు చెందిన ఆరుగురు ఉద్యోగులు ఇండియాలోనే ఉన్నారని భావిస్తున్న పోలీసులు వీరి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ ఎఫ్ఎస్ఐడీ సంస్థకు చెందిన బిజినెస్ హెడ్ పవన్ సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో ఆఫీస్ ఏర్పాటు చేసుకుని, కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా అమర్ దీప్‌కుమార్, వి.కావ్యలు డైరెక్టర్లుగా మిగిలిన వాళ్లంతా కంపెనీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఉన్నారు. కాగా పోలీసులు ఎ 1గా అమర్‌దీప్ కుమార్ పేరును, ఎ 2గా కావ్య పేరులను చేర్చారు.ఇన్వెస్టర్ల నుంచి ఒక మొబైల్ యాప్ ద్వారా ఈ ఎఫ్ఎస్ఐడీ సంస్థ డబ్బులను కలెక్ట్ చేసిందని పేర్కొన్నారు.

# రష్యా డ్రోన్ దాడిలో ఉక్రేన్ థర్మల్ పవర్‌ప్లాంట్ ధ్వంసం

**కీవ్ :** రష్యా డ్రోన్ల దాడిలో ఉక్రేన్‌లోని ఒక పవర్‌ప్లాంట్ ధ్వంసమైంది. దక్షిణ ఉక్రేన్‌లోని మైఖొలైవ్‌లో రాత్రికి రాత్రి జరిగిన రష్యా డ్రోన్ దాడిలో ఈ పవర్‌ప్లాంట్ ధ్వంసం కావడంలో పెద్దసంఖ్యలో ప్రజలు గడ్డకట్టే చలినుండి రక్షణ కోల్పోయారు. విద్యుత్ లేక హీటర్లు పనిచేయలేదు. వారంతా గడ్డకట్టే మైనస్ ఉష్ణోగ్రతల్లో చిక్కుకున్నారు. 46,000 మంది విద్యుత్ వినియోగదారుల ఇళ్ళల్లో హీటర్లు పని చేయలేదు. వారంతా చలిలో మగ్గిపోతున్నారు. రష్యా రాత్రికిరాత్రే 143 డ్రోన్లతో దాడి చేసింది. ఉక్రేన్, రష్యా మధ్య శాంతి చర్చలు జరుగుతాయన్న వార్తలు ఊపు అందుకున్న తర్వాత ఉక్రేన్‌పై రష్యా దాడులు ఉద్ధృతమయ్యాయని ఉక్రేన్ పేర్కొంది. రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం ప్రారంభమై ఇప్పటికి 1,088 రోజులు దాటింది.

# సాహితీ విహారి

## సమకాలీన సాహిత్యంలో మారుతున్న ధోరణులు!

శాస్త్రవిజ్ఞానం శరవేగంగా విస్తరించడం, ప్రత్యేకించి సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో సమకాలీన సాహిత్యంలో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పాతతరం వారికి తెలిసింది చాలా తక్కువనీ, తమకే ఎంతో విషయపరిజ్ఞానం ఉందని అనుకోవడం ప్రతి తరంలోనూ ఉంటుంది. ఇది నిరంతర ప్రక్రియ. ఐదారు దశాబ్దాల క్రితం వచ్చిన సినిమాల్లో 'పాత రోజులు కావు.. కాలం మారుతున్నది' వంటి డైలాగులు వినిపిస్తాయి. ఇప్పటికీ దాదాపు అదే భావంతో డైలాగులు ఉంటున్నాయి. కాబట్టి సమకాలీనానికి ఒక నిర్దిష్టమైన కాలంగానీ, రూపంగానీ లేవు. సాహిత్యానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. సమకాలీన సాహిత్యం అనేది నిరంతరం అభివృద్ధి చెందుతున్న రంగం. ఇది ఆధునిక సమాజంలోని సంక్లిష్టతలను ప్రతిబింబిస్తుంది. ఇది స్వరాలు, శైలులు, ఇతివృత్తాల వైవిధ్యాన్ని స్వీకరిస్తుంది. అనుకరిస్తుంది. అనుసరిస్తుంది. మరింత కొత్తదనం కోసం వెతుకుతుంది. సమకాలీన సాహిత్యానికి నిర్దిష్టమైన కాలపరిమిత లేకపోయినప్పటికీ, స్థూలంగా చెప్పాలంటే, ఇది రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ముఖ్యంగా 20వ శతాబ్దం చివరి నుండి నేటి వరకు రాసిన పుస్తకాలను సూచిస్తుంది. ఈ కాలంలో సాంప్రదాయ రూపాల నుండి విరామం లభించింది. కథ చెప్పడంలో కొత్త సరిహద్దుల అన్వేషణ జరిగింది. ఇవి ప్రస్తుత సామాజిక, రాజకీయ, సాంకేతిక దృశ్యాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత సాహిత్య ధోరణులను కూడా అందించే ఆధునిక రచనలను సమకాలీన సాహిత్యంగా పేర్కోవచ్చు. ప్రపంచ సాహిత్య దృశ్యాన్ని తీర్చిదిద్దడంలో స్థానిక సాహితీ ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయి. సమకాలీన సాహిత్యాన్ని వివరంగా అర్థం చేసుకోవడానికి, దానిని బాగా అధ్యయనం చేసి, ముఖ్య లక్షణాలను నిర్వచించడం చాలా అవసరం. సరళ నిర్మాణాన్ని అనుసరించే సాంప్రదాయ రచనల మాదిరిగా కాకుండా, సమకాలీన సాహిత్య రచనలు సరళేతర కథనాలు, నమ్మదగని కథకులు, విభిన్న దృక్కోణాలతో జరిగే ప్రయోగాలతో ముందుకెళుతుంది. సాహిత్యంలో ట్రెండ్ అంటే రచయితలు రాసే కాలంలో సాధారణ విధానాలు, ప్రసిద్ధ ఆలోచనలకు సమానమైన భావజాలాలు, రూపాలు, ఇతివృత్తాలు, వ్యక్తీకరణలను సూచిస్తుంది. ఉదాహరణకు ఇటీవల కాలంలో, సాహిత్యంలో విస్తృతంగా ప్రశంసలు పొందిన కొన్ని ప్రసిద్ధ ధోరణులు సమకాలీన ధోరణులు, సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ,



శృంగారం, చారిత్రక రచనలు. నేటి సమకాలీన సాహిత్యం చాలా వరకూ రేపటి చరిత్రగా మారుతుంది. సమకాలీన సాహిత్యం వర్తమాన చరిత్రకు సరైన మార్గాన్ని సృష్టించే కీలక పాత్రను పోషిస్తుంది. సమాజంలోని సామాజిక, రాజకీయ దృక్కోణాలను ప్రతిబింబిస్తుంది. సమాజంలోని బలాలు, బలహీనతల గురించి, ప్రస్తుత సమాజంలోని సామాజిక దురాచారాల గురించి మాట్లాడుతుంది. ఈ సాహిత్యాన్ని చదవడం ద్వారా, ప్రజలు ప్రపంచాన్ని ఎలా చూస్తున్నారో పాఠకుడు అర్థం చేసుకుంటాడు. సమకాలీన సాహిత్యాన్ని చదవడం వల్ల ప్రస్తుత సమాజం పట్ల ప్రజల ప్రతిచర్యలను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. నిజానికి సాహిత్యం అనేక లక్షణాలను కలిగి ఉంటుంది. వివిధ రచనలను చదివేటప్పుడు బాగా అర్థం చేసుకోగల కళాత్మక వ్యక్తీకరణలను కలిగి ఉంటుంది. సమకాలీన సాహిత్యం నాటి సాధారణ స్వరాలకు వేదికను అందిస్తుంది. ఇందులో విభిన్న సాంస్కృతిక, జాతి, సామాజిక నేపథ్యాల రచయితలు కూడా ఉన్నారు. ఈ వైవిధ్యం సాహిత్య పదాల లోతులను ఆవిష్కరిస్తుంది. వాటికి గొప్పతనాన్ని జోడిస్తుంది. మునుపటి సాహిత్యంలో తరచుగా ఒకే కోణాన్ని కలిగి ఉండే హీరోలు, విలన్ల మాదిరిగా కాకుండా, సమకాలీన పాత్రలు బహుళంగా, నైతికంగా ప్రతిష్టాత్మకంగా, వాస్తవగానికి సమీపంగా ఉంటాయి. ప్రపంచ సంక్లిష్టతలను ప్రతిబింబిస్తాయి. సమకాలీన సాహిత్యం తరచుగా జాత్యహంకారం, వాతావరణ మార్పు, లింగ సమానత్వం, ప్రపంచ సంఘర్షణలు వంటి సంబంధిత సామాజిక, రాజకీయ సమస్యలను ప్రస్తావిస్తుంది. వివిధ శైలుల మధ్య తరచు కొత్త రేఖలు కనిపిస్తుంటాయి. కల్పన, నాన్ ఫిక్షన్, కవిత్వం, ఇతరత్రా ప్రక్రియల్లో హింసాత్మక ధోరణులు పెరుగుతున్నాయి. హత్యలు, మానభంగాలు, ఘర్షణల వివరణలు అధికమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే సాహిత్య ధోరణులను అర్థం చేసుకోవడం అవసరం. ఇందుకోసం సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక మార్పులు సాహిత్య ఉత్పత్తిని ఎలా ప్రభావితం చేస్తాయో అన్వేషించాలి. గత కొంతకాలంగా వస్తున్న సాహిత్య పోకడల్లో వెల్లడవుతున్న కొన్ని మార్పులను ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉంది. 20వ శతాబ్దం చివరి భాగంలో ఆధిపత్యం చెలాయించి, నేటికీ కొనసాగుతున్న ముఖ్యమైన సాహిత్య ధోరణులలో 'పోస్ట్ మాడర్నిజం' ఒకటి. ఈ క్షణం దృఢమైన కథన నిర్మాణాలను తిరస్కరిస్తుంది. మెటాఫిక్షన్ వైపు మొగ్గు చూపుతుంది. అప్పటి వరకూ కొనసాగిన మూస విధానాలను కాదని, సాంప్రదాయ గోడను బద్దలు కొట్టి, పాఠకులకు రచన యొక్క కల్పిత స్వభావం గురించి తెలియజేస్తుంది. అదే విధంగా మెటా ఫిక్షన్ విధానం అమల్లోకి వచ్చింది. ఇది తరచుగా రచయితలు వివరాలను నేరుగా ప్రస్తావిస్తుంది. కథలలో అంతర్ కథలను రాస్తుంది లేదా పాత్రలను సృష్టించే ప్రక్రియ గురించి చర్చిస్తుంది. పోస్ట్ మాడర్న్ రచనల్లో తరచు విచ్ఛిన్నమైన, ఇప్పటికే కలిసిపోయిన కథలు దర్శనమిస్తాయి. పాఠకుడిని కథాంశాన్ని ఒకచోట చేర్చే విధానంపై సవాళ్లు విసురుతాయి. ఈ ధోరణి ఇటీవల కాలంలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది.

– బిట్రగుంట

సోషల్ మీడియా రాకతో, ఆధునిక పోకడలు మరింత పెరిగాయి. నిన్నమొన్నటివరకూ అంతగా ప్రాధాన్యంలేని అనేక స్వరాలు నేడు వివిధ రకాల సాహితీ ప్రక్రియల్లో వినిపిస్తున్నాయి. అణగారిన సమూహాలు, శ్రామికులు, బాధితులు, పీడితు లు, స్వలింగ సంపర్కులు.. ఇలా, ఒకప్పుడు ప్రధాన స్రవంతి ప్రచురణకు నోచుకోని వర్గాలన్నీ నేడు సమకాలీన సాహిత్యం లో ముందు వరుసలో ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే, అలాంటి బాధిత వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ రచయితల రచనలు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందుతున్నాయి. ఇటీవలకాలంలో వలసదారుల అనుభవాలను, సంస్కృతులను, వారి జీవన సంక్లిష్టతలను అన్వేషించే రచనలు కూడా పెరుగు తున్నాయి. సూక్ష్మంగా చెప్పాలంటే, గతంలో ఎవరూ పట్టించుకోని జీవితాలు నేడు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. సమకాలీన సాహిత్యంలో పెనుమార్పులు తెస్తున్నాయి. కాగా, ఇటీవల కాలంలో వస్తున్న మరో ప్రక్రియ 'ఆఫ్రోఫ్యూచరిజం'. ఇది చరిత్ర, సంస్కృతి, భవిష్యత్ సాంకేతికత అంశాలను మిళితం చేసే సాహిత్యం. ఇందులో ఆఫ్రికన్ పదాలు... అంశాలే ఉంటాయి. అయితే, దీని ఆధారంగా ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సాహిత్యం విరివిగా వస్తున్నది. అందులో భాగంగానే 'డయాస్పోరా' సాహిత్యాన్ని పేర్కోవాలి. ఆధునిక సాహిత్యం తరచు వలసదారు ల అనుభవాలను, సంస్కృతుల మధ్య జీవన సంక్లిష్టతలను అన్వేషించడా న్ని డయాస్పోరా సాహిత్యంగా చెప్పవచ్చు.



మారుతున్న కాలంలో పర్యావరణం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన సాహిత్యం నిన్నమొన్నటి వరకూ, దాదాపుగా లేదనే చెప్పాలి. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. రచయితలు కూడా పర్యావరణ సమస్యలపై గళమెత్తుతున్నారు. సమకాలీన సాహిత్యం పర్యావరణం పట్ల పెరుగుతున్న ఆందోళనను ప్రతిబింబిస్తున్నది. ముఖ్యంగా కర్బన ఉద్గారాల పెరుగుదలతో. ఈ తరహా రచనల ఆవస్యకత పెరిగింది. పర్యావరణ మార్పుల ప్రభావం భూగోళంపై, జీవజాలంపై ఏ విధంగా ఉంటున్నదో వివరిస్తున్న పలు రచనలు, రాబోయే కాలంలో ఎదురయ్యే సమస్యలపై హెచ్చరికలు కూడా చేస్తున్నాయి. రాజకీయ కోణంలో ఈ సమస్యను చూడడం సరికొత్త మార్పు.

## సస్పెన్స్ థ్రిల్లర్స్‌కు ఆద్యుడు బ్లోచ్



కేవలం ఆంగ్లంలోనేకాదు... ప్రపంచ సాహిత్యంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ అంటే ముందుగా గుర్తుకొచ్చే పేరు ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్. సస్పెన్స్‌కు మారుపేరైన అతను మరో రచయిత నుంచి స్ఫూర్తిపొందాడన్న విషయం చాలా తక్కువ మందికి తెలుసు. హిచ్‌కాక్‌నేకాదు... ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది రచయితల కు, ప్రత్యేకించి సైకిక్, సస్పెన్స్ రచయితలకు మార్గదర్శకుడిగా నిలిచిన వ్యక్తి రాబర్ట్ బ్లోచ్. 1950 దశకంలో అతను రాసిన కథలు, నవలలు యావత్ ప్రపంచాన్ని ఉత్కంఠతలూగించాయి. 'సైకో' నవల ఇప్పటికీ అత్యుత్తమ సస్పెన్స్ థ్రిల్లర్‌గా అభిమానుల మన్ననలు పొందుతున్నది. తన గదిలో, పుస్తకాలు... కాగితాల మధ్య అతను నిర్విరామంగా నోట్స్ రాసుకునేవాడు. రచనలను టైప్ చేసేవాడు. మానవ సంబంధాలను అంచనా వేయడంలో, మనుషుల్లోని చీకటి కోణాలను అధ్యయనం చేయడంలో బ్లోచ్‌ను మించిన వారు లేరని అంటారు. మనుషుల్ని చదివాడు కాబట్టే, అతని రచనలు అంతగా పాఠకులను అలరించగలిగాయి. సస్పెన్స్ థ్రిల్లర్స్‌ను ఎలా రక్తి కట్టించాలో అతనికి తెలిసినంతగా మరెవరకీ తెలియదు. అందుకే బ్లోచ్‌ను ఈ తరహా రచనలకు ఆద్యుడిగా పేర్కొంటారు.




## ప్రజల భాష 'కోక్బోరోక్'



కోక్బోరోక్ భాషను ప్రజల భాష లేదా మనిషి భాష అంటారు. మిగతా భాషలు మనిషి భాషలు కావని దీని అర్థం కాదు. కోక్బోరోక్ అంటేనే మనిషి భాష లేదా బోరోక్ ప్రజల భాష అని అర్థం. పాఠ్యపుస్తకాలు, అధికారిక వినియోగంలో కోక్బోరోక్ (సైనోటిబెటన్ భాష) కోసం రోమన్ లిపిని చేర్చాలని ఇటీవల త్రిపుర అసెంబ్లీ వద్ద ట్విప్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) సభ్యులు ఆందోళన చేశారు. వారిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కోక్బోరోక్ భాష గురించిన ఆసక్తి మొదలైంది. కోక్బోరోక్, డెబ్బర్మ, రియాంగ్, జమాటియా తదితరులతోసహా త్రిపులలో బోరోక్ ప్రజలకు కోక్బోరోక్ మాతృభాష. కోక్బోరిక్ అనేది కోక్ (భాష), బోరోక్ (మనిషి) అనే రెండు పదాల కలయికతో ఏర్పడింది. అంటే ఇది మనిషి లేదా భోరోక్ భాష. కోక్బోరోక్ భాషను తొలుత కొలోమా లిపిలో రాసేవారు. కానీ, ఇప్పుడు ఆ లిపి లుప్తం కాగా, స్థానిక లిపి లేదు. కొంతమంది బెంగాలీ లిపిలో రాస్తారు. ఈ భాష కనీసం క్రీస్తు శకం ఒకటో శతాబ్దం నుంచి ఉనికిలో ఉన్నట్టు చారిత్ర ఆధారాలు ఉన్నాయి. రాజరత్నాకర్, త్రిపుర రాజుల చరిత్ర, మొదటి దుర్లోబేంద్ర చోంటై తదితరాలను కోక్బోరిక్ భాషలో, కొలీమా లిపిలో రాశారు. కాగా, కోక్బోరోక్‌ను 1979లో త్రిపుర అధికారిక భాషగా గుర్తించారు. అంటే, బెంగాలీ తర్వాత త్రిపురలో అత్యధిక శాతం మంది మాట్లాడే భాష ఇది. ఇలావుంటే, కోక్బోరోక్‌ను గిరిజన సమూహాలు ఇష్టపడతాయి. గత కొన్ని దశాబ్దాలుగా ఈ భాషను రోమన్ లిపిలో రాస్తున్నారు.శ్యామ చరణ్ త్రిపుర, పవిత్రా సర్కార్ నేతృత్వంలోని రెండు కమిషన్లు రోమన్ లిపికి మద్దతు ఇచ్చాయి. అయితే, అక్కడి ప్రభుత్వం బెంగాలీకి ప్రాధాన్యత ఇచ్చింది. గిరిజన సంస్థలు తమ ప్రత్యేక గుర్తింపుకు, సాంస్కృతిక వారసత్వానికి భంగం కలుగుతుందనే ఉద్దేశంతో బెంగాలీ లేదా దేవనాగరి లిపిలను వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కోక్బోరిక్ భాషను రాసేందుకు అధికార లిపిగా రోమన్ లిపిని ప్రకటించాలని అక్కడి గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.



## పట్టువదలని క్రీసీ..



పట్టువదలని విక్రమార్కుడి కథలు చాలా మంది చదివే ఉంటారు. అయితే ఎన్నో అద్భుతమైన సస్పెన్స్ థ్రిలర్ నవలలను రాసిన ప్రముఖ ఆంగ్ల రచయిత జాన్ క్రీసీ మొండి పట్టు గురించి ఎక్కువ మందికి తెలిసి ఉండకపోవచ్చు. 1908లో జన్మించిన క్రీసీకి రచనా వ్యాసాంగం అంటే ఎంతో ఇష్టం. ఎంతో కష్టపడి రచనలు చేసేవాడు. కానీ, వాటిని ఎక్కడికి తీసుకెళ్లినా 'వద్దు' అనే సమాధానమే ఎదురయ్యేది. ఒకటి కాదు... రెండుకాదు.. ఏకంగా 743 పర్యాయాలు 'నో' అనే సమాధానమే వచ్చింది. చాలా మంది ఒకటిరెండు ప్రయత్నాల తర్వాత, రచనలను విరమించుకుంటారు. కొందరు పదుల సంఖ్యలో తిరస్కరణలు ఎదురయ్యే వరకూ వేచిచూస్తారు. కానీ, వందల సార్లు పబ్లిషర్లు, మ్యాగజైన్ల యజమానులు 'కాదు' అని తిరస్కరించినా... 'వీటినీ రచనలు అంటారా' అని హేళన చేసినా క్రీసీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. 'ప్రతి తిరస్కరణ నాలో కసిని పెంచేది. అంతేకాదు, నేను ఎక్కడ పొరపాటు చేస్తున్నాననే ది ఒకటికి పదిసార్లు తనిఖీ చేసుకోవడానికి ఉపయోగపడే ది. పబ్లిషర్లు కాదు అని సమాధానం ఇచ్చిన ప్రతిసారీ నేను నా ఆలోచనలకు మరింత పదును పెట్టాను. కథను, కథనాన్ని ఆకర్షణీయంగా ఉండేలా ప్రయత్నించాను. రచనల్లో మెరుగులు చేసుకున్నాను' అంటాడు క్రీసీ. ఒకప్పుడు కాదన్న వారే ఎగబడి తన రచనలను కోరుకునే స్థాయికి ఎదిగాడు. 600లకు పైగా నవలలు రాశాడు. సస్పెన్స్ థ్రిల్లర్స్‌కు పర్యాయపదమయ్యాడు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించాడు ఈ పట్టువదలని ఆధునిక విక్రమార్కుడు.

అరుదైన ఫొటో



అరుదైన ఈ చిత్రంలో ఎడమ నుంచి కుడికి ప్రముఖ రచయితలు సాహిర్ లూధియాన్వీ, మజ్రూ సుల్తాన్‌పురి, సంగీత దర్శకుడు నౌషాద్, జాన్ నిసార్ అక్తర్, సంగీత దర్శకుడు ఆర్‌డి బర్మన్, ఉర్దూ సాహితీవేత్త అక్తరుల్ ఇమాన్, పంజాబ్, ఉర్దూ కవి ఫైజ్ అహమ్మద్ ఫైజ్, రచయిత రాజేందర్ సింగ్ బేదీ



## ప్రగతిశీల సాహితీ ఉద్యమకర్త నిసార్ అక్తర్

బాలీవుడ్‌లో ఎన్నో సినిమాలకు కథను, స్క్రీన్‌ప్లేను అందించి, అద్భుతమైన పాటలు రాసిన బహుముఖ ప్రజ్ఞాశాలి జావేద్ అక్తర్ గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. పద్మశ్రీ (1999), పద్మభూషణ్ (2002), సాహిత్య అకాడెమీ పురస్కారం (2013) వంటి ఎన్నో అవార్డులను సాధించిన జావేద్ అక్తర్‌ది తాతముత్తాతల నుంచి కవి కుటుంబం. ఆయన తండ్రి జాన్ నిసార్ అక్తర్ (18 ఫిబ్రవరి 1914–19 ఆగస్టు 1976) ఉర్దూ కవి. ప్రగతిశీల సాహిత్య ఉద్యమకర్త. బాలీవుడ్ గేయ రచయిత. 'ఖాక్ ఎ దిల్'(ది యాషెస్ ఆఫ్ హార్ట్) (1973) వంటి రచనలతో భారతీయ సాహిత్యంపై తనపైన ముద్ర వేశాడు. జాన్ అక్తర్ తండ్రి ముజ్తార్ ఖైరాబాదీ, ముత్తాత ఫజల్ ఎ హక్ ఖైరాబాదీ కూడా రచయితలే కావడంతో, జాన్ అక్తర్ చిన్నతనం నుంచి సాహిత్యంపై మక్కువ పెంచుకున్నాడు. బాలీవుడ్ గేయ రచయితగా సుమారు నాలుగు దశాబ్దాలు సాగిన కెరీర్‌లో అతను సి.రామచంద్ర, ఒపి నయ్యర్, దత్తా నాయక్, ఖయ్యామ్ వంటి ప్రఖ్యాత సంగీత దర్శకులకు 151 పాటలు రాశాడు. సిఐడిలో 'ఆంఖో హి ఆంఖోమే, ప్రేమ్ పర్బత్‌లో 'యే దిల్ ఔర్ ఉన్‌కీ నిగాహోకే సాయే', నూరీలో 'ఆజారే ఆజారే ఒ మేరె దిల్‌భర్ ఆజా' వంటి పాటలు హిందీ సినీ జగత్తులో చిరస్థాయిగా నిలిచిపోతాయి. 1983లో వచ్చిన రజియా సుల్తాన్ చిత్రంలో రాసిన 'ఆయే దిల్ ఏ నాదాన్' జాన్ అక్తర్‌కు చివరి పాట. సాహితీవేత్తల కుటుంబంలో జన్మించిన అతను గ్వాలియర్‌లోని విక్టోరియా కాలేజియేట్ హై స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాడు. 1930లో అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలో చేరి, బిఎ ఆనర్స్, తదుపరి ఎంఎ డిగ్రీలను పొందాడు. సాహిత్యంలో పిహెచ్‌డి చేద్దామనుకున్నప్పటికీ, కుటుంబ పరిస్థితుల కారణంగా తిరిగి గ్వాలియర్ వెళ్లాడు. అక్కడ ఉద్యోగంలో చేరినప్పటికీ, 1949లో రాజీనామా చేసి, గజల్స్, సాధారణ ప్రచురణ కోసం నాజ్మ్‌లతోపాటు ఉర్దూఇ హిందీ సినిమాలకు పాటలు రాయాలనే సంకల్పంతో బొంబాయి (నేటి ముంబయి)కి వెళ్లాడు. అక్కడ అతనికి ముల్క్ రాజ్ ఆనంద్, క్రిషన్ చందర్, రాజిందర్ సింగ్ బేడీ, ఇస్మత్ చుగ్తాయ్ వంటి ఇతర ప్రగతిశీల రచయితలతో పరిచయం ఏర్పడింది. ఈ బృందాన్ని 'బాంబే గ్రూప్ ఆఫ్ రైటర్స్' అని పిలిచేవారు. జాన్ అక్తర్‌కు సినిమా గేయ రచయితగా విజయం చాలా ఆలస్యంగా వచ్చింది. దీనితో కుటుంబ భారాన్ని అతని భార్య భుజాన వేసుకుంది. భోపాల్‌లో ఉంటూ, భర్తకు మద్దతునిచ్చింది. 1953లో ఆమె కేన్సర్‌తో మరణించడంతో జాన్ అక్తర్ కుంగిపోయాడు. అయితే, బాలీవుడ్‌లో తన ప్రయత్నాలు మానుకోలేదు. ఎట్టకేలకు 1955లో వచ్చిన యాస్మీన్ చిత్రం ద్వారా, సి.రామచంద్ర సంగీత దర్శకత్వంలో గుర్తింపు లభించింది. సంగీత దర్శకుడు మదన్ మోహన్‌తో అతని అనుబంధం అనేక చిరస్మరణీయ సినిమా పాటలకు దారితీసింది. జాన్ అక్తర్ పాటలు, గజల్స్, కవితలు, ఇతర రచనలో లౌకిక భావాలు గోచరిస్తాయి. ఆయన తరంలోని అనేక మంది ప్రగతిశీల రచయితల మాదిరిగానే స్వేచ్ఛ, గౌరవం కోసం ఆయన పరితపించాడు. ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా కలం కదిపాడు. ప్రగతిశీల రచయితగా పేరు సంపాదించాడు. బాలీవుడ్‌లో అతని లెగసీని కుమారుడు జావెద్ అక్తర్ కొనసాగిస్తున్నాడు.

## సమాజానికి దూరంగా...



ఆంగ్ల రచయిత్రుల్లో ప్రముఖంగా పేర్కోదగిన పేరు ఎమిలీ డికెన్సన్ (10 డిసెంబర్ 1830– 15 మే 1886). నలుగురితో కలవడానికి ఆమె మొదటి నుంచి ఇష్టపడేది కాదు. అందరికీ దూరంగా, ఒంటరిగా ఉండేది. ఈ కారణంగానే, మాసెచూసెట్స్‌లోని ఆమ్‌హెర్స్ట్‌లోని తాతలకాలం నాటి ఇంటికి పరిమితమైంది. ప్రత్యక్షంగా ఎవరినీ కలవకపోయినప్పటికీ, సన్నిహితులు, స్నేహితులు, కుటుంబ సభ్యులను తరచు ఉత్తరాలు రాసేది. పలువురితో తన అభిప్రాయాలను, రచనలను పంచుకునేది. ప్రత్యేకించి, ప్రముఖ సంపాదకుడు థామస్ వెంట్‌వర్త్ హిగిన్సన్‌కు తన రచనలు పంపి, అభిప్రాయం తెలుసుకునేది. 1860 దశకం నుంచి పూర్తిగా తెల్లదుస్తులే ధరించడం ప్రారంభించింది. ఈ నిర్ణయంపై పలువురు పలురకాలుగా వ్యాఖ్యలు చేసేవారు. అయినప్పటికీ ఆమె తన వైఖరి మార్చుకోలేదు. ఒంటరిగా ఉండడం వల్ల ఆత్మపరిశీలన సాధ్యమని చెప్పే ఎమిలీ డికెన్సన్ సుమారు 1800కవితలు, పద్యాలు రాసింది. ప్రముఖ రచయిత్రిగా పేరు సంపాదించింది.

## సాపేక్షతా సిద్ధాంతం

ఆకలి ఆవేదనపు శూన్యాన్ని
అక్షర ఆలోచనపు అనంతాన్ని
కొన్ని దశాబ్దాలుగా ఆవాహనం
చేసుకున్నవాణ్ణి..!

జీవితం లేని జీతాన్ని
జీతం లేని జీవితాన్ని
ఒకేలాగా ప్రేమించి జీవన ప్రయాణపు
పరిమళాన్ని అన్వేషించినవాణ్ణి..!

శూన్యమే సత్యం
అనంతం దానినైజం
శూన్యంలోని అనంతం
అనంతంలోని శూన్యం
ఫిజిక్స్‌లోని ఫిలాసఫీ
ఫిలాసఫీ లోని పొయెట్రీ
పుట్టుకలోని చావు
చావులోని పుట్టుక
ఇలాంటి వన్నీ అంతుచిక్కనివే!
ఇవన్నీ పర్యాయపదాలే..!
ఇదే నా సాపేక్షతా సిద్ధాంతం..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్,
9394749536



## జీవితం

కళ్ళల్లో వెలిగారిపోయే
కాకరకొవ్వొత్తుల వెలుగులు
పెదాలపై ప్లాస్టిక్
పువ్వుల నవ్వులు

గుండెల్లో కల్తీ
సిమెంట్ కట్టుబడులు
చుట్టూ నకిలీ ప్రేమకు
జీవంపోసే మహానటులు

చేతిగీతల్లో జీవితం
దాగుందన్న భ్రమ
పండిన గోరింటాకులో
పతిదేవుని ప్రేమనూహించుకునే
పతివ్రత

కాలికి నల్లతాడు కడితే
నిమ్మకాయ తొక్కినా ఏ గాలి
సోకదనీ
అరికాల్లో కాటుకెట్టుకుంటే
సైతాన్ వెంటాడ (ద) నీ

మూఢనమ్మకాల
ముసుగులో నలిగిపోతూ
నలుగురిలో నేనొకడ్ని అన్నట్టు
జీవితాన్ని నెట్టేస్తూ..

పరిస్థితులకు తగ్గట్టు నటిస్తూ...
నటననే ఏరు వేసి,
బలానికి నీరు పోస్తూ...
బ్రతుకునావ నడిపేస్తున్నావా..!!

వాసి జ్యోత్స్న
9866843005

## ఈ వారం కవితలు

## చెమటను నమ్మితే..

తడి బట్టను పిండితే నీరొస్తుంది
కాయకష్టం చేస్తే చెమటతో..
దేహం తడిసి ముద్దవుతుంది
నీ చెమట పక్కోడికి కంపు కావచ్చు
నీకు అదో సువాసనల అక్షయపాత్ర !

నేలకు నీరందిస్తే పంటొస్తుంది
ఒంటిని చెమటతో తడిపితే..
అపూర్వ విజయం వరిస్తుంది
చెమట నీ విజయ ఇంధనం !

చెమట కక్కినోడి శరీరం..
ఆయురారోగ్య సౌభాగ్యం
చెమటను దాచినోడి దేహం
సకల రోగాల కేరాఫ్ అడ్రస్ !

చెమటను నమ్మినోడు..
చెట్టంత ఎదుగుతాడు
ఇతరుల చెమటపై ఆధారపడ్డోడు..
పరాన్నజీవిగా మిగిలిపోతాడు !

మధుపాళీ
9949700037



## శ్రీశ్రీ కళ్లతో నేరుగా

అతని కళ్లనుంచి నిన్నటి స్వప్నం /
కన్నీళ్లు కారుస్తూ రాలిపోయింది
చూస్తున్నాడు నేడు శ్రీశ్రీ కళ్లతో
రేపటి చెమట చుక్కల వైభవానికి
నేడు పిడికిళ్లు బిగించే చేతులకోసం

డాక్టర్ కె.జి. వేణు,
98480 70084



## ఇల్లాలి సేవ

తొలి కోడి కూతతో లేచి ఇంట్లో పనులని
చక్కపెడుతూ పిల్లలను స్కూల్ కి రేడి చేస్తూ
శ్రీవారు ఆఫీస్ కి వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తూ
అత్త మామకు టైంకి టీ టిఫిన్ పెడుతూ....

కుటుంబ బాధ్యతలు మోసే రెండవ వ్యక్తి
భార్య భర్తకు తోడు నీడగా ఉంటూ
అమ్మగా, కోడలిగా విధులు నిర్వర్తిస్తూ
ఇంటికి వచ్చే బంధు మిత్రులను గౌరవిస్తూ
యంత్రంలా వంటగదిలో వారికి కావాల్సిన
స్వీట్లు పిండి పదార్థాలు చేసి పెడుతూ...

రోజంతా ఇంట్లో పనులతో బిజీగా
గడుపుతూ ఇంటిని చక్క పెడుతూ



పిల్లల చదువుతో పాటు యోగ క్షేమాలు
చూసుకుంటూ ఇల్లాలి పాత్ర పోషిస్తూ....

అమ్మ పిల్లల లక్ష్యములే తన ఆశయాలుగా
పిల్లల కోరికలే తన ఇష్టాలుగా అత్తమామ
విలువలే తన సిద్ధాంతాలుగా భర్త కుటుంబ
బాధ్యతలో కష్ట సుఖాలలో పతికి తోడుంటూ
కుటుంబం కోసం జీవితాన్నే త్యాగం చేస్తూ
మంచి ఇల్లాలుగా జీవనం సాగిస్తుంది.

మిద్దె సురేష్
9701209355

# ‘ఇది నిర్వహణ లోపమే’

**తొక్కిసలాటపై ప్రతిపక్షాల ఆరోపణ**

**రైల్వే మంత్రి రాజీనామాకు డిమాండ్**



**న్యూఢిల్లీ :** ఢిల్లీ స్టేషన్ తొక్కిసలాట స్థలంగా నిర్వహణ లోపమేనని ప్రతిపక్షాలు ఆదివారం ప్రభుత్వంపై విరుచుకు పడ్డాయి. 18మంది మృతికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ సహా తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, వి లెఫ్ట్ పార్టీలు స్టేషన్‌లో సరైన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మృతుల వాస్తవ సంఖ్యను వెల్లడించడలోనూ ప్రభుత్వం గోప్యత పాటిస్తోందని ఆరోపించాయి. అయితే ఢిల్లీ స్టేషన్‌లో పరిస్థితి యథాస్థితి చేసుకుందని బిజెపి నాయకులు సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి అనుకూలంగా ఫొటోలను పోస్టింగ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిజాన్ని దాచేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని, ఖండించదగినదని వ్యాఖ్యానించారు. రైల్వే మంత్రి రాజీనామా చేయాలని, దేశానికి క్షమాపణలు చెప్పాలని ఏఐసిసి వేదికగా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే లక్షలాది ప్రయాణికులకోసం స్టేషన్‌లో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉండాల్సిందని, ఈ సంఘటన మరోసారి రైల్వేల వైఫల్యాన్ని, ప్రభుత్వ చిత్తశుద్ధి తెలియజేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనేత విలేకరులతో మాట్లాడుతూ దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి రాజీనామా చేయాలని, ఒక వేళ రాజీనామా చేయకపోతే స్టేషన్ నిర్వహణ లోపం కారణంగా అతడిని పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 'మాది ఒకే డిమాండ్. ఢిల్లీ స్టేషన్ దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి రాజీనామా చేయాలి. ఒక్క క్షణంకూడా పదవిలో కొనసాగే హక్కు మంత్రికి లేదు. బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి లేకుంటే వెంటనే తొలగించాలి' అన్నారు. 'రైల్వే మంత్రి సిగ్గులేకుండా తన పదవిని అంటిపెట్టుకుని ఉన్నారు. ఢిల్లీ స్టేషన్‌లో జరిగినది ప్రమాదం కాదు, అది ఊచకోత' అని తీవ్రస్వరంతో అన్నారు. ఇటువంటి వ్యక్తి చేతుల్లో రైల్వేను, ప్రజలను ఉంచడం ప్రమాదకరమన్నారు. మాజీ రైల్వే మంత్రి పవన్‌కుమార్ బన్సాల్ మాట్లాడుతూ దుర్ఘటనకు పూర్తి బాధ్యత మంత్రి వహించాలన్నారు, దానినుంచి ఆయన తప్పించుకోలేరన్నారు. తీర్థయాత్రికుల రాకను అంచనా వేయడంలో, అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆర్‌జెడి అధినేత, రైల్వే మాజీ మంత్రి లాలు ప్రసాద్ స్పందిస్తూ తొక్కిసలాట వార్త చాలా బాధించిందని, తగిన ఏర్పాట్లు చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని చూపుతోందని అన్నారు. ఇందుకు బాధ్యతగా రైల్వే మంత్రి రాజీనామా చేయాలన్నారు. ఇది పూర్తిగా రైల్వేల వైఫల్యమన్నారు. ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ప్లాట్‌ఫామ్‌ల ప్రకటనలో గందరగోళమే దుర్ఘటనకు కారణమని తెలుపుతూ 'ప్రభుత్వం ఒక దుర్ఘటన జరిగిందన్న విషయాన్ని తేలికగా తీసుకుంటోంది. ఇంకా ఎంత కాలం ప్రభుత్వం బాధ్యతలను విస్మరిస్తుంది' అని ప్రశ్నించారు. ఆప్ రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దా తొక్కిసలాట అందరినీ కలవరపరిచిందని, ఇది పూర్తిగా నిర్వహణ లోపమేనన్నారు. నిర్వహణ లోపానికి బాధ్యులైన వారినే తొక్కిసలాటకు కారకులను చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మృతులకు సంతాపం తెలియజేస్తూ సంఘటనపై స్వతంత్ర, న్యాయ వ్యవస్థ పర్యవేక్షణలో ఒక దర్యాప్తు బృందాన్ని నియమించాలని, రైల్వే శాఖ వైఫల్యాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మృతులకు సంతాపం తెలుపుతూ ఇకనైనా ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని సరైన నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ మాట్లాడుతూ రైల్వే మంత్రికి ప్రచారం చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల భద్రతపై లేదన్నారు. ప్రజల భద్రతపై రైల్వేల వైఫల్యాన్ని ఇది నిదర్శనమన్నారు. రైల్వే మంత్రి పదవిలో కొనసాగేందుకు ఏ మాత్రం అర్హుడు కాదన్నారు. ఇంకా ఎంత మంది ప్రాణాలు బలిగొంటారు అని ప్రశ్నించారు. టిఎంసి రాజ్యసభ డిప్యూటీ లీడర్ సాగరిక ఘోష్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని, మాటలకందని దుర్ఘటన ఇది అన్నారు. దుర్ఘటనకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని పార్టీ సభ్యుడు సాకేత్ గోఖలే ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఢిల్లీ స్టేషన్‌లో తొక్కిసలాట పలు రైళ్ల ఆలస్యంగా నడిచేందుకు కారణమైందని, రైల్వేల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని సిపిఐ(మార్క్సిస్ట్–లెనినిస్ట్) వ్యాఖ్యానించింది.

# ఎన్నడూ ఇంతటి రద్దీ చూడలేదు

**ప్రత్యక్ష సాక్షి వివరణ**

**న్యూఢిల్లీ :** ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం జరిగిన దుర్ఘటనపై పలువురు ప్రత్యక్ష సాక్షులు తమ అనుభవాలను వెల్లడించారు. ఇటువంటి సంఘటన ఎన్నడూ చూడలేదని స్టేషన్‌లో వ్యాపారం చేసుకునే రవికుమార్ అనే వ్యాపారి తెలిపాడు. తన జీవితంలో ఎన్నడూ ఇంతటి రద్దీ ఎరుగనని, ఎటు చూసినా ప్రయాణికులతో స్టేషన్ క్రిక్కిరిసి ఉందన్నాడు. రైళ్ల ప్లాట్‌ఫామ్ మారినట్టు ప్రకటన రావడంతో ప్రయాణికులు





ఒక్కసారిగా ఉరుకులు పెట్టారని, దీనితో తొక్కిసలాట జరిగిందన్నాడు. ‘12, 14, 15 ప్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులతో నిండిపోయాయి. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అప్పటికే ఒక ప్లాట్‌ఫామ్‌పై ఉంది. వేలాదిగా ఉన్న ప్రయాణికులు తమ రైళ్లను అందుకోడానికి ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో పలు రైళ్లు ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సి ఉంది. కుంభమేళా ప్రయాణికులతో స్టేషన్ కిటకిటలాడుతోంది. ఇంతలో ప్రయాగ్‌రాజ్ వెళ్లే మరో రైలు రాకను ప్రకటించడంతో ప్రయాణికులు ఒక్కసారిగి ఆ ప్లాట్‌ఫామ్ చేరుకునేందుకు ఒకరినొకరు తోసుకోవడంతో ఈ సంఘటన జరిగింది. కిందకు దిగేవాళ్లతో, పైకి ఎక్కేవాళ్లతో ఫుట్‌వోవర్ బ్రిడ్జి క్రిక్కిరిసిపోయింది. దానికితోడు ప్లాట్‌ఫామ్‌లను కలిపే ఫుట్‌వోవర్ బ్రిడ్జి చిన్నది కావడంతో తొక్కిసలాట జరిగింది. ఒకరిపై ఒకరు పడిపోయారు. మహిళలు, పిల్లలు తొక్కిసలాటకు బలయ్యారు. ఎటుచూసినా చెల్లాచెదురుగా చెప్పులు, బ్యాగులు, ఇతర వస్తువులు కనిపించాయి’ అని కుమార్ తెలిపాడు. 12, 14, 16 ప్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులతో నిండిపోయాయని, ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైళ్లన్నీ రద్దీగా ఉన్నాయని కుమార్ తెలిపాడు. పహర్‌గంజ్‌కు చెందిన వేదరాజ్ అనే ప్రయాణికుడు తన భార్యతో కలిసి ప్రయాగ్‌రాజ్ వెళ్లాలని స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ రద్దీని చూసి వెనక్కి వెళ్లిపోవాని నిర్ణయించుకున్నాడు. ‘కొన్ని రైళ్లలో నిలుచునేందుకు కూడా చోటు లేదు. వెనక్కి వెళ్లిపోదామని నిర్ణయిచుకున్నా’ అని తెలిపాడు. రైలుదిగి ప్లాట్‌ఫామ్‌పై నిలుచోవడంతో బతికిపోయానని చెప్పాడు. పూనమ్ దేవి అనే మృతురాలి బంధువు ఒకరు మాట్లాడుతూ ఆమె బిహార్‌లోని స్వస్థలానికి వెళ్లేందుకు శనివారం రాత్రి స్టేషన్‌కు చేరుకుందన్నారు. ‘స్టేషన్‌లో విపరీతమైన జనం ఉన్నారు. ఆమె ఎక్కవలసిన రైలు 12నంబరు ప్లాట్‌ఫామ్‌కు రావాల్సి ఉంది. ప్రకటన వెలువడగానే ప్రజలు ఒకరినొకరు తోసుకోవడం మొదలైంది. కిందపడిపోయనవారు కాళ్లకింద నలిగిపోయారు’ అని ఆవేదనగా తెలిపారు. బిహార్‌లోని చప్రాకు వెళ్లేందుకు ఒక మహిళకూడా తొక్కిసలాటలో మృతిచెందింది. ఆమె కుమారుడు మాట్లాడుతూ ‘మేమంతా ఒక బృందంగా స్వస్థలానికి వెళ్లేందుకు స్టేషన్‌కు చేరుకున్నాము. తొక్కిసలాటలో నా తల్లి ప్రాణాలు కోల్పోయింది. ప్రయాణికులు ఒకరినొకరు తోసుకోవడంతో మా తల్లి తొక్కిసలాటకు బలైంది’ అని కన్నీటితో తెలిపాడు. ‘నేను ప్రయాగ్‌రాజ్ వెళ్లాలని ఇక్కడకు వచ్చాను. కొనిన రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడం, కొన్ని రద్దు కావడతో స్టేషన్‌లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. స్టేషన్‌లో ఎన్నడూ ఇంతమంది జనాన్ని చూడలేదు. తొక్కిసలాట అనంతరం కొందరు మహిళలను నా ఎదుటనుంచే స్ట్రెచర్‌పై తీసుకెళ్లడం బాధించింది’ అని ధర్మేంద్ర సింగ్ అనే ప్రయాణికుడు తెలిపాడు.

# నాయకత్వ మార్పు లేదు

**ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే : శివకుమార్**



**బెంగళూరు :** కర్నాటక కాంగ్రెస్ పార్టీలో వివాదరహిత నేత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె. శివకుమార్ కొనియాడారు. ఆయన పేరును దుర్వినియోగపరుస్తూ ఎవరు కూడా వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆదివారం శివకుమార్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఒక వర్గానికి చెందిన కొందరు నేతలు సిద్ధరామయ్య పూర్తి కాలం ముఖ్యమంత్రిగా పనిచేయాలని వాదిస్తున్న నేపథ్యంలో శివకుమార్ పైవిధంగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధ నాయకత్వం కీలకమైనదన్నారు. ఈ ఏడాది తరువాత నాయకత్వ మార్పు ఉంటుందని ఊహాగానాలు వస్తుండగా శివకుమార్ వాటిపై కూడా స్పందించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన శివకుమార్, ముఖ్యమంత్రి పదవిని బలంగా ఆశించే వ్యక్తి, అయినప్పటికీ ముఖ్యమంత్రి కావాలనే తన ఆశయాన్ని పదే పదే రహస్యంగా ఉంచుతూనే ఉన్నారు. కాగా, సిద్దరామయ్యే తమ నేత అని, అన్ని ఎన్నికల్లో ఆయన ఉండాలన్నారు. జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన నాయకత్వం అవసరమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారాన్ని నిలుపుకోవాలంటే సిద్ధరామయ్య పార్టీకి ఎంతో అవసరమని చేసిన ప్రకటనలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ సిద్ధ మా నాయకుడు అని శివకుమార్ అన్నారు. ‘కాంగ్రెస్ పార్టీ సిద్ధరామయ్యను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసింది. ప్రతిరోజూ ఎవరూ ఆయన పేరును దుర్వినియోగం చేయవలసిన అవసరం లేదు. ఆయన మా నాయకుడు, కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని నాయకుడు. ఆయన రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. ఆయన మీడియాకు (ఊహాగానాలు) ఆహారంగా మారాలని నేను కోరుకోవడం లేదు’ అని అన్నారు. పార్టీ నాయకులు చేసిన ప్రకటనల గురించి అడిగినప్పుడు, శివకుమార్ మాట్లాడుతూ ‘ఎటువంటి గందరగోళం లేదు, కాంగ్రెస్ పార్టీ ప్రతిరోజూ ప్రతిదీ గమనిస్తోంది’ అని బదులిచ్చారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ విజయం తర్వాత 2023 మే నుండి ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యకు ఇది రెండవసారి. ఆయన గతంలో 2013–18 వరకు ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. గత నెలలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అనవసర వ్యాఖ్యలు చేయకుండా పాలనపై దృష్టి పెట్టాలని సహచరులకు హెచ్చరించినప్పటికీ సిద్ధరామయ్య శిబిరంలో ఉన్న ఒక వర్గం నాయకులు, మంత్రులు ఆయన పదవిలో కొనసాగాలని వాదిస్తున్నారు. 2023 మేలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య అత్యున్నత పదవి కోసం గట్టి పోటీ నెలకొనగా, కాంగ్రెస్ వారిని ఒప్పించి శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రిని చేసింది. ఆ సమయంలో ‘రొటేషనల్ ముఖ్యమంత్రి ఫార్ములా’ ఆధారంగా రాజీ కుదిరిందని కూడా నివేదికలు వచ్చాయి. దీని ప్రకారం రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు, కానీ పార్టీ వాటిని అధికారికంగా ధృవీకరించలేదు.

**ఇకమీదట... రాష్ట్రపతి భవన్‌లో**

# కొత్త ఫార్మాట్‌లో ‘గార్డుల మార్పు వేడుకలు’

**ఫిబ్రవరి 22నుంచి భారీ సంఖ్యలో సందర్శకుల హాజరు**

**ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్‌లో గార్డుల మార్పు కార్యక్రమం ఇప్పుడు ఒక కొత్త ఫార్మాట్‌లో నిర్వహించబడుతుందని, రాష్ట్రపతి భవన్ నేపథ్యంలో విస్తృతమైన దృశ్య, సంగీత ప్రదర్శన ఉంటుందని ఆదివారం ఇక్కడ ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది. రాష్ట్రపతి అంగరక్షకుల ఆధ్వర్యంలో బలగాలు, గుర్రాలకు సంబంధించిన సైనిక విన్యాసాలు సహా ఈ నూతన ఫార్మాట్‌లో ఉన్నాయని, ఈప్రదర్శన ఒక అతిపెద్ద విస్తీర్ణంలో నిర్వహించబడనున్నదని ఆ ప్రకటన తెలియజేసింది. రాష్ట్రపతి భవన్‌లోని 4వ కోర్టులో ఆదివారం ఈ నూతన ఫార్మాట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వీక్షించారని ఆమె కార్యాలయం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది.ఫిబ్రవరి 22నుంచి పెద్ద సంఖ్యలో హాజరవుతున్న సందర్శకుల కోసం ఈ ప్రదర్శనను ప్రారంభించనున్నట్లు ఆ ప్రకటన తెలియజేసింది. ఇది రాష్ట్రపతి అంగరక్షకుల తాజా బృందాన్ని బాధ్యతలు స్వీకరించడానికి అనుమతించబడింది. గార్డుమార్పు సమయానుకూల సైనిక సాంప్రదాయంగా 2007లో రాష్ట్రపతి భవన్‌లో ఒక ఉత్సవ కార్యక్రమంగా ప్రవేశపెట్టబడింది. 2012లో ఈ వేడుకకు పబ్లిక్ ఈవెంట్ కార్యక్రమంగా హాజరయ్యేందుకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. గతంలో జైపూర్ కాలమ్, గేట్ నెంబర్ 1వద్ద ఈ కార్యక్రమం నిర్వహించబడినందున ఇప్పుడు ఈ కార్యక్రమం కోర్టు నాలుగు వద్దకు మార్చబడింది. ఇది వీక్షించే ప్రేక్షకుల సామర్థ్యాన్ని విస్తరింపచేయబడిందని అధికారులు తెలియజేశారు. వారానికి ఒకసారి నిర్వహించబడే ఈ వేడుక ఔట్ గోయింగ్, ఇన్‌కమింగ్ గార్డుల మధ్య విధులను అధికారికంగా అప్పగించడానికి ఉద్దేశించబడింది. ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హాజరైన ఈ వేడుకలో సెరిమోనియల్ బెటాలియన్ ద్వారా సమకాలీకరించబడిన కదలికలు, రాష్ట్రపతి బాడీగార్డుల (పిబిజి) ద్వారా ఖచ్చితమైన కసరత్తులు, సెరిమోనియల్ బ్యాండ్ ద్వారా ప్రాంతీయ సాయుధ దళాలక్రమశిక్షణ, వారసత్వం, గర్వపడదగిన రీతిలో ప్రతిబింబించేలా ప్రదర్శించారు. 1773లో అవతరించిన ప్రెసిడెన్షియల్ బాడీ గార్డ్స్ (పిబిజి) అనేది భారతదేశ సైన్యంలో అత్యంత సీనియర్ రెజిమెంట్. పిబిజి సిబ్బంది నైపుణ్యంకలిగిన గుర్రపు సైనికులు, ట్యాంక్ ఆపరేటర్లు, పారాట్రూపర్స్‌ను నిర్వహిస్తారు. సందర్శకులు https://visit.rashtrapathib havan.gov.in వద్ద వారి స్లాట్లను రిజర్వ్ చేసుకోవచ్చు.

# కుటుంబ సభ్యుల శవాలతో రెండు రోజులు...

**భువనేశ్వర్:** ఒడిశాలోని దెంకనల్ జిల్లాలో ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పదంగా మృతిచెందారు. ఆ కుటుంబానికి చెందిన వద్ధురాలు రెండు రోజుల పాటు వారి శవాలతో అక్కడే నివసించింది. చివరకు ఆ ఇంటిని వీడి మరో ఊరిలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లింది. వివరాలివి. చౌలియా ఖమర్ గ్రామానికి చెందిన్ల పుష్పాంజలి దాస్ (65) తన కుటుంబంతో కలిసి నివసిస్తోంది. భర్త శంకర్షన్ (70) ఒక గదిలో, కుమార్తె సువర్ణ (45), మనవడు సంతోష్ (18) మరో గదిలో ఉరేసుకుని కనిపించారు. సీలింగ్‌కు వేలాడుతూ మతదేహాలున్న ఆ ఇంట్లో వద్ధురాలైన పుష్పాంజలి రెండు రోజులు నివసించింది. చివరకు ఈ నెల 15న ఆ ఇంటి నుంచి ఆమె బయటకు వచ్చింది. దెంకనల్ టౌన్‌కు చేరుకుంది. కుటుంబ తగాదాల వల్ల 30 ఏళ్లుగా తండ్రి ఇంటికి దూరంగా ఉన్న కుమారుడు ప్రసన్న కుమార్ దాస్ ఇంటికి వెళ్లింది. అతడి తండ్రి, అక్క, ఆమె కుమారుడు మరణించినట్లు చెప్పింది. మరోవైపు ఈ విషయం తెలిసి ప్రసన్న కుమార్ షాక్ అయ్యాడు. గ్రామంలో తెలిసిన వ్యక్తికి ఫోన్ చేసి ఆ ఇంటికి వెళ్లి చూడమని కోరాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నదని, ఇక్కడకు రావాలని అతడు చెప్పాడు. దీంతో ప్రసన్న కుమార్ తన తల్లితో కలిసి ఆ ఇంటికి చేరుకున్నాడు. తండ్రి, అక్క, మేనల్లుడి మతదేహాలు రెండు గదుల్లో వేలాడటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కాగా, ఆ ఇంటికి చేరుకున్న పోలీసులు ముగ్గురి మతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారు ఆత్మహత్యకు పాల్పడ్డారా లేక వారిని హత్య చేశారా అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

**కాన్షీరామ్ అడుగుజాడల్లో నడిచేవారే**

# బిఎస్‌పి నిజమైన వారసులు: మాయావతి



**లక్నో:** భవిష్యత్తులో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ)కి నాయకత్వం వహించే నాయకుడిపై ఆ పార్టీ అధినేత్రి మా యావతి కీలక వ్యాఖ్యలు చేశారు. పా ర్టీ, దాని ఉద్యమం యొక్క నిజమైన వారసుడు కాన్షీరామ్ శిష్యుడిలా ఉం టారని స్పష్టం చేశారు. ఆ మహానేత మాదిరిగా పార్టీని బలోపేతం చేయడానికి తమ జీవితాన్ని అంకితం చేస్తారని, ఈ ప్రక్రియలో ఎంతటి కష్టాన్నయినా భరిస్తారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ‘ఎక్స్’పై పోస్ట్ చేశారు. వర్గ రాజకీయాలు , పార్టీ వ్యతిరేక కార్యకలాపా ల ఆరోపణలపై తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్ మామ అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత మాయావతి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బీఎస్పీ జాతీయ సమన్వయకర్త ఆనంద్ (30) మాయావతి రాజకీయ వారసుడు. గత సంవత్సరం ఆమె ఆనంద్‌ను పార్టీనుంచి తొలగించి... తరువాత తన రాజకీయ వారసుడిగా నియమించారు. దేశాన్ని శక్తివంతం చేయడానికి ,బహుజన సమాజాన్ని ఉద్ధరించడానికి బాబా సాహెబ్ డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ సూత్రాలపై కాన్షీరామ్ స్థాపించిన బీఎస్పీ... స్వార్థం, వ్యక్తిగత సంబంధాల కంటే ఉద్యమానికి ప్రాధాన్యత ఇస్తుందని మాయావతి పేర్కొన్నారు. ‘కాన్షీరామ్ జీ శిష్యురాలిగా , వారసురాలిగా ఆయన అడుగుజాడలను అనుసరిస్తూ... నేను కూడా నా చివరి శ్వాస వరకు పోరాడుతూనే ఉంటాను. త్యాగాలు చేస్తాను. తద్వారా బహుజన సమాజం రాజకీయ బానిసత్వం, సామాజిక నిస్సహాయత నుండి విముక్తి పొందగలదు’ అని ఆమె అన్నారు. కాన్షీరామ్ జీ శిష్యుడిలాగా కష్టనష్టాలను భరిస్తూ, పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి తన జీవితాంతం అంకితం చేసిన వ్యక్తి మాత్రమే బీఎస్పీకి నిజమైన వారసుడు అని మాయావతి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి జవాబుదారీతనం, విధేయత ,నిజాయితీతో పనిచేయాలని కూడా ఆమె పిలుపునిచ్చారు. అట్టడుగు స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, పార్టీ ఓటు బ్యాంకును విస్తరించడం, భవిష్యత్తులో ఎన్నికల విజయాన్ని నిర్ధారించడంపై దష్టి పెట్టాలని ఆమె కార్యకర్తలను కోరారు. బీఎస్పీ బహుజన సమాజానికి ఏకైక ఆశాకిరణం అని ఆమె అన్నారు.

# కుంభమేళాకు అర్థమే లేదు..

**లాలూ వివాదాస్పద వ్యాఖ్యలు**



**పాట్నా:** మహాకుంభమేళాపై ఆర్‌జెడి చీఫ్, కేంద్ర మాజీ రైల్వే శాఖ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాకు అర్థమే లేదని అని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మరణించిన ఘటనకు రైల్వే తప్పిదమే కారణమని, దీనికి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ‘తొక్కిసలాట ఘటన చాలా కలవరపాటు కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదనే విషయాన్ని ఆ ఘటన బహిర్గతం చేస్తోంది. దీనికి బాధ్యత వహించిన రైల్వే మంత్రి రాజీనామా చేయాలి. ఇది పూర్తిగా రైల్వేల వైఫల్యం’ అని లాలూ వ్యాఖ్యానించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్‌కు లెక్కకు మిక్కిలిగా ప్రజలు తరలివస్తుండటంపై అడిగినప్పుడు ‘కుంభ్‌కు అర్థమే లేదు, ఇది పనికి రానిది‘ అని సమాధామిచ్చారు. కుంభమేళాకు అర్థమే లేదంటూ లాలూ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై బిజెపి మండిపడింది. హిందూ మతం పట్ల ఆర్‌జెడి ఆలోచనా విధానానికి లాలూ వ్యాఖ్యలే నిదర్శనమని బిజెపి బీహార్ విభాగం ప్రతినిధి మనోజ్ శర్మ అన్నారు. బుజ్జగింపు రాజకీయాల వల్లే లాలూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆర్‌జెడి నేతలు హిందువుల మనోభావాలను అవమానించడం పరిపాటిగా మారిందని విమర్శించారు.

# బాణసంచా కర్మాగారంలో పేలుడు.. ఇద్దరు మృతి

**ముంబయి :** బాణసంచా కర్మాగారంలో పేలుడు జరిగింది. బిల్డింగ్ కూలిపోయింది. ఈ సంఘటనలో ఇద్దరు మరణించారు. పలువురు గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం కొత్వాల్‌బుడిలోని ఒక బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అక్కడి బిల్డింగ్ కూలిపోయింది. శిథిలాల కింద కొందరు చిక్కుకున్నారు. భయాందోళన చెందిన కార్మికులు అక్కడి నుంచి బయటకు పరుగులుతీశారు. కాగా, ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# పేద కక్షిదారులకు న్యాయ సహాయం

**యువ న్యాయవాదులకు ‘సుప్రీం’ పిలుపు**

**న్యూఢిల్లీ:** ఆర్థిక సామర్థ్యం, అవగాహనలేని కక్షిదారులకు న్యాయసహాయం అందించేందుకు యువ న్యాయవాదులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సుప్రీంకోర్టు పిలుపునిచ్చింది. ఓ కక్షిదారుకు వ్యక్తిగతంగా న్యాయ సహాయం అందించినందుకు ఒక యువ న్యాయవాదికి కతజ్ఞతలు తెలుపుతూ... న్యాయవాదులు తమ వత్తిపరమైన సేవలకు ప్రతిఫలంగా ఎటువంటి ఆశ లేకుండా కక్షిదారుకు ఉత్తమ న్యాయ సహాయం అందించాలని న్యాయమూర్తులు బీవీ నాగరత్న, సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ‘‘బార్‌లో చేరే యువ న్యాయవాదులు అవకాశం వచ్చినప్పుడల్లా ఆర్థిక సామర్థ్యం లేదా అవగాహన లేకపోవడం వల్ల న్యాయవాది సేవలను పొందలేని కక్షిదారులకు సహాయం చేయడానికి ముందుకు రావాలి. అంతేకాకుండా, వారి వత్తిపరమైన సేవలకు ప్రతిఫలంగా ఎటువంటి ఫీజు ఆశించకుండా వారు ఉత్తమ న్యాయ సహాయం అందించాలి’’ అని ధర్మాసనం తెలిపింది. నిరుపేదలైన కక్షిదారులకు ప్రాతినిధ్యం వహించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చినవారవుతారని తెలిపింది. ఈ కేసును ప్రస్తావిస్తూ... న్యాయవాది సంచార్ ఆనంద్ అనే న్యాయవాది రెండేళ్లలో పిటిషనర్ తరపున వాదించడానికి ఈ కోర్టు ముందు 14 సార్లు హాజరయ్యారని ధర్మాసనం పేర్కొంది. ఆర్థికంగా వెనుబడి ఉన్న పిటిషనర్ తన సేవలకు ఒక్క పైసా కూడా చెల్లించలేకపోయాడని తెలిపింది. ‘‘అతని సమయం, ఖర్చులకు తగిన వేతనం లభించడానికి న్యాయవాది సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్‌లో కూడా లేరు. అయినప్పటికీ, ఈ రెండు సంవత్సరాలలో అంకితభావంతో ఈ కోర్టుకు హాజరయ్యారు, పిటిషనర్ తరపున వాదించడానికి మాత్రమే కాకుండా ఈ కేసుకు న్యాయమైన , సరైన ముగింపును చేరుకోవడంలో ఈ కోర్టుకు సహాయం చేయడానికి కూడా’’ అని ధర్మాసనం పేర్కొంది. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ముందు న్యాయం పొందడం ఆర్థిక వనరుల కొరత అనే సంకెళ్లకు లోబడి ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ ఫిర్యాదుతో ఈ కోర్టును సంప్రదించాలనుకునే అన్ని వర్గాల వ్యక్తులకు వ్యాజ్యం ఖర్చును పెంచకుండా లేదా అనవసరంగా ప్రక్రియను ఆలస్యం చేయకుండా బార్‌లోని న్యాయవాదులంతా అవసరమైన సహాయం అందించాలని ధర్మాసనం సూచించింది.

# కట్నం డిమాండ్లు తీర్చలేదని.. హెచ్ఐవి సోకిన సూదితో ఇంజెక్షన్ !



**లక్నో:** కట్నం డిమాండ్లు తీర్చనందుకు ఒక మహిళను అత్తింటి వారు వేధించారు. హెచ్ఐవీ సోకిన సూదితో ఇంజెక్షన్ ఇచ్చారు. ఆమె ఆరోగ్యం క్షీణించగా వైద్య పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. ఆ మహిళ అత్తింటి వారిపై ఆమె తండ్రి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. చివరకు కోర్టు జోక్యంతో కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సహారాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2023 ఫిబ్రవరి 15న గంగో ప్రాంతానికి చెందిన సోనాల్ సైనీకి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్ అలియాస్ సచిన్‌తో పెళ్లి జరిగింది. కారు, రూ.15 లక్షలు కట్నంగా ఇచ్చారు. కాగా, కొంతకాలం తర్వాత అదనపు కట్నం కోసం అత్తింటి వారు సోనాల్‌ను వేధించారు. స్కార్పియో ఎస్‌యువితోపాటు రూ.25 లక్షలు డిమాండ్ చేశారు. అయితే సోనాల్ తల్లిదండ్రులు ఈ డిమాండ్లకు తలొగ్గలేదు. దీంతో భర్త, అత్తమామలు ఆమెను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అయితే పెద్దల జోక్యంతో సోనాల్ తిరిగి అత్తవారింటికి వచ్చింది. నాటి నుంచి ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించారు. సోనాల్‌ను చంపేందుకు కుట్రపన్నారు. హెచ్ఐవీ సోకిన సూదితో ఆమెకు ఇంజెక్షన్ చేశారు. మరోవైపు సోనాల్ ఆరోగ్యం క్షీణించింది. ఆమె తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లా రు. వైద్య పరీక్షలు చేయగా సోనాల్‌కు హెచ్ఐవీ సోకినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆమె భర్త అభిషేక్‌ను పరీక్షించగా హెచ్ఐవీ నెగిటివ్‌గా తేలింది. ఈ నేపథ్యంలో సోనాల్ అత్తింటి వారిపై ఆమె తం డ్రి ఫిర్యాదు చేశాడు. కాగా, పోలీసులు పట్టించుకోకపోవడంతో స్థానిక కోర్టును సోనాల్ తండ్రి ఆశ్రయించాడు. చివరకు కోర్టు ఆదేశాలపై గంగో కొత్వాలి పోలీసులు స్పందించారు. సోనాలి భర్త అభిషేక్, అతడి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ స భ్యులపై వరకట్న వేధింపులు, దాడి, హత్యాయ త్నం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి: మోహన్ భగవత్



**బర్ధమాన్:** ప్రపంచంలోని వైవిధ్యాన్ని ప్రజలు ఆమోదించాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉంటుందనే సత్యాన్ని హిందూ సమాజం విశ్వసిస్తోందన్నారు. పశ్చిమ బెంగాల్ బర్ధమాన్ లోని సాయ్ మైదానంలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భగవత్ మాట్లాడుతూ... మనం కేవలం హిందూ సమాజం పైనే ఎందుకు దష్టి పెడతామని చాలామంది తరచుగా అడుగుతారన్నారు. దీనికి సమాధానంగా దేశంలో బాధ్యతాయుతమైన సమాజం ఏదన్నా ఉందంటే... అది కేవలం హిందూ సమాజమేనని తాను చెబుతానని పేర్కొన్నారు. హిందూ సమాజం మరింత ఐక్యంగా ఉండాలని పునరుద్ఘాటించారు. మంచి సమయాల్లోనూ సవాళ్లు ఎదుర్కొవాల్సి ఉంటుందని.. దానికి సమాజంలోని ప్రజల మధ్య ఐక్యత అవసరం అని అన్నారు. ప్రజలు దేశాన్ని పాలించిన చక్రవర్తులు, మహారాజులను గుర్తు పెట్టుకోరని... తండ్రి వాగ్దానాన్ని నెరవేర్చడానికి 14 ఏళ్లు అజ్ఞాతవాసం చేసిన రాజును గుర్తుంచుకుంటారని అన్నారు. 200 ఏళ్ల పాటు మన దేశాన్ని పాలించిన బ్రిటిషు వారు దేశ ప్రజలను విడదీయాలని చూశారన్నారు. స్థానిక ప్రజలు దేశాన్ని పరిపాలించడానికి పనికిరారని ప్రచారం చేసి... భారతదేశ చరిత్రను బ్రిటిషు పాలకులు వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మర్డర్ కేసు నమోదు చేయొద్దు

**ఆరుగురికి అనుకూలంగా కోర్టు ఆదేశాలు**

**న్యూఢిల్లీ :** రెండేళ్ల క్రితం జరిగిన మత కల్లోలా సందర్భంగా సహచరుడిని ఉద్దేశ పూర్వకంగా హత్య చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురిపై హత్యారోపణ కేసు నమోదు చేయొద్దని స్థానిక కోర్టు అధికారులను ఆదేశించింది. 2020 అల్లర్లలో సహచరుడిని హత్య చేశారని మొహ్మద్ ఫిరోజ్, చాంద్ మొహ్మద్, రాయస్ ఖాన్, మొహ్మద్ జునైద్, ఇర్షద్, అకిల్ అహ్మద్‌లపై దయాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారించిన అడిషనల్ సెషన్స్ జడ్జి పులస్త్య ప్రమచాల వారిపై మర్డర్ కేసు నమోదు చేయొద్దని, అల్లర్ల సృష్టి, దొంగతనం, ఇళ్లలోకి చొరబడడం, నేరపూరిత బెదిరింపు అంశాల నేపథ్యంగా కేసు నమోదు చేయాలని సూచించారు. అల్లర్ల సమయంలో షాహిద్ అనే వ్యక్తి సహచరులు కాల్పులు జరపడంవల్లనే చనిపోయాడని ప్రాసిక్యూషన్ పేర్కొనడం సముచితంగా లేదని జడ్జి పేర్కొన్నారు. షాహిద్ సహచరులు కాల్పులవల్లే చనిపోయాడని ప్రాసిక్యూషన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే నేరారోపణకు గురైనవారు తుపాకి కాల్పులకు పాల్పడినట్టు ధృవీకరించబడలేదని, వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సామూహికంగా ఒకచోట చేరారని మాత్రమే పేర్కొన డాన్ని ప్రస్తావిస్తూ వారిపై సెక్షన్ 149 వర్తింపచేయడం సముచితం కాదన్నారు. ఈ కేసులో సెక్షన్ 149 ఏమేరకు వర్తిస్తుంది? సమీపంనుంచి తుపాకి పేల్చడంవల్ల మృత్యువు సంభవించిందా అనేది తేలాల్సి ఉందన్నారు. రాళ్లు విసరడం, తుపాకి పేల్చడం అనేది వ్యతిరేక వర్గాలపైనే చేస్తారని, షాహిద్ మరణం అలా సంభవించినట్టుగా ప్రాసిక్యూషన్ ఆరోపణలో లేదన్నారు. ఈ సంఘటనలో నిందితులు సెక్షన్ 304ఎ(నిర్లక్ష్యంవల్ల మరణం) కిందకు వస్తారన్నారు. ఫోరెన్సిక్ నివేదికలో మరణించిన వ్యక్తి సమీపంనుంచి కాల్చడంవల్ల సంభవించలేదని పేర్కొన్నారని, అందువల్ల సమీపంలో ఉన్న నిందితులపై హత్యానేరం ఆరోపించడం తగదన్నారు. అందువల్ల నిందితులపై ప్రైమూ ఫేసీ కింద కేసు నమోదు చేయాలని, దానిపై మెజిస్టీరియల్ కోర్టు విచారణ జరిపితే సరిపోతుందని పేర్కొంటూ కేసును సంబంధింత కోర్టుకు బదిలీ చేశారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామానికి కే. శ్రీనివాస్ రెడ్డి తన మనువరాలు దూదిపాల సంజనారెడ్డి రాంనితిన్‌రెడ్డిల శుభకార్య వేడుకకు హాజరయ్యారు. సీనియర్ పాత్రికేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాలకు ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుందన్నారు. జర్నలిస్టులకు వర్క్ షాప్‌లు నిర్వహించి వార్తల పట్ల నైపుణ్యాన్ని, రచనా విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాషా, నంద్యాల వెంకటేశ్వర్లు, బూడిద శ్రీనివాస్‌యాదవ్, చిలువేరు శ్రీధర్, పెద్దిశెట్టి మహేందర్ పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శన



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని ఆదివారము నల్లగొండ జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధ వనంలోని బుద్ధ చరిత వనం, ధ్యానవనం ,జాతకవనం ,స్థూపవనాలను సందర్శించారు. బుద్ధవనములోని మహాస్థూప ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ బిజీగా ఉండే వారికి బుద్ధవనం సందర్శన, ధ్యాన మందిరంలోని వాతావరణం మానసిక ప్రశాంతతను ఇస్తుందన్నారు. నల్లగొండకు చెందిన మిత్రబృందంతో, యూత్ అసోసియేషన్‌లతో కలిసి బుద్ధ వనం సందర్శించామన్నారు. వీరితోపాటు స్థానిక అటవీశాఖ అధికారులు రమేష్, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే దోహదం



**ప్రజాపక్షం/భువనగిరి:** ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహద పడుతుందని కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని గౌరీ మనోహర్ ఫంక్షన్ హాల్‌లో కారటే పోటీలను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీర ధారుద్యం, క్రమశిక్షణతో పాటు ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహద పడుతుందన్నారు. సర్టిఫికేట్స్ కరాటే పోటీలలో విజేతలకు ముఖ్య అతిధులు మోడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ శిస్థీ, మాజీ మున్సిపల్ చైర్మన్ లు పోతమ్ శెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, కరాటే మాస్టర్ బాలరాజుతో పాటు సీనియర్ కరాటే మాస్టర్స్ వెంకట్, ఎర్ర జాన్సన్, ముత్యాలు, పవన్, గీత, యాదగిరి, అంజనేయులు, జంగయ్య, శ్రీను, స్తైదులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్వీయ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రవిమహల్‌లో జరిగిన జపాన్ కరాటే స్టేట్ లెవల్ క్యాంపుకు ఆయన హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయిలో ఎదిగేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెకెఎడబ్ల్యూఎఫ్ ఇండియా తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ కరాటే సయ్యద్, శిక్షకులు సోహం తెంజీ, తాహెర్ పాషా, రియాజుద్దీన్, ఖాశీం, రామలింగం, శ్రీనివాస్, సూర్యం, మధు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరం



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో ఆదివారం శంకర్ నేత్రాలయ మేసు, మదాడి కుటుంబ సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ముమ్మందు మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. అనంతరం కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, సినియర్ నాయకులు కృష్ణారెడ్డి, మండల పార్టీ నాయకులు రాంరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం:** యువకులు క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని నెమలిపురి(పులిచింతల కాలని) గ్రామంలో నిర్వహించిన క్రికెట్ నెమలిపురి ప్రిమియర్ లీగ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, ఉత్సాహంగా పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురవయ్య, గ్రామపెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రెండు సంవత్సరాల లోపే...

# శ్రీశైలం సొరంగ మార్గం పనులు పూర్తి

ప్రజా సమస్యలను తీర్చినప్పుడు కలిగే సంతృప్తి, మరెందులోనూ రాదు

మంత్రిగా రాష్ట్రవ్యాప్తంగా బాధ్యతలు మోస్తూనే.. నల్లగొండ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** మంత్రిగా ఎంత బిజీగా ఉన్నప్పటికి నల్లగొండ నియోజకవర్గ ప్రజల కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తానని రాష్ట్ర రోడ్ల, భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీనగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిన మంత్రి వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.ఆర్థిక ఇబ్బందులతో కాలేజీ ఫీజులు కట్టలేక, ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చిన అభ్యర్థనలను మానవత్వంతో పరిష్కరించి.. వారి మోముల్లో సంతోషం నింపారు. రాష్ట్ర కెబినెట్ మంత్రిగా రాష్ట్రవ్యాప్త బాధ్యతలతో ఈ మధ్య ప్రజావాణి కార్యక్రమం కొంత ఆలస్యం జరిగిందన్న మంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమానికి అధికారులను ఎవరిని పిలవలేదని పేర్కొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూరా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్.ఆర్.ఆర్) నిర్మాణంతో తెలంగాణ రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందని ఆయన అన్నారు.రీజినల్ రింగ్ రోడ్డు పనులకు ఉత్తర భాగానికి టెండర్లు పిలిచామని, దక్షిణ భాగానికి సంబంధించి డీపీ ఆర్ కు టెండర్లు పిలవడం జరిగిందన్న మంత్రి త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.గతంలో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడం దానికి దగ్గర్లోనే రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్, ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అదే విధంగా నగరం నుంచి శంషాబాద్ సవియిర్ పోర్ట్ కు 13 కిలోమీటర్లు పొడవైన పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ కట్టిన తర్వాత హైదరాబాద్ కు మల్టీనేషన్ కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు.బెంగళూరులో ఎయిర్ ఫోర్టు నుంచి ఐటీ కంపెనీలకు వెళ్లాలంటే ట్రాఫిక్ వలన రెండు మూడు గంటల సమయం పడుతుందని తెలిపారు.హైదరాబాదులో అలాంటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల ముందు కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డును కమిషన్ కోసం అమ్ముకున్నాడని విమర్శించారు. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాల్సి ఉన్న నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు.రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు నడుము నిర్మిస్తున్న రేడియల్ రోడ్స్‌తో తెలంగాణ రూపురేఖలు మారడంతో పాటు హైదరాబాదు ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు.దశాబ్దాల నల్లగొండ జిల్లా సాగు, త్రాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి వచ్చే మరో బేరింగ్ మిషన్ మద్రాసు పోర్టు వరకు వచ్చిందని తెలిపారు.రెండు సంవత్సరాల్లో శ్రీశైలం సొరంగం మార్గం పనులను పూర్తి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం టన్నెల్, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర పౌరులుగా అందరూ సర్వేలో పాల్గొనలని హితవు పలికారు. ఐదుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నల్లగొండ నియోజక వర్గ ప్రజలకు తాను ఎల్లవేళల రుణపడి ఉంటానన్న అన్ని రంగాలలో నల్లగొండను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.ఇప్పటికే పట్టణంతో పాటు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించామని అవన్నీ పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య,పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనుప్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**లక్ష్మీనరసింహ ఆలయంలో పూజలు**

నల్లగొండ పట్టణంలోని 10వ వార్డు నీలగిరి కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన యంత్ర, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. పండితులు మంత్రికి వేదాశీర్వచనం ఇచ్చారు.



## ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్ రెడ్డికి మద్దతు తెలిపిన మంత్రి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్ రెడ్డి పన్నాల కు రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంపూర్ణంగా మద్దతు తెలిపారు.ఆదివారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ఇవ్వాలని కోరడం జరిగింది. దీనికి కోమటిరెడ్డి స్పందించి మాట్లాడుతూ గోపాల్ రెడ్డి పని చేసిన ప్రతి పాఠశాలను అంకితభావంతో అభివృద్ధి చేసిన ఉత్తమ గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయులు, ఎపిటిఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా పనిచేసి ఉపాధ్యాయుల సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసుకున్నారు అన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు పౌరుడిగా సామాజిక సమస్యల పట్ల స్పందించి పనిచేస్తున్న ఉద్యమకారుడు గోపాల్ రెడ్డికి సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తున్నాను అందుకు ఆయన గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయవలసిందిగా కోరారు. మద్దతు తెలిపినందుకు మంత్రికి గోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ తోట నరసింహా చారి ,విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ వీర నాయక్, కృష్ణారెడ్డి, బోధనం నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు రావొద్దు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతుల(పెద్ద గట్టు)స్వామి జాతరలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమన్వయంతో పని చేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. ఆదివారం జిల్లా అదనపు ఎస్పి నాగేశ్వర్ రావుతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండవ అతిపెద్ద జాతరైన పెద్దగట్టు జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. జాతరలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు దైవదర్శనం అందేలా చూసి జాతరను విజయవంతం చేయాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు దుమ్ము లేవకుండా రోడ్లు, దారుల్లో ట్యాంకర్లతో నీటిని చల్లాలని, పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆదివారం రాత్రి 9గంటల తరువాత కేసారం నుండి దేవరపెట్టేను పెద్దగట్టుపైకి తీసుకొచ్చి గంపల ప్రదర్శన చేయడంతో జాతర ప్రారంభమవుతుందన్నారు. భక్తులు ఎవరైన తప్పిపోతే కంట్రోల్ రూం వద్దకు వచ్చి తెలియజేస్తే మైక్ ద్వారా ప్రకటించడం జరుగుతుందన్నారు. జాతరలో చిన్న పిల్లలతో పని చేపించడం చట్టరీత్య నేరమన్నారు. ఏలాంటి వారిని గుర్తించాలని కార్మిక శాఖ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి, కృష్ణయ్య, ఆంజనేయులు, అమీన్ సింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు విద్యాసంస్థలకు లోకల్ సెలవులు**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సోమవారం లోకల్ సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్‌పి**

**ప్రజాపక్షం/సూర్యాపేట:** శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతర ఆదివారం ప్రారంభం కావడంతో జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ గట్టు ప్రాంగణం వద్ద భద్రత సరళిని పర్యవేక్షించారు. పోలీసు సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. సిసికెమెరాల నిఘాను పరిశీలించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, పోలీస్ అధికారులు ఉన్నారు.






## బేతవోలు గ్రామంలో ఉద్రిక్తత

కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఆదివారం ఉద్రికత్త చోటుచేసుకుంది. ఈనెల 21, 22 తేదీలలో గ్రామంలో నిర్వహించనున్న బండ్ల పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పురాతన రామాలయ పునఃనిర్మాణం, శివాలయ పునఃనిర్మాణం చేసేందుకు గ్రామంలోని పెద్దలు సిద్దమయ్యారు. ఈ క్రమంలోనే రామలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో గ్రామంలోని కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాల మధ్య ఆదిపత్య పోరు కోనసాగిందని, రాజకీయ నాయకులను కమిటిలో చోటు కల్పించవద్దని ఒక వర్గం వారు ప్రతిపాదిస్తే, మరో వర్గం వారు కల్పించాల్సిందేనని పట్టుబడటంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి దాడికి దిగారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుంటూ గ్రామాన్ని రణరంగాంగా మార్చారు. పోలీసులకు సమాచారం అందడంతో సూర్యాపేట జిల్లా పెద్దగట్టు జాతరలో బందోబస్తు నిర్వహిస్తున్న కోదాడ పోలీసులు హుటాహుటిన బేతవోలు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెల్లా చెదురు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకవచ్చారు. గ్రామంలో వారం రోజుల పాటు పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

# బ్రిడ్జి నిర్మాణం నిలిపివేయాలని ఆందోళన



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** మున్సిపల్ కేంద్రంలో వలిగొండతొర్రుర్ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మాజీ ఎంపిపి కొమ్మినేని సతీష్ కుమార్, సిపిఎం నాయకులు కడియం లింగయ్య, కిరాణ ఫ్యాన్సీ అసోసియేషన్ అధ్యక్షులు గుండా భాస్కర్, మాజీ కౌన్సిలర్ బత్తుల శ్రీనుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారంగంలో దినదినాభివృద్ధి చెందుతున్న తిరుమలగిరి పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణంతో రెండుగా చీలిపోయి అభివృద్ధి నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని నిలిపివేయకుంటే తమ ప్రాణాలను అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఉమ్మడి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని నిలిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కందుకూరి ప్రవీణ్, మల్లేష్, రాజేశ్వర్, రామచంద్ర్ గౌడ్, శ్రీనివాస్, నర్సింహ్మా స్వామి పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన మిషన్ పరివర్తన్ యువ తేజం కార్యక్రమంలో భాగంగా క్రీడా స్ఫూర్తితో హోరా హోరీగా సాగిన కబడ్డీ క్రీడా పోటీలు.జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉత్సాహం పెంపొందిస్తుంది క్రీడా నైపుణ్యాలు వెలికితీసి వారిలో క్రీడా స్ఫూర్తి,క్రమశిక్షణ,స్నేహ భావం పెంపొదించుటకు గాను ,పోలీసులకు,యువత మధ్య స్నేహ భావం పెంపొందిస్తూ నల్లగొండ జిల్లాను మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసై, పెడ దారిన పడకుండా ఈ క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని,క్రీడల వల్ల మానసిక ఉల్లాసం,శారీరక దృఢత్వం, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.జీవితంలో ముందుకు సాగాలంటే క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి అన్నారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకి, ఆర్గనైజర్లకి, పోలీస్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి మౌనిక ,యస్‌బి డిఎస్‌పి రమేష్,నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, డిఎస్‌పి విఠల్ రెడ్డి,సిఐలు రాజశేఖర్ రెడ్డి,నాగరాజు,కరుణాకర్,ధనంజయ, ఆర్.ఐ సురప్పా నాయుడు,ఎఐలు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి బహుమతిగా మిర్యాలగూడ,రెండవ బహుమతిగా నల్లగొండ,మూడవ బహుమతిగా దేవరకొండ జట్లకు గెలుపొందినాయి.

## ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎంఎల్‌సి అభ్యర్థి పూల రవీందర్ ప్రచారం



**ప్రజాపక్షం/కోదాడ:** ఉపాధ్యాయుల, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల అన్నింటిని పరిష్కరించేందుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాజీ ఎంఎల్‌సి పూల రవీందర్ అన్నారు. ఫిబ్రవరి 27న జరిగే వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కోదాడ పట్టణంలో పలువురు ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాక్టో సంఘ నాయకులతో కలిసి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు కోరుకుంటున్న సిపిఎస్ రద్దు, హెల్త్‌కార్డులు, మెరుగైన పిఆర్‌సి ఇప్పించడంతో పాటు మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేయిస్తానన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టియు అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు, కెవి సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఆర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్, చందులాల్, ఆదినారాయణ, అంకిరెడ్డి, కాశీం, నర్సింహరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సేవాలాల్ భావాలను యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం:** గిరిజన యువతరంగాలు సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రభోధించిన భావాలను యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రముఖ న్యాయవాది నగేష్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఐక్యత యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ కీర్తిస్తూ గిరిజన జాతిని జాగృతం చేసిన యావత్ జాతిని ఒకే తాటిపై తీసుకవచ్చి యువత చెడు వ్యాసనాలకు వైపు వెళ్లకుండా తన ప్రవచనాలను తమ తమ జీవితాలతో భాగం చేసుకోవాలని, కష్టపడి పనిచేసి జీవితంలో ఉన్నతమైనటువంటి స్థానాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రావు, అజ్మీర చందు, మాజీ సర్పంచ్ హుస్సేన్‌నాయక్, నర్సింహ, రాజునాయక్, బాలునాయక్, రమేష్, గాంధీ, వీరు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**జూలూరుపాడు మండల కేంద్రంలో ఆదివారం నూతనంగా ప్రెస్ క్లబ్ 2 కార్యాలయాన్ని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ లేకపోవడం ఈరోజు నూతనంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించటం మండల ప్రజలకు ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తూ అందరి ఆదరణ పొందుతూ ముందుకు సాగాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి, సిపిఎం పార్టీ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య వీరభద్రం, మధుసూదన్ రావు, బాలాజీ, రాంబాబు, నరసింహారావు , ప్రెస్ కమిటీ సభ్యులు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భూక్య వీరు నాయక్, ఉపాధ్యక్షులు కంచెపోగు నరసింహారావు, కార్యదర్శి భూక్య రమేష్, దోమలపల్లి గోపి నాయుడు, చేపల మడుగు నరసింహారావు, భూక్యా శంకర్ బానోత్ రమేష్ భూరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సైక్లింగ్ కాంపిటీషన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం / భద్రాచలం :**జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రామవరం బైపాస్ రోడ్డు వద్ద నుండి ప్రారంభమైన జిల్లా స్థాయి సైక్లింగ్ కాంపిటీషన్స్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## షణ్ముఖ్ కుమార్ అన్నప్రాసన వేడుకల్లో పాల్గొన్న తాండ్ర, అంజి



**ప్రజాపక్షం/ములకలపల్లి:**మండల పరిధిలోని మూకమామిడి గ్రామం సమ్మక్క సారక్క గుడి వద్ద జరిగిన ములకలపల్లికి చెందిన ఎంఎల్‌పి జారే ఆదినారాయణ సోషల్ మీడియా కన్వీనర్ దుగ్గి సంపత్ కుమార్ కుమారుడు షణ్ముఖ్ కుమార్ అన్నప్రాసన వేడుకల్లో ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజిలు పాల్గొని, చిన్నారిని ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ నాయకులు శనగపాటి రవి, సురభి రాజేష్, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పాలకుర్తి సుమిత్, ఎన్ఎస్‌యూఐ ములకలపల్లి మండల అధ్యక్షులు గుంటూరు సాయిరాం, మండల యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతుల వెల్లువ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. మండలం లోని అనాసాగారం గ్రామంలో శ్రీనివాసరావు కుమారుడు అన్నప్రాసన వేడుకలో పాల్గొన్నారు. చిన్నారిని ఆశ్వీరదించారు. కార్యక్రమంకు హాజరైన వారిని ఆప్యాయంగా పలకరించారు. వృద్ధుల వద్దకు వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేయాలని పలువురు కు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు గ్రామంలో సిసిరోడ్లు, సైడ్ డ్రైయిన్స్, ప్రహరీ గోడ ను మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. అదే విధంగా వివిధ సమస్యల పై మంత్రి ని పలువురు కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, ఇస్లావత్ బాలాజీ, ఉండమోదుగుల శ్రీనివాస్, జెర్రీపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ పాల్గొన్నారు.

## ఇందిరానగర్ కాలనీలో అగ్ని ప్రమాదం..రూ.20వేలు నష్టం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పట్టణ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంబంధించింది. ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న గుర్రం బీబీ ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని మంచాలు, వంట సామాన్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 వేలు నష్టం జరిగింది.

## చిన్నారులను ఆశీర్వదించిన లేళ్ల వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రమైన జూలూరుపాడులో ఎల్లంకి గార్డెన్ నందు ఆదివారం జరిగిన బల్ల ప్రేమ్ సాయి నందినిల కుమార్తెల అన్నప్రాసన వేడుకకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు లేళ్ల వెంకటరెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకురి మధుసూధనరావు, ఉద్యమ కారుడు వేల్పుల నరసింహారావు, బల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సోలార్ వెలుగుల సర్వే

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**ఉచిత విద్యుత్ ను అందించేందుకు నిర్వహిస్తున్న సోలార్ సర్వే శర వేగంగా కొనసాగుతుంది. మండలం లోని చెరువు మాధారం గ్రామంలో ను సోలార్ మోడల్ విలేజ్ ను ఎంపిక చేశారు. ఆదివారం సర్వే ను నేలకొండపల్లి విద్యుత్ ఏఈ కె.రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటి సోలార్ పలకలు ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న 1536 గృహాలు, 696 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిధులు లేవు...విధులకు రారు!

గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారుల పాలన సంవత్సరం పూర్తి...




**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు మండల పరిధిలోని ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమై సంవత్సరం పూర్తయింది. గ్రామపంచాయతీలలో నిధులు లేక విధులకు దుమ్మా కొడుతున్నట్లు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. మండల పరిధిలోని ఏడు గ్రామ పంచాయతీలలో ఇన్‌చార్జి పాలన వలన అధిక భారంతో అక్కడ ఇక్కడ చేయలేకపోగా నిధులు లేక పోవడం వలన విధులకు కూడా రావడం లేదు. మండల పరిధిలోని పోచవరం, పాయపూర్, కృష్ణయ్య బంజర, ముగ్గు వెంకటాపురం, లక్ష్మి పురం, గోకారం, వెన్నవల్లి తదితర పంచాయతీలకు ఇన్చార్జిల కార్యదర్శిల వలన పాలనలో కుంటుపడుతుంది. దీంతోపాటు గ్రామంలో నిధులు లేనందున పారిశుద్ధ్యం వీధి లైట్లు గ్రామంలో ప్రజలకు సంబంధించిన పనులు నిర్వహించాలంటే భారంగా మారినందున వారు గ్రామాలకు కూడా రావడం లేదు. దీంతో పాలన కుంటుపడుతుంది. వీధి దీపాల నిర్వహణ, చెత్త ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ కు డబ్బులు లేక, ట్రాక్టర్ కిస్తీలు చెల్లించక, కొన్ని గ్రామాల్లో రోడ్లు ఇరువైపులా చెత్త పేరుకు పోయి ఉంటుంది. మరి కొన్ని గ్రామాలలో నిధుల కొరతతో వీధిలైట్లు ఏర్పాటు చేయక చీకట్లోనే వీధిలు ఉంటున్నాయి. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు ఏర్పాటుచేసిన పరికరాలు తుప్పు పడుతున్నాయి. మరి కొన్ని గ్రామాలలో మిషన్ భగీరథ నీ రు పూర్తిస్థాయిలో నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇ ప్పుడే ఇలా ఉంటే రాబోయే రోజుల్లో మార్చి, ఏప్రిల్ , మే నెలలో ఎలా గ ట్టెక్కుతారని ప్రశ్నించుకుంటున్నారు. పల్లెల్లో పల్లె ప్రకృతి వనాలు డ ంపింగ్ యార్డ్ తడి చెత్త, పొడి చెత్త, నిర్వహణ భారంగా మారాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరిపోను నిధులు రానందున గ్రామాల పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. నిధులు లేవు విధులకు రారు. పరిపాలన అ స్తవ్యస్తంగా మారడంతో వేసవికాలం ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు చ ర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు గ్రా మాలను పట్టించుకోని సమస్యలను పరిష్కరించాలని, మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల ప్రజలు అధికారులను, ప్రత్యేక అధికారులను, కార్యదర్శులను కోరుతున్నారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ఇల్లెందు:** పట్టణంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఘన్‌శ్యాం కుటుంబాన్ని, హరిహరక్షేత్ర ఆలయ డైరెక్టర్ బొందిలి విజయ వదిన చనిపోయిన క్రమంలో వారి కుటుంబాన్ని, పట్టణంలోని నెం2బస్తీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు గౌస్ మోకాళ్ల శస్త్రచికిత్స చేసుకున్న నేపథ్యంలో పరామర్శించారు. వీరితోపాటు ప్రముఖ వ్యాపారవేత్త జుగల్‌కిషోర్ సోదరుడు దినదాయల్ ఖండేల్‌వాల్ అనారోగ్యంతో బాధపడుతన్న క్రమంలో, కూరగాయల వ్యాపారి భాస్కర్ కుమారుడు చనిపోయిన క్రమంలో వారిని, కాంగ్రెస్ పార్టీ నాయకులు వసంత్ మేనత్త ఆవునూరి ఈశ్వరమ్మ మృతిచెందడంతో వారికుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, పింగళి నరేశ్, సీ.హెచ్.శంకర్, కనతాల వసంత్‌కుమార్, పెండ్యాల రాజు పాల్గొన్నారు.



## 'మెర్క్యూరీ ఫ్యామిలీ' రెస్టారెంట్‌ను ప్రారంభించిన డా.మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పట్టణంలోని సిద్దారం రోడ్ లో గల ఎంఆర్ గార్డెన్ ఎదురుగా పొదిలి నరేష్ నూతనంగా నిర్మించిన మెర్క్యూరీ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ దాభాను రాష్ట్ర డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ము ఖ్య అతిదిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. అదే విధంగా విఐపి ఏసి రూం ను మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ రబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డా.మట్టా వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు కమల్ పాషా, నరేంద్ర రెడ్డి, మానుకోట ప్రసాద్, ప్రొప్రైటర్ పొదిలి రామకృష్ణ, పొదిలి శ్రీనివాసరావు, అనసూర్య, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి;జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం / భద్రాచలం :**ఫిబ్రవరి 17న సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని చెప్పారు. ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే: బాగం

కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి: మహమ్మద్ మౌలానా




**ప్రజాపక్షం/కూసుమంచి:**మండలంలోని లాల్ సింగ్ తండా గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లాల్ సింగ్ తండా గ్రామ శాఖ మహాసభ శనివారం రాత్రి పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి భూక్య శ్రీకాంత్ అధ్యక్షతన (అమరజీవి కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి ప్రాంగణం)లో జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా హాజరయ్యారు. మహాసభల ప్రారంభ సూచికగా పార్టీ అరుణ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు దారావత్ మల్సూర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో భాగం హేమంతరావు మాట్లాడుతూ.. భూమి సూర్యుడు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, సమా సమాజ స్థాపన కోసం తమ జీవితాలను కమ్యూనిస్టులు త్యాగం చేశారని అన్నారు. కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి నిస్వార్ధంగా ఈ ప్రాంత ప్రజల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించి వందల ఎకరాలు ప్రజలకు పంచి ఇచ్చారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని అన్నారు. ఉమ్మడి గైగోళ్ళపల్లి గ్రామం అభివృద్ధి చెందిందంటే అది కమ్యూనిస్టు పార్టీ నాయకుల పోరాటాల వల్ల అయిందని అన్నారు. ఈ ప్రాంతంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. అనంతరం సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి వెళుతున్న, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం 24 మందితో గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు.

**బిఆర్ఎస్, కాంగ్రెస్ నుండిసిపిఐ లోకి చేరికలు;**

టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నుండి పలు కుటుంబాలు శనివారం రాత్రి జరిగిన పార్టీ శాఖ మహాసభలలో సీపీఐ లోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ నాయకులు బాగం హేమంత రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజల కోసం పార్టీ చేస్తున్న పోరాటాలు, సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గుండెపొంగు మల్లేష్, జిల్లా నాయకులు రామ్మూర్తి, మండల కార్యదర్శి భూక్య నరసింహ, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, నాయకులు పాండు రంగా చారి, తేలు పిచ్చయ్య, మట్టే లింగయ్య, కోరుట్ల సత్యం, భూక్యా పిక్లా, చెరుకుపల్లి ఉపెందర్, జిల్లా నాగయ్య, గూగులోత్ రవీందర్, భూక్యా లాలు, భూక్య సురేష్, భూక్య రమేష్, భూక్యా పీరియా, భూక్య నరసింహ, ధరావత్ శంకర్, ధరావత్ నాగేశ్వరావు, భూక్య వీరన్న, భూక్య మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు పట్టణం, సుందరయ్య నగర్ కు చెందిన వేణు రెస్టారెంట్ అధినేత లక్కం లక్ష్మీ నారాయణ, జ్యోతి దంపతుల కుమారుడు తేజ సురేందర్ హిమబిందు నూతన దంపతులను ఆదివారం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు వారి స్వగృహానికి వెళ్లి వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓ బాటసారి... ఇది పూల దారి

**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు మండల పరిధిలోని కల్లూరు టు మధిర రహదారిలో చెన్నూరు, పోచవరం వద్ద గత పది సంవత్సరాల క్రితం వేసిన హరితహారం పూల మొక్కలు చెట్లుగా మారి రోడ్డు ఇరువైపులా బాటసారులకు ప్రయాణికులకు, వాహనదారులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇస్తున్నాయి. పువ్వుల ప్రేమికులు ఈ రహదారిలో ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారు. మరికొందరు ప్రయాణికులు ఆగి ఫోటోలు దిగుతున్నారు. నిత్యం ఈ రహదారిలో ప్రయాణికులు, బాటసారులు, ఉద్యోగులు, కూలీలు అందరూ ఆహ్లాదాన్ని ఆనందాన్ని, సంతోషాన్ని పొందుతున్నారు. ఈ పువ్వులు చెన్నూరు వద్ద, పోచవరం వద్ద సుమారు అరకిలో మీటర్ వరకు కనబడుతూ కనువిందు కలిగిస్తుంటాయి.

## కాంగ్రెస్ నాయకులకు భట్టి విక్రమార్క పరామర్శ



**ప్రజాపక్షం/ముదిగొండ :**మండల పరిధిలోని న్యూ లక్ష్మి పురం గ్రామం లో కాంగ్రెస్ పార్టీ తొలి మండల అధ్యక్షుడు చెరుకూరి వెంకట్రామయ్య ను, బాణా పురం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వట్టి కూటి వెంకటేశ్వర్లు ను ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఆ తరువాత ఇరువురు యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంధసిరి లో మాజీ ఎంపిపి మట్టా వెంకటేశ్వర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత మట్టా జనార్ధన్ రెడ్డి రమాదేవిల కుమారుడు గోపినాథ్ రెడ్డి చందన వివాహ రిసెప్షన్ కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా ముదిగొండ మండలం లో పలు కార్యక్రమాలకు హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు భారీగా కార్యకర్తలు హాజరై పూలమాలలు వేయడమే కాకుండా పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు, మాజీ జెడ్పీటీసీలు బుల్లెట్ బాబు, పసుపులేటి దేవేందర్, మండల సీనియర్ నాయకులు పసుపులేటి వెంకట్, మండల నాయకులు పందిరి అంజయ్య, మహ్మద్ అజ్గర్, తాటికొండ రమేష్, మట్టా రవీందర్ రెడ్డి, బిచ్చాల బిక్షం, పిల్లుట్ల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన 'సైలో బంకర్' బాధితులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**సైలో బంకర్ ను తొలగించాలని, లేనిచో తమకు పునరావాసం కల్పించాలని కోరుతూ గత 7 రోజులుగా మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ , బిసి కాలనీ వాసులు దీక్ష చేస్తున్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలోని ఆయన నివాసంలో బాధితులు కలిసి, తమ గోడు వెల్లబుచ్చారు. సైలో బంకర్ విడుదల చేస్తున్న దుమ్ము, దూళితో తమ కాలనీలు పూర్తిగా కాలుష్య కొరల్లో చిక్కుకున్నాయని మంత్రి ఎదుట వాపోయారు. గత సంవత్సరం కాలంలో ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నామని అయినా సింగరేణి అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తమను సింగరేణి కాలుష్యం బారి నుండి తప్పించి పునరావాసం కల్పించాలని మంత్రి తుమ్మలను కోరారు. స్పందించిన తుమ్మల పట్టభద్రుల ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సింగరేణి అధికారులతో చర్చించి వారి స్పందనను ముఖ్యమంత్రికి తెలిపి కాలనీవాసులకు న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కదారి మదీనా, మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి నాగేశ్వర రావు, పాలకుర్తి ప్రభుదాసు, పాలకుర్తి మణి బాబు, కొత్త సాంబయ్య, కిష్టపాటి కోటిరెడ్డి, వాడపల్లి కోటేశ్వరరావు, కొండ నాగరత్నం, వాడపల్లి నాగమణి, పాలకుర్తి రాణి, వాడపల్లి అరుణ తదితరులున్నారు.

## సుబాబుల్, జామాయిల్ ధరల తగ్గింపుపై చర్యలు



**ప్రజాపంక్షం/ఖమ్మం :**ప్రభుత్వం సుబాబుల్, జామాయిల్ ధరల తగ్గింపుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష రైతుసంఘాల సమావేశం ఆదివారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతు సుబాబుల్, జామాయిల్ ధరలను స్థిరీకరించాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుంచి సుబాబుల్, జామాయిల్ కొనుగోలు విషయంలో కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. అటవీ ప్రభుత్వం వద్ద నుంచి టన్ను రూ 17,000 లకు కొనుగోలు చేస్తున్నారని ఇతర దేశాల నుంచి టన్ను రూ 18,000 లకు దిగుమతి చేసుకుంటున్నారని రైతుల వద్ద నుంచి మాత్రం కేవలం రూ 10,500 లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఇంకో రూ 300 తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల తగ్గుదలపై ఈనెల 19 న సమావేశమై కార్యచరణ ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రైతుసంఘాల నాయకులు బాగం హేమంతురావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, సామినేని హరిప్రసాద్, మలీదు నాగేశ్వరరావు, చావా కిరణ్, వేములపల్లి సుధీర్, వట్టికొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం విధి విధానాల పరిశీలన: జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం / భద్రాచలం :** మధ్యాహ్న భోజన పథకం అమలు, విధి విధనాలను ఆదివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించబడుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు మరింత మెరుగైన రీతులలో సమర్థవంతంగా నిర్వహించేందుకుగాను కార్యాచరణ పథకాన్ని తయారు చేసే క్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను ప్రత్యేక పరిశీలన చేసి నివేదికలు సమర్పించాలని కోరిన నేపధ్యంలో క్షేత్రస్థాయిలో మధ్యాహ్నం భోజన పథకం అమలు అయ్యే విధానం పాఠశాలల స్థాయి నుండి హాజరు, రోజువారి హాజరు రిపోర్టుల సమర్పణ, ఎంఈఓ కార్యాలయంల్లో సిద్ధం చేసే బిల్లుల వివరాల గురించి కలెక్టర్ పరిశీలించారు. కొత్తగూడెం విద్యాధికారి కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథక లక్ష్యాలుఅమలు విధానాలు, పాఠశాల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఏ విధంగా రిపోర్టులు పంపిస్తున్నారు, బిల్లులు వాటి మంజూరుకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యా శాఖ అధికారి వెంకటేశ్వరచారి, కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాల్, ఫైనాన్సు అధికారి శ్రీనివాస్‌రావులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉన్న లోపాలను అధిగమిస్తూ మరింత సమర్ధవంతంగా ఎలా అమలు చేయాలని విషయం కులంకషంగా చర్చించారు. మధ్యాహ్న భోజన పథకం మెరుగైన రీతుల్లో అమలయ్యేలా, బిల్లులు మరింత వేగంగా మంజూరు అయ్యేలా కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ స్వయంగా రూపొందించారు. ఈ మేరకు కలెక్టర్ మరింత సమర్ధవంతంగా మధ్యాహ్న భోజన పథకం అమలు అయ్యేలా ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మంచినీటిని అందించాలి

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం / పాల్వంచ :** ఫిల్టర్ బెడ్లను, మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి, మున్సిపాలిటీ ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలి, నీటి సరఫరా విషయంలో అశ్రద్ధ వహించవద్దు అంటూ మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సుజాత అధికారులకు సూచించారు. ''తాగునీరు అందించండి మహాప్రభో'' అంటూ మున్సిపాలిటీ ప్రజలు పైప్‌లైన్ల లీకుల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 15వ తేదీన 'ప్రజాపక్షం' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఆదివారం పాల్వంచలోని ఫిల్టర్ బెడ్‌లను సందర్శించారు. ఈ క్రమంలో ఫిల్టర్ బెడ్‌లను, కాలనీలలో ఉన్న మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని సంబంధింత అధికారులను సూచించారు. రానున్నది ఎండకాలం కావడంతో మంచినీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఊర్కొండ :** మండలపరిధిలోని రేవల్లి గ్రామానికిచెందిన మర్రి కంటి నర్సమ్మ అనారో గ్యంతో మృతిచెందారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయూబ్‌పాషా ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ధ్యాపనిఖిల్‌రెడ్డి డిఎన్ఆర్ యువసేన పేరిట అంత్యక్రియలకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలోఊర్కొండ పేట ఆంజనేయస్వామి దేవస్థానడైరెక్టర్ కాటమోనివెంకటయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఫరీద్, వార్డుసభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికిచెందిన దారనాగమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. మాదారం మాజీసర్పంచ్, కాంగ్రెస్ మండలపార్టీవర్కింగ్‌ప్రెసిడెంట్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు శ్రీశైలం యాదవ్, లక్ష్మ ణ్, వెలజాలజంగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** విద్యార్థులకు విభిన్న నైపుణ్యాలను పెంపొందించడానికి అవకా శాలను పాఠశాల స్థాయిలోనే ఉపాధ్యాయులు కల్పిస్తూ కమ్యూనికేషన్, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతతో కూడిన నాయకత్వ లక్షణాలు వారి భవిష్యత్తు జీవిత విజయానికి ఉపయో గపడేలా తీర్చిదిద్దాలని డిఇఒ రమేష్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఇఒ రమేష్‌కుమార్ విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి షర్ఫుద్దీన్, మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, యుఆర్ఎస్ ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయ కుడు కాయితి ఆశాదీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలపరిధిలోని మార్చాల గ్రామంలో శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారాముల, లక్ష్మ ణస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు దేవాలయానికి వచ్చిన కాయితి ఆశాదీప్‌రెడ్డికి ఘనస్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. సీతారాముల, లక్ష్మ ణస్వామి విగ్రహ‌ప్రతిష్ఠ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవాలయ కమిటిసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** అంగరంగవైభవంగా శ్రీసీతారామ లక్ష్మ ణ ఆంజనేయస్వామి విగ్రహ‌ప్రతిష్ఠ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీరైతు సమన్వయసమితి అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి మండలపరిధిలోని మార్చాల గ్రామంలో శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయందగ్గర శ్రీసీతారామ లక్ష్మ ణ ఆంజనేయస్వామి విగ్రహ‌ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ బాలయ్య, మాజీసర్పంచ్ వెంకటరెడ్డితోకలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికచింతనకలిగి ఉండాలని ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విజయడైరీచైర్మన్ శ్రీశైలం, మాజీవార్డు సభ్యులు లింగం, గౌసుద్దీన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 1500 కిలోల నల్ల బెల్లం పట్టివేత



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని ఆదివారం ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్‌బిటీం కల్వకుర్తి నియోజకవర్గంలోని తిరుమల గిరితండాలో పట్టుకున్నారు.వంగూర్ మండలం తిరుమలగిరి తండాకు నల్ల బెల్లం హైదరాబాద్ నుంచి తరలివెళ్తుందనే సమాచారం మేరకు సిఐ బిక్ష రెడ్డి, ఎస్ఐ బాలరాజు సిబ్బందితో వాహనాన్ని తనిఖీ చేసి 1500కేజీల నల్ల బెల్లం, 50కేజీల అల్లం, పదిలీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులవద్ద నుంచి రెండు మొబైల్స్‌ని అశోక్‌లీలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## 18న బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఆమన్‌గల్ పట్టణ పరిధిలో 18న బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతుదీక్ష సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్ కోరారు. ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటిఆర్ ముఖ్యఅతిథులుగా హాజ రవుతున్న రైతుదీక్షను విజయవంతంచేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌పార్టీ అత్యధికస్థానాలను కైవసంచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు రమేష్‌గౌడ్, శేఖర్, కృష్ణ, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ మహా సముద్రంలో అభివృద్ధి, భద్రతకు సమష్టి కృషి

### మస్కట్ సదస్సులో జైశంకర్



**మస్కట్ :** హిందూమహాసముద్ర ప్రాంతంలో దేశాలన్నీ తమతమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు సమష్టి భాగస్వామ్యంతో సమన్వయకృషి చేయాలని భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డా.ఎస్.జైశంకర్ పిలుపు ఇచ్చారు. ఈ ప్రయోజనాలు కాపాడుకునేందుకు ఏక పక్ష ధోరణులను విడనాడాలని కోరారు. ఈ ప్రాంత దేశాలు తమ భద్రతాపరమైన లక్ష్యాలను, అభివృద్ధి లక్ష్యా లను నెరవేర్చేందుకు సమన్వపూర్వకమైన కృషి చేయాలని మస్కట్‌లో ఆదివారం జరిగిన 'హిందూమహా సముద్ర 8వ సదస్సులో ఆయన అన్నారు. సదస్సులో మంత్రి జైశంకర్ ప్రారంభోపన్యాసం చేస్తూ, అక్రమ రవాణా, ఉగ్రవాదం, మత్స్యరంగ ప్రయోజనాలకు ఆటంకం వంటి అనేక సవాళ్ళను ఈ ప్రాంత దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రపంచదేశాల వ్యాపార,వాణిజ్య రవాణా కార్యకలాపాలు, రాకపోకల నిర్వహణకు హిందూ మహాసముద్రం ఒక 'జీవగ్రర'గా అందరి ప్రయోజనాలు నెరవేస్తోందన్నారు. ఈ ప్రయోజనాలు పొందే ఈ ప్రాంతదేశాలన్నీ పరస్పరం సమన్వయంతో తమ శక్తిసామర్థ్యాలను ఇచ్చిపుచ్చుకుంటూ సమన్వయ పూర్వక విధానాలతో సముద్ర రవాణా అభివృద్ధి, భద్రతా లక్ష్యాలను నెరవేర్చేందుకు భాగస్వామ్యదృక్పథంతో కృషి చేయాలని కోరారు. 'సముద్ర రవాణాలో సరికొత్త భాగస్వామ్యం' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. హిందూమహాసముద్రం యదార్థానికి ప్రపంచ నౌకారవాణాకు ఒక జీవగ్రరలాంటిది. దాని ఉత్పత్తి, వినియోగం, దాని ద్వారా లభించే ప్రయోజనాలు, రవాణాద్వారా దేశాలమధ్య కొనసాగే అనుసంధానం సమకాలీన ప్రపంచ గమనంలో ఎంతో కీలకమైనదన్నారు. హిందూమహాసముద్రంలో మనసముద్రరవాణా కార్యకలాపాలు సమన్వయపూర్వకంగా అత్యుత్తమస్థాయిలో కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రయోజనాలు పొందడంలో చారిత్రక,రాజకీయ, భౌగోళిక, సాంసతికపరంగా బహుళ ప్రయోజనాలు పొందుతున్న బృందంగా ఉన్నామన్నారు. కానీ హిందూమహాసముద్ర ప్రాంతంలో ప్రజల శ్రేయస్సు అనే ఒక ఉమ్మడి అంకితభావమే మనల్ని అందరినీ ఏకం చేస్తోందన్నారు. ప్రస్తుత ఈ అనిశ్చితశకంలో మనం భద్రతను, స్థిరత్వాన్ని కోరుకుంటున్నామని, కానీ అంతకుమించిన స్థాయిలో మన ఆశయాలు నెరవేర్చుకునేందుకు పోరాటం చేస్తున్నామన్నారు. పరస్పరం మన విధానాల ద్వారా సమన్వయం చేసుకుంటూ సహకారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ మన బలాన్ని పటిష్టం చేసుకోవడంద్వారా ఆశయాలను ఉమ్మడిగా నెరవేర్చుకోవచ్చునన్నారు. ఐతే ప్రస్తుత ప్రపంచదేశాలమధ్య గణనీయస్థాయిలో మథనం జరుగుతోందని, సముద్రం రెండు అంచులలోనూ ఈ మథనం కొనసాగుతోందనీ, మధ్యాసియాలో తీవ్రమైన ఘర్షణ కొనసాగుతోందనీ, ఇది మరింత శక్తిమంతంగా సంక్లిష్టమయ్యే ప్రమాదం ఉందన్నారు. అదేసమయంలో దీర్ఘకాలిక సమస్యలను పునఃపరిశీలిస్తున్నామనీ, కొన్నిసార్లు చాలా విభిన్నంగా సమూలమైన మార్పులకు వీలైన వైఖరి అవలంబిస్తున్నామనారు. ఈ విషయంలో సముద్ర రవాణాకు సంబంధించిన పరిణామాలను మనం చూస్తూనే ఉన్నామని, తీవ్రమైన ఆటంకాలు ప్రపంచ నౌకాయానంలో తలెత్తుతున్నాయని అన్నారు. ఇది మన ఆర్థిక వ్యవస్థలపై గణనీయ ప్రభావం చూపిస్తోందన్నారు. గ్లోబల్‌సౌత్ దేశాలలో మరోవైపు వనరుల ఆటంకాలు ఎదురవుతున్నాయనీ, ఆర్థిక ప్రతికూల ఉత్పాతాలు ఎదురవుతున్నాయన్నారు. చాలా గ్లోబల్‌సౌత్ దేశాలు తమ అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చేకోవడానికి,స్థిరత్వం కోసం పోరాడుతున్నాయన్నారు. కొన్ని సందర్భాలలో దేశాలకు రుణభారం పెద్ద సమస్యగా ఉందన్నారు. వలసవాదశకం తర్వాత ఈప్రాంతంలో రవాణా అనుసంధానం పునర్నిర్మాణం ఒక ఉమ్మడి అంశంగా ఉందన్నారు. ఈ రవాణా అనుసంధాన పునర్నిర్మాణం అరమరికలు లేకుండా ఉండాలనీ, ఏకపక్షంగా ఉండకూడదని అన్నారు.హిందూమహాసముద్రప్రాంతంలో ఉన్న దేశాలు తమ తమ ప్రత్యేక ఆర్థిక మండళ్ళను తనిఖీ చేసుకుని కాపాడుకోవడంలో, వారి మత్స్యరంగ ప్రయోజనాలను నెరవేర్చేకోవడంలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయన్నారు.

## చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ బిజినేపల్లి :** బిజినేపల్లి మండల కేంద్రంలో గల చౌడేశ్వరి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలం దరూ సుఖ సంతోషాలతో పాటు పాడి, పంటలు, వివిధ వ్యాపారాలలో వ్యాపా రంగాలలో రాణిం చాలని ఆయన అమ్మవారిని కోరిక ప్రార్థించారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమం బిజినేపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు, మహేష్ రెడ్డి, పులిందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చిర్నం బాలస్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** చారగొండ మండల కేంద్రంలో ఇండ్లు కోల్పోయిన బాధితుల రిలే నిరాహారదీక్షలు 6వ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు రిలేదీక్షలకు హాజరై బాధితు లకు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఇండ్లు కోల్పోయి దీనస్థితిలో ఉంటున్న ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, ఈనెల 4న ఇం డ్లను ప్రభుత్వం నేలమట్టంచేసి చేతులు దులుపుకున్నదన్నారు. సుమారుగా 29 మంది కుటుంబాలు ఇబ్బందులు పడుతూ జీవిస్తున్నా రు. కానీ వారికి ప్రభుత్వం కనీసం పునరావాసం కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇండ్లుకోల్పోయిన బాధితులవైపు కన్నెత్తి చూడకపోవడం చాలా వి డ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని లేని నియెడల మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలో బాధితులు సుమత మ్మ, బాలయ్య, అలివేల, చిట్టెమ్మ, గ్యారలాలమ్మ, అనసూయమ్మ, కృష్ణయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ యూనియన్

## 21వ తేదీన నాల్గవ రాష్ట్ర మహాసభ



**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ ప్రగతిశీల హమాలీ మిల్ వర్క ర్స్ యూనియన్ (రి.నెం.ఇ.1917 అనుబంధం టియుసిఐ) రాష్ట్ర నాలుగవ మహాసభలు 21వ తేదీన ఖమ్మంలో రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోతున్నాయని, రాష్ట్ర సభలను జయప్రదం చేయాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎస్ కిరణ్ అన్నారు. ఆదివారం మక్తల్ పట్టణంలో తెలంగాణ ప్రగతిశీలహమాలీమిల్‌వర్కర్స్ యూనియన్(రి.నెం.ఇ. 1917 అనుబంధం టియుసిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలు గోడ పత్రిక విడువల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుమాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు మూడు లక్షల పైగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీ అండ్ మిల్ కార్మికులు ఎగుమతి దిగుమతులు చేస్తు న్నారని, ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్ సివిల్ సప్లై గ్రైనేట్ మార్బుల్ ప్రభుత్వ ప్రైవేటు గోదాముల్లో మార్కెట్ రైల్వే ఆర్టీసీ ట్రాన్స్‌పోర్ట్ బజార్ హమాలీ జట్టుముఠా కలసి దడవాయి పేర్లతో వీరిని పిలు స్తారన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక పాలకుల నిర్లక్ష్యం అర్థం అవుతుందన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు లేక శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీ, మిల్ వర్కర్స్‌కు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, హమాలీ ఆపరేటర్స్ దినసరి కూలీ గుమ స్తాలకు సం క్షేమాలు వర్తింపు కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.పెండింగ్ జిఒలను వెంటనే విడుదల చేయాలి కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు నిలిపివేయాలన్నారు. లక్ష్మ న్న అయ్యప్ప రాజు స్టైలాబు నాగప్ప రాజు నరసింహ పి రాజు ఎర్రం జప్ప పాల్గొన్నారు.

## పొలాల్లో భారీ మొసలి పట్టివేత



**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామం సమీపాన వ్యవసాయ వరి పొలంలో భారీ మొసలి ప్రత్యక్షమవ్వటంతో పలువురు రైతులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కంచిరావుపల్లి గ్రామంలో పొలంలో రైతు బోరు ఆన్ చేయడానికి వెళ్లి చూడగా పొలంలో ఒక్కసారిగా భారీ మొసలి ప్రత్యక్షమయ్యింది. ఒక్కసారిగా రైతు నర్సింహ ఒక్కసారిగా కంగారు పడ్డాడు. గ్రామ యువకుడైన శివప్రసాద్‌కు సమాచారం అందించారు. శివప్రసాద్ వెంటనే వనపర్తి జిల్లా కేంద్రంలో సాగర్ స్నేక్స్ సొసైటీ వ్యవస్థాపకులు, కృష్ణసాగర్‌కి సమాచారం ఇవ్వగా కృష్ణసాగర్ తన బృందంతోన ముసలి ఉన్న పొలం దగ్గరికి చేరుకొని ప్రాణాంతకమైన మొసలిని పెద్దతాళ్ల సమయంతో బంధించారు. అనంతరం గ్రామస్తులు ఒక్కసారిగా కృష్ణసాగర్‌ని అభినందించారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ కృష్ణసాగర్ లాంటివారు ఒక వైపు ఉద్యోగం నిర్వహిస్తూనే మరోపక్క ఎన్నో సామాజిక సేవలు చేస్తూ జిల్లా ప్రజల్ని కాపాడుతూ ఎన్నో సాహసాలు ప్రదర్శించడం ఇటు సామాజిక సేవలో వనపర్తి జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని కృష్ణసాగర్‌కి గ్రామం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిలుక కుమార్ సాగర్ , గోపాల్ యాదవ్ , దేవేందర్ , రాజు, సాగర్ , పోలీ స్ సిబ్బంది, కర్ణాకర్ గౌడ్ , కురుమయ్య, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు

### ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం / పెబ్బేరు:** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినటుల ఎస్‌పి యోగేష్ గౌతమ్ తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి అక్రమ రవాణా జరగకుండా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కిరాణా షాపులలో, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో , కొరియార్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలి పారు. ప్రజలు ఎవరైనా గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాల ని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్‌కానిస్టేబుల్ శ్యామప్ప, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్‌విక్కి, డాగ్ హ్యాండర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ టెస్ట్ నిర్వహణ



**ప్రజాపక్షం / కొత్తకోట:** కొత్తకోట మండలంలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. కొత్తకోట పాలెం , కనిమెట్ట, ఆగ్రహారం, మొజర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు మొత్తం 249 మంది పాల్గొని జిల్లాలోనే మొట్టమొదటిసారిగా 249 మం దికి టెస్టు నిర్వహించడం ఇదే మొ దటిసారి. కోచులు రవి , శివశంకర్, పరశురాం, సీనియర్ మాస్టర్స్ నరేష్, రమేష్ రెడ్డి,సంతోష్ ,గౌతమ్, శివయ్య, యాదగిరి, కురుమూర్తి, అంజి, రాము, అరవిందు, వెంకటేష్ , విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ బి. ప్రశాంత్ కొత్తకోట టౌన్ ఎస్ఐ ఆనంద్ , మాజీ జడ్పీటీసీ పిజె బా బు, జిల్లా కాంగ్రెస్ పార్టీప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్‌బి.శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ పెంటన్న యాదవ్, ఉపసర్పంచ్ బోయేసు,వై.నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు బెల్టులు వారి చేతుల మీదుగా అందించారు.

## ఆలయంలోఎమ్మెల్యే మహాశివ పూజ



**ప్రజాపక్షం/మక్తల్ :** నందు శివ స్వాముల, శివ గురు స్వాములు ఆధ్వర్యంలో నిర్వహించిన 25వ మహా శివపూజ కార్యక్రమం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు గౌరవ డా.వాకిటి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివ గురు స్వాములు ఎమ్మె ల్యేని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్ప ంచ్ కట్ట సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవికుమార్, మండల అధ్యక్షులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి అపార్ కార్డు నమోదు

**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి అపారకార్డు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రతి ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అపారకార్డులో ప్రతి విద్యార్థి పూర్తి సమాచారంతో పాటు అకాడమీకు ఫస్ట్ సమాచారం నమోదు ఉంటుందని వారు తెలిపారు. ఈనెల చివరినాటికి ఆన్‌లైన్ నమోదు పూర్తి కావాలని వారు ఆదేశి ంచారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను పూర్తిస్థాయిలో విద్యా ర్థులకు సంబంధించిన పూర్తి సమాచారం పొందపరచడం జరుగుతుందని ఎంఇఒ వెల్లడించారు.

## పరిహారం చెల్లించాకే ప్రాజెక్టు పనులు



### ఎంపి డికె అరుణ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** భూ నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతానే రిజర్వాయర్ పనులు మొదలుపెట్టాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు బిజెపి సీనియర్ నేత డికె అరుణ డిమాండ్ చేశారు. ఆదివారం జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ లో భూములు కోల్పోయిన రైతులు చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతుగా ఆమె సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ఉదాహరణపూర్ నిర్వాహతులందరినీ నిలు వునా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పూర్తిగా నష్ట పరిహారం చెల్లించాలంటే స్థలా లు ఖాళీ చేసి వెళ్లాలని బెదిరిస్తున్నట్లు గ్రామస్తులు ఆమెతో మొర పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వానికి చిత్తశుద్ధి ఉంటే భూ నిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి పనులు ప్రారంభించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బాధితులకు పోలీసుల రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరపున కాకుండా ప్రజలకు అండగా నిలిచే బాధ్యత పోలీసుల పైన ఉందని ప్రశాంతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బాధితులకు పోలీసులు అండగా ఉండాలని ఆమె కోరారు.

## అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి

**ప్రజాపక్షం/మద్దూరు:** మద్దూరు మండలం లోని మోమినపూర్ గ్రా మ శివారులో అనుమా నా స్పద స్థితిలో చిరుత పులి మృతి చెందింది. విష యం తెలుసుకున్న స్థానికులు ఫారెస్ట్ అధికా రులకు సమాచా రం అం దించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు చిరుత పులి మృతిపై విచారణ చేపట్టారు. తీవ్ర గాయాలతో చిరుత పులి మృతి చెంది ందని తెలిపారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం తర్వాత వెల్లడిస్తామని అధికారులు వెల్లడించారు.



## ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణీకి రక్తదానం



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న సాటి గర్భిణీకి రక్తదానం చేశామని పాలమూరు జిల్లా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే పాలమూరు జిల్లా జడ్చర్ల ప్రాంతానికి చెందిన అఫ్రీన్ బేగం డెలివరీ కోసం జిల్లా ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. రక్తహీనత కారణంగా ఆమెకు బ్లడ్ తక్కువగా ఉండంతో బ్లడ్ ఇబ్బంది అయ్యిందని వెంటనే రక్తం ఎక్కించాలని డాక్టర్లు చెప్పడంతో గణేష్ అనే వ్యక్తి గర్భిణీకి రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షలు కాగితాల మధు, ల్యాబ్ టెక్నిసియన్స్ కోటేశ్వర్, నజీమ్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం



# అరుదైన వ్యాధులకు చికిత్స ఎక్కడ?



మన దేశంలో సుమారు 55 రుగ్మతలు లేదా రోగాలను అరుదైన వ్యాధుల జాబితాలో చేర్చారు. అయితే, ఈ వ్యాధులు సోకిన వారిలో కేవలం 5 శాతం మందికి మాత్రమే చికిత్స అందుబాటులో ఉంటుంది. మిగతా 95 శాతం మంది రోగులకు చికిత్స ఒక సవాలుగా మారింది. మనిషిని శారీరకంగా బలహీనపరచి, తద్వారా మానసికంగా కుంగిపోయేలా చేసి, జీవితాంతం వేధించే పలు రోగాలు ఈ జాబితలో ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ఒ) ప్రకారం ప్రతి 1000లో ఒకరు ఇలాంటి అరుదైన వ్యాధుల బారిన పడుతున్నారు. మన దేశంలో ఈ వ్యాధులను మూడు వర్గాలుగా విభజించారు.

**గ్రూప్ 1:** ఒకేసారి జరిపే శస్త్రచికిత్స లేదా వైద్య ప్రక్రియల ద్వారా నయం చేయగల వ్యాధులు (ఉదా, అవయవ మార్పిడి).

**గ్రూప్ 2:** సాధారణ తనిఖీలతో దీర్ఘకాలిక, సాపేక్షంగా సరసమైన చికిత్స అవసరమయ్యే వ్యాధులు (ఉదా: హైపర్‌టెన్షన్ లేదా బిపి, మధుమేహం లేదా సుగర్)

**గ్రూప్ 3:** చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ ఖరీదైనవి, తరచుగా జీవితకాల చికిత్స అవసరమయ్యే వ్యాధులు (ఉదా: కేన్సర్).

ఏ గ్రూప్‌లోని రుగ్మతలైనా, చికిత్స అత్యధిక శాతం మందికి అందుబాటులో లేదన్నది వాస్తవం. అందుకు అనేక కారణాలున్నాయి. పేటెంట్ హక్కులు పొందిన ఔషధ తయారీ కంపెనీలు ఉద్దేశపూర్వకంగానే ఎక్కువ ధరకు మందులను అమ్మడం అనేది ప్రధాన కారణం. అంతేకాదు, ఉత్పత్తి కూడా డిమాండ్‌కు సరిపడా ఉండడం లేదు. ఖరీదైన మందులకు మార్కెట్ చాలా తక్కువ కాబట్టి, ఈ విభాగంలో పోటీ అంతగా ఉండకపోవడంతో, ఉత్పత్తిదారుల ఏకస్వామ్యం కొనసాగుతున్నది. అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం జాతీయ విధానం (ఎన్‌పిఆర్‌డి) కింద ఏర్పాటు చేసే సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సిఒఇ)లకు అందించే ఆర్థిక సాయం రూ. 50 లక్షలకు పరిమితం చేశారు. ఈ మొత్తం కూడా ఆయా కేంద్రాలకు సకాలంలో అందడం లేదన్నది నిజం. డిజిటల్ క్రౌడ్ ఫండింగ్ పోర్టల్‌ను 2002లో తీసుకొచ్చినప్పటికీ, స్వచ్ఛంద విరాళాలు ఇచ్చేవారి సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. అంతేగాక, నిర్దిష్ట రోగులకు చికిత్స నిమిత్తం నేరుగా సహకరించడానికి దీనిని ఏర్పాటు చేశారుకాబట్టి, ఇతర రోగులకు దీని వల్ల ప్రయోజనం లేకుండాపోయింది. చికిత్సల పరిమిత లభ్యత కూడా సమస్య తీవ్రతను పెంచుతున్నది. అధిక ఖర్చులు, పరిమిత ఔషధ లభ్యత కారణంగా, అరుదైన వ్యాధులకు గురైన వారిలో కేవలం 10 శాతం మందికి మాత్రమే నిర్దిష్టమైన చికిత్స లభిస్తున్నది. మిగతా వారికి సరైన చికిత్స లేదు. ఫలితంగా వారు నిత్యం జీవన్మరణ పోరాటం సాగించక తప్పడం లేదు. డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) నుంచి ఆమోదం వంటి బ్యూరోక్రాటిక్ జాప్యాలు, అవసరమైన ఔషధాలు సకాలంలో అందకుండా అడ్డుకుంటున్నాయి. అనేక సందర్భాల్లో అవినీతి కూడా జతకలవడంతో, ఔషధ ప్రాప్యత గణనీయంగా తగ్గిపోతున్నది. విస్తారమైన మార్కెట్ లేని కారణంగా, అరుదైన వ్యాధులపై పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి)కి ఎవరూ ముందుకు రావడం లేదు. కొన్ని కంపెనీలు నామమాత్రపు ఖర్చు చేస్తున్నాయి. దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వం తరఫున కూడా ఈ లోపాన్ని సవరించే ప్రయత్నాలు జరగడం లేదు. పైగా, అరుదైన వ్యాధులకు సంబంధించిన మందులను దిగుమతి చేసుకోవడానికి కూడా కేంద్రం సహకరించడం లేదు. ఇలాంటి మందులు తెప్పించుకునే కంపెనీలను 11 శాతం కస్టమ్స్ సుంకాన్ని, 12 శాతం జిఎస్‌టిని చెల్లించాల్సి వస్తున్నది. అరుదైన వ్యాధుల బారినపడిన వారిని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, ఆయా కంపెనీలపై అదనపు భారాన్ని మోపుతున్నది. దీనితో ప్రత్యక్షంగా ఆయా కంపెనీలు, పరోక్షంగా రోజులు సమస్యలు ఎదుర్కోక తప్పడం లేదు. పన్ను మినహాయింపుతో ఆ రకమైన ఔషధాలను తయారు చేసే కంపెనీలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పేటెంట్ చట్ట నిబంధనల కారణంగా, కొన్ని కంపెనీలు చెలాయిస్తున్న గుత్తాధిపత్యానికి తెరదించాల్సింది కూడా కేంద్రమే. రోజుల సంరక్షణకు అవసరమైన ఔషధాల కోసం డిసిజిఐ వంటి సంస్థల నుంచి నియంత్రణ ఆమోదాల్లో అలసత్వాన్ని నివారించాలి. దక్షిణ కొరియా వంటి దేశాల్లో అమలు చేస్తున్న ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని అనుసరించడం మంచిది. అరుదైన వ్యాధులతో మానసికంగా, శారీరకంగా కుంగిపోతున్న వారిని, ఆర్థికంగా కూడా చిదిమేసే విధానాలకు తెరపడాలి.

## తగినంత నిద్ర అత్యవసరం..



పరిస్థితుల ప్రభావం కావచ్చు.... కొనితెచ్చుకున్న అలవాట్లు కావచ్చు... కారణాలు ఏవైనా, ఇటీవల కాలంలో అత్యధికులను ఇబ్బంది పెడుతున్న సమస్య నిద్రలేమి. సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత, సోషల్ మీడియా విజృంభణకు అడ్డులేకుండాపోతున్నది. అదీ.. ఇదీ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నచ్చిన ఏదో ఒక అంశం సోషల్ మీడియాలో దొరుకుతుంది. అందుకే, ప్రతి ఒక్కరూ అంతలా దీనికి బానిసలవుతున్నారు. ఫలితంగా నిద్రను కోల్పోతున్నాయి. అయితే, నిద్రలేమి ఎన్నో అనర్థాలకు కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిద్ర తక్కువైతే, శారీరక, మానసిక రుగ్మతలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. అందుకే, సాధ్యమైనంత వరకూ నిద్రకు తగినంత సమయాన్ని కేటాయించాలి. ప్రతి రాత్రి తగినంతగా నిద్రపోవడం వల్ల మీ మానసిక స్థితి ప్రకాశవంతంగా ఉంటుంది. ఆలోచనల పదును పెరుగుతుంది. కొన్ని రకాల అనారోగ్యాలను నివారించడంలో కూడా నిద్ర సహాయపడుతుంది. ఉదాహరణకు చాలినంత నిద్ర ఉంటే, టైప్ 2 డయాబెటిస్, అధిక రక్తపోటు, ఊబకాయం, గుండెపోటు వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు. 'నిద్రతోనే ఆరోగ్యం' అనే సూక్తిని గుర్తుంచుకొని, ప్రతి ఒక్కరూ, ప్రత్యేకించి వృద్ధులు రోజుకు 7 నుంచి 8 గంటలపాటు నిద్రపోవాలి.

## కుంగుబాటుకు మంచి మందు!



'కుదిరితే ఓ కప్పు కాఫీ' అనే సినిమా డైలాగ్ చాలా ఫేమస్ అయింది. ఆనందాన్ని మంచి కాఫీతో పోల్చడాన్ని చూస్తునే ఉన్నాం. ఒక కప్పు కాఫీ తాగడం వల్ల డిప్రెషన్‌తో పోరాడవచ్చని తాజా అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మనిషి శారీరక ఆరోగ్యం లేదా ఉత్తేజం అనేది మానసిక ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందనేది వాస్తవం. అందుకే, మానసికంగా ఆరోగ్యంగా ఉండడం అత్యంత కీలకం. రోజును ఒక కప్పుడు కాఫీతో మొదలుపెడితే, రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని అంటున్నారు. వివిధ అధ్యయనాలు కూడా కాఫీ తాగడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. నిరాశను నివారించడంలోనూ కాఫీ సహాయపడుతుంది. ఇందుకు కీలకం కాఫీలో ఉండే కెఫిన్. కాఫీలో కెఫిన్ ఉంటుంది. మెదడులో డోపమైన్ ఉత్పత్తిని కెఫెన్ ప్రేరేపిస్తుంది. మనిషి ఉత్సాహంగా... ఉల్లాసంగా.. ఆనందంగా ఉంచే రసాయనమే డోపమైన్. కెఫిన్‌లో డోపమైన్ ఉంటుందిగానీ, ఎక్కువ మోతాదులో వాడకం ఒక్కోసారి అనర్థాలకు దారి తీస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కాఫీ ద్వారా ఎంత మేరకు కెఫిన్ మన శరీరంలోకి చేరుతున్నదనే విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థల సూచనల ప్రకారం, పెద్దలు 400 మిల్లీ గ్రాముల వరకూ కెఫిన్ తీసుకోవచ్చు. అది సురక్షితమైన పోతాదుగా పరిగణిస్తున్నారు. కానీ, అందరి శరీర తత్వం ఒకే మాదిరి ఉండదు. కాబట్టి, ఒక్కోసారి ఇంతకంటే తక్కువ పరిమాణంలో ఉన్న కెఫిన్ వల్ల కూడా కళ్లు తిరడం, నీరసపడిపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అందుకే, శరీర స్పందనను బట్టి, ఎంత ప్రమాణంలో కాఫీ తాగాలని నిర్ణయించుకోవాలి. ఒక కప్పు కాఫీలో సుమారు 100 మిల్లీ గ్రాముల కెఫిన్ ఉంటుందని అంచనా. దీనిని బట్టి, ఎవరికివారు తమతమ మోతాదులను నిర్ణయించుకోవడం శ్రేయస్కరం.

## వ్యాయామానికి తోటపని!



వ్యాయామం అంటే నడవాలి... పరిగెత్తాలి... ఈత కొట్టాలి.. సైకిల్ తొక్కాలి... జిమ్‌కు వెళ్లి వర్కౌట్ చేయాలి అనే భావం దాదాపు అందరిలోనూ బలంగా ఉంటుంది. అయితే, తోటపని కూడా ఈ జాబితాలోకే వస్తుందని నిపుణులు అంటున్నారు. వ్యాయామం చేయడం చాలా మందికి నచ్చకపోవచ్చు. కొందరికి కుదరకపోవచ్చు. అలాంటి వారు కూడా శారీరక శ్రమ ప్రయోజనాలను పొందడానికి తోటపని చేస్తే సరిపోతుందని చెప్తున్నారు. సాంప్రదాయ వ్యాయామాలు చేయలేకపోతున్న వారు, రోజులో ఎంతో కొంత సమయాన్ని గార్డెనింగ్‌కు కేటాయించడం మంచిది. తోటపని అంటే, విశాలమైన పెరడు ఉండాలని, అందులో రకరకాల మొక్కలు ఉండాలని నిబంధన ఏదీ లేదు. ఇంటి చుట్టుపక్కల లేదా బాల్కనీలో లేదా రూఫ్‌పైన మొక్కలు పెంచడం కూడా తోటపని కిందే వస్తుంది. దీని వల్ల తరచు వంగడం, కింద కూర్చోవడం, కుండీలు లేదా మొక్కలను ఎత్తడం వంటి పనులు జిమ్‌లో వర్కౌట్ మాదిరిగానే ఉంటాయి. ప్రాణం లేని పరికరాల మధ్య చేసే వ్యాయామం కంటే, స్వచ్ఛమైన వాతావరణంలో, పాణం ఉన్న మొక్కల మధ్య సమయం గడుపుతూ, వ్యాయామ ప్రయోజనాలు పొందడమే మేలు.

## నీళ్లకూ.. గుండెకూ లింకు!



మనిషి మనుగడకు నీరు అత్యవసరం. అయితే, గుండెకు, నీటికీ సంబంధం ఉందని పరిశోధకులు అంటున్నారు. బ్రిటన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రకారం, శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకునే ప్రతి 5 మరణాల్లో ఒ కటి గుండె జబ్బు లేదా గుండెపోటు కారణంగా జరుగుతున్నది. రోజుకు కనీసం ఐదు గ్లాసుల నీరు తాగడం వల్ల గుండెపోటు ప్రమాదం మహిళల్లో 41 శాతం, పురుషుల్లో 54 శాతం చొప్పున తగ్గే అవకాశం ఉంది. శరీరంలో నీటి శాతం తగినంతగా ఉండడం వల్ల గుండె వైఫల్యానికి దారి తీసే సోడియం స్థాయిలు తగ్గుతాయి.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## సింగిరెడ్డి దామోదర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

### యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ



**ప్రజాపక్షం/మోటకొండూరు:** సింగిరెడ్డి దామోదర్ రెడ్డి సిపిఐకి, వర్టూరు గ్రామ ప్రజలకు చేసిన సేవలు చిరస్మనీయమని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని వర్టూరులో మోటకొండూర్ మండల సిపిఐ సమితి ఆధ్వ ర్య ంలో ఏర్పాటు చేసిన సింగిరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభ సూదగాని వెం కటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి స్థూపానికి జ్యో తి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమి నిరుపేదల కోసం చింతల గడ్డ ప్రభుత్వ భూమిపై పోరాటం చేసి ఇల్లులేని పేదలకు ఇండ్లస్థలాలు పంపిణీలో దామోదర్‌రెడ్డి కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలు పార్టీ ఎన్నటికి మరవదన్నారు.మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, ఆలేటి బాలరాజు, బీరకాయల మల్లేష్, నల్ల రాములు, పల్లె శీను, టిఆర్ఎస్ నాయకులు బైరోజు వెంకటాచారి, కాంగ్రెస్ నాయకులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## దేశంలో బలపడుతున్న కార్పొరేట్ శక్తులు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల వలన దేశంలో కార్పొరేట్ శక్తులు బలపడుతున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావుఅన్నారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి నియోజకవర్గ స్థాయి కార్మిక సంఘాల సమావేశం రామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశా నికి ముఖ్య అతిదిగా సింగ్ నరసింహారావు హాజరై మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక చట్టాల వలన ఉద్యోగ భద్రత, సమ్మె చేసుకునే హక్కు, 8గంటల పని విధానానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పుడు ఉన్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాల్సిందని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం కార్మిక రంగా నికి మొండిచేయి మిగిలిందని, కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, రక్షణ, రైల్వే, విద్య, ఆరోగ్య రంగాలను ప్రైవేటీకరిస్తే పేద వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మి కులకు రూ.10 వేల గౌరవ వేతనం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి ఒకటో తేదీన ఖమ్మంలో జరిగే బిల్డింగ్ అండ్ అండర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాలుగవ జిల్లా మహాసభలను భవన నిర్మాణ కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు రావి శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మ టూరి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యోబు, హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ సత్తార్, పూరేటి రవి, శ్రీను, పిల్లి భాస్కర్ మధ్యాహ్న భోజనం పథకం యూనియన్ నాయకులు మహదేవ లక్ష్మి, కొంటా వెంకమ్మ, భవన నిర్మాణ కార్మికులు కంచ శ్రీనివాస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బొందల చిట్టిబాబు , ప్రకాష్ సింగ్, గుమ్మస్తాల సంఘం నాయకులు పొదిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** చారగొండ మండలకేంద్రంలో ఇండ్లు కోల్పో యిన బాధితుల రిలే నిరాహారదీక్షలు 6వ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కమిటిసభ్యులు బాలస్వామి, రిలేదీక్షలకు హాజరై బాధితులకు సంఘిభావం తెలిపి వారు మాట్లాడుతూ ఇండ్లుకోల్పోయి దీనస్థితిలో ఉంటున్న ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించనియెడల మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతామన్నారు. ప్రభుత్వం ఇండ్లుకట్టించి, 50లక్షలవరకు పరిహారం పెంచేదాక ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బాధితులు సుమతమ్మ, బాలయ్య, అలివేల, చిట్టెమ్మ, గ్యారలా లమ్మ, అనసూయమ్మ, కృష్ణయ్య, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 18, 19 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్‌లు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నులకు రాయితీలు పెంచిందని, సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు.

## గీత పనివారల హక్కుల కోసం

# నిరంతర పోరాటం

### గీత పని వారల సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి తిరుపతి గౌడ్



**ప్రజాపక్షం/ నర్సంపేట:** గీత పనివారల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన అమర జీవి, మాజీ ఎంపి, కామ్రేడ్ బొమ్మ ధర్మభిక్షం పోరాట స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని గీత పని వారల సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి తిరుపతి గౌడ్ అన్నారు. నర్సంపేట ద్వారకాపేట రోడ్డు లోని గౌడ సంఘం అడ్డా వద్ద గీత పని వారుల సంఘం రాష్ట్ర క్యాలెండర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న గీత కార్మికుల హక్కుల కోసం మొట్ట మొదట పార్లమెంట్‌లో చట్టం తీసుకురావడానికి కృషి చేసిన బొమ్మగాని ధర్మభిక్షం నిర్మాణం చేసిన తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్రంలో ఉన్న గీత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టి తీసుకుపోయి వారి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. గీత కార్మికులకు పెన్షన్, తాటివనాలు పెంచుకోవడానికి భూమి, తాటి చెట్లు, ఈత చెట్లు, ఖర్జూర చెట్లు, గిరక తాటి చెట్ల మొక్కలను అందిచి వనాలు పెంచాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి వాటి అమలు కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న గీత పని వారల సంఘం గీత కార్మికులకు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట గౌడ సంఘం నాయకులు పాలకుర్తి కృష్ణ, జిల్లా నాయకులు చిర్ర శ్రీనివాస్ గౌడ్, రజక, మున్నూరు కాపు నాయకులు ఇల్లందుల సాంబయ్య, అల్వాల రమేష్, వేముల ఆయిల్ సాంబయ్య గౌడ్, నాతి సదానందం గౌడ్, గండు శ్రీనివాస్ గౌడ్, గోపగాని సందీప్ గౌడ్, సట్ల రజనీకర్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో

# 18న మిర్చి మార్కెట్ ముట్టడి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మిర్చి పంట ధర కింటాకు 25వేలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో 18న ఉదయం 7గంటలకు ఖమ్మం మిర్చి మార్కెట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ గత పది రోజుల క్రితం కింటాకు 12వేలు నుండి 13వేల వరకు మిర్చి జండా పాట ఉంటే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి మార్కెట్ సందర్శన సందర్భంగా రైతులతో కలిసి ఆందోళన చేసిన సందర్భంలో మార్కెట్ కమిటీ స్పందించి రూ.14,200లు పెంచింద న్నారు. క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతోవ్యాపారస్తులతో మాట్లాడి మిర్చి రైతులకుమద్దతు ధర కల్పిస్తామని హామీని విస్మరించ డంతో మిర్చి మద్దతు ధర పతనమైందని దీంతో గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మిర్చి రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర కోసం 18వ తారీఖు ఖమ్మం మార్కెట్ తరలి రావాలని వారు కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు అడపా రామ కోటయ్య, మిడికంటి వెంకటరెడ్డి, భాగం ప్రసాద్, కూసుపూడి రవి, పుచ్చకాయల సుధాకర్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బానోత్ రామకోటి, పుచ్చకాయల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో పలు కుటుంబాలు చేరిక



**ప్రజాపక్షం/పాల్వంచ:** మండల పరిధిలోని కిన్నెరసాని, యానంబైలు గ్రామాలలో సిపిఐ గ్రామశాఖ మహసభలు ఆదివారం కొంగర అప్పారావు, వడ్డే వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ము త్యాల విశ్వనాథం పాల్గొని మాట్లాడుతూ..ప్రజా పాలన గ్రామ సభలలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డు తదితర ప్రభుత్వ పథకాలు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ద్వారా అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని తెలిపారు. రోడ్లు, మంచినీరు సౌకర్యాలు లేని గ్రామాలకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. మహసభల సందర్భంగా కిన్నెరసాని గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 10 కుటుంబాలు సిపిఐలో చేరారు. వారికి ముత్యాల విశ్వనాథం, పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిన్నెరసానిలో 17 మందితో, యానంబైలులో 15 మందితో నూతన కమిటీలు ఎన్నుకున్నారు. కిన్నెరసాని గ్రామ కమిటీ కార్యదర్శిగా ఎస్.కె.ఖాసీం, సహాయ కార్యదర్శిగా శెట్టిపల్లి లక్ష్మ ణరావు, యానంబైలు గ్రామ కమిటీ కార్యదర్శిగా వడ్డే కిరణ్, సహాయ కార్యదర్శిగా అల్లె నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పార్టీ నాయకులు నిమ్మల రాంబాబు, విజయకుమార్, పెద్దబొయిన సుభద్ర, గుమ్మడి లక్ష్మి , గద్దల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రత్యంగిరాదేవి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** పీఠాధిపతులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆశిస్సులతో ఆర్‌కెపురంలోని కుర్తాళపీఠం శ్రీ ప్రత్యంగిరా దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి, 17 నుంచి 19 వరకు జరుగుతున్నాయని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. అదివారం కరపత్రాన్నిఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి అమ్మవారికి ఉదయం 6.30 నుండి విశేష 18 ద్రవ్యాలతో అభిషేకం, 10గంటలకు మహా నక్షత్ర హారతులు జరుగుతాయని, 3వ రోజు అన్నాభిషేకం, పల్లకి సేవ ఉంటుందన్నారు.మునిపల్లె సువర్ణ లత, విఠల్‌శర్మ, అన్నపూర్ణ, జయప్రద,కామేశ్వరి,ఉష,నీలిమ,హేమ,శకుంతల,సరిత, సరిత, హరితఉన్నారు.

# మహానగరి

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**ప్రజాపక్షం/తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన సొప్పరి రాఘవేందర్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వెంకటాపూర్‌కు చెందిన సొప్పరి చిన్న యాదమ్మజంగయ్యలకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు సొప్పరి రాఘవేందర్ వివాహం ఇటీవల జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.ఆదివారం మిడ్జిల్ పరిధిలోని వివాహ వేడుకలకు హాజరై తిరుగు ప్రయాణమయ్యారు. సొప్పరి రాఘవేందర్ వేముల గేటు సమీపంలో దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంపై మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

## కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌ను ఆదివారం ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌజ్‌లో ఎంఎల్‌ఎ బిగాల గణేశ్ గుప్తా, విబిజి వ్యవస్థాపకులు మడిపడిగె రాజు మర్యాదపూర్వకంగా కలిసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కెసిఆర్‌కు వారు పుష్పగుచ్ఛంతో పాటు ఆయన చిత్రపటాన్ని అందజేశారు. కెసిఆర్‌ను కలిసిన వారిలో పలువురు బిఆర్ఎస్ నేతలు, విబిజి సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మెల్కోటె పార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం చేసి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్ మెల్కొటే పార్క్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్ రావు, సీనియర్ సిటిజన్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## విద్యతోపాటు కుంగ్‌ఫూ, కరాటే ఎంతో అవసరం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యతోపాటు కరాటే, కుంగ్‌ఫూ విద్యలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరు ఈ విద్యలపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర కుంగ్‌ఫూ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నక్క బాల్‌రాజ్ సూచించారు. ఆదివారం జడ్చర్లలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక కుంగ్ ఫూ ఇన్‌స్ట్రక్టర్ కె.సత్యం నిర్వహించిన పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బెల్టులను సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు బెల్టులను ప్రధానం చేయడంతోపాటు అభినందించారు. ఈ సందర్భంగా నక్కా బాల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్యతోపాటు కరాటే విద్యలో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రస్తుతం తినే ఆహారంతోపాటు గాలి, నీరు, వాతావరణం పూర్తిగా కలుషితం అవుతుందని, దాంతో ప్రజలందరు అప్రమత్తంగా ఉండటంతోపాటు వ్యాయామం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతి ఏదో ఒక వ్యాయామం తప్పనిసరి అనే ఆలోచనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ కుంగ్‌ఫు ఇన్‌స్ట్రక్టర్ నరేష్, హనుమంతు, బాలానగర్ గురుకుల టీచర్ అనురాధతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభ్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆధ్యాత్మిక సేవలతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ సూచించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మంగలిగడ్డ తండాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. స్థానిక మాజీ సర్పంచ్ బొమ్మ రంగయ్య గౌడ్ తండా వాసులకు నగదు అందజేశారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అంధించేందుకు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సేవలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రామ దేవతలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు భక్తులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బొమ్మ రంగయ్య గౌడ్, నక్కల శ్రీశైలం గౌడ్, బైరమోని ఆంజనేయులు ముదిరాజ్, ఈరమోని యాదయ్య ముదిరాజ్, గుణమోని శ్రీనివాస్, బొమ్మ శివ కుమార్ గౌడ్, లోక్యానాయక్, గోపాల్‌నాయక్, అంబాదాసు నాయక్, పాండునాయక్, వెంకటేష్ నాయక్, శివనాయక్‌లు పాల్గొన్నారు.

## నేడు పద్మశాలీ కమిటీ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/తలకొండపల్లి:** రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని తుర్కయంజాల్ సమీపంలోని మస్కతి డైరీ పక్కన నిర్మించిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక పద్మశాలి రాష్ట్ర కమిటీ కార్యాలయం సోమవారం ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించనునట్లు జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు గాజుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించుకునే ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోని జిల్లా, తాలూకా, మున్సిపాలిటీలు,మండలాలు, గ్రామాలకు చెందిన చేనేత సంఘం నాయకులు, పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు,కుల బాంధవులందరూ పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని వారు కోరారు.

## యుద్ధ ప్రాతిపదికన ఫ్లైఓవర్ల పనులు..

# త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తాం

### భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి
### జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అత్యంత ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో సులభతర ప్రయాణానికి చేపట్టిన హెచ్ సిటీ ప్రాజెక్టులు టెండర్‌లు ఆహ్వానించే దశలో ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న హెచ్ సిటీ ప్రాజెక్ట్‌ల కోసం విద్యుత్ కేబుళ్లు, స్తంభాలు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌లు, టెలిఫోన్ స్తంభాల తరలింపు పనులు యుద్ధ ప్రతిపాదికన చేపట్టాలని ఆయన సూచించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ప్రతిపాదిత హెచ్ సిటీ ప్రాజెక్ట్ పనులను ఆదివారం హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ డేవిస్, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి బస్సులో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గచ్చిబౌలి, ట్రిబూల్ ఐటీ, విప్రో జంక్షన్, మాజిద్ బండ, డిఎల్‌ఎఫ్, ఖాజాగూడ, చందానగర్, శేరిలింగంపల్లి, ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ట్రిబూల్ ఐటీ జంక్షన్ వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ఆస్తుల సేకరణ, ఇతర అనుబంధ పనులను నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. భూసేకరణ, విద్యుత్ స్తంభాలు, కేబుళ్ల తరలింపు సహా ఇతర ఆటంకాలను తొలగించాలన్నారు. ట్రాఫిక్ రద్దీ రహిత కూడళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం హెచ్ సిటీ ప్రాజెక్టు పనులు చేపట్టిందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి త్వరితగతిన భూసేకరణ, ఇతర పనులు పూర్తి చేయాలని ఇలంబర్తి ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, టిఎస్‌పిడిసిఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్, వేణు గోపాల్ రెడ్డి, టిఎస్‌ఐఐసి ఎం.డి. విష్ణువర్ధన్ రెడ్డి తదితర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా 'బిఎఫ్ఎస్ఐ-స్కిల్లింగ్' ప్రవేశ పరీక్ష



**ప్రజాపక్షం /హైదరాబాద్:** 'బిఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్' కోర్సు ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 'బిటెక్ పట్టభద్రుల అభ్యర్థుల'కు ఈ ఏడాది జూలై వరకు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ మార్కెట్స్, ఇన్సూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సాఫ్ట్ వేర్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్ అండ్ డేటాబేస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సాఫ్ట్‌స్కిల్స్ తదితర అంశాలపై 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తికాగానే బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బిఎఫ్ఎస్ఐ)కు సంబంధించిన హైదరాబాద్ లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌లో (జిసిసి) ప్లేస్ మెంట్స్ కల్పిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య నెలకొన్న అంతరాన్ని తగ్గించి, తెలంగాణను నైపుణ్యం కలిగిన మానవ వనరులకు చిరునామాగా మార్చాలని సిఎం రేవంత్ రెడ్డి సంకల్పించినట్టు అధికారులు వివరించారు. సర్టిఫికేట్, ఇతర అడ్మినిస్ట్రేటివ్ అవసరాల నిమిత్తం అభ్యర్థుల నుంచి ఒక్కసారి రూ.5వేలు వసూలు చేస్తారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లను విజయవంతంగా పూర్తి చేసినట్లు కోర్సు నిర్వాహకులు వెల్లడించారు. ప్రస్తుతం మూడో బ్యాచ్ కోసం అర్హత పరీక్షలను నిర్వహించారు. బిఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్' ప్రత్యేక కోర్సు ద్వారా ఏటా 10వేల మందికి శిక్షణ ఇస్తారు. ఇందులో 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5వేల మంది డిగ్రీ పట్టభద్రులు ఉంటారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరంబిఎఫ్ఎస్ఐ జిసిసిల్లో ఉద్యోగాలను కల్పించనున్నారు. రానున్న మూడేళ్లలో 30వేల మంది తెలంగాణ యువతకు ఈ కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది.

## బిజెపికి.. రాష్ట్ర అప్పులపైన మాట్లాడే హక్కు లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర అప్పులపైన మాట్లాడే నైతిక హక్కు లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసానూ పెట్టుబడిగా మార్చిందని, కానీ కేంద్రం తరహా తాము కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రుణలను మాఫీ చేయలేదని తెలిపారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పదేళ్లలో తీసుకొచ్చిన రూ 125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పే పరిస్థితిలో లేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కెటిఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ దాదాపు రూ 70 వేల కోట్ల వరకు అప్పు ఉన్నదని,అసలు అప్పులను, మిగులు బడ్జెట్ తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో, ఇటు రైల్వే కేటాయింపుల్లో రాష్ట్రం పట్ల సవతి ప్రేమ కనబరుస్తోందని మండిపడ్డారు. బిజెపి అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడు మండలాలను,లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును స్వాధీనం చేసుకుని, కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతుకోసిన విషయాన్నిప్రజలు మరిచిపోలేదని కెటిఆర్ పేర్కొన్నారు. కేంద్రం ఖజానా నింపే తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా ఇవ్వాలని, విభజన హక్కులను నెరవేర్చాలని అడిగిన పాపానికి కేంద్ర మంత్రి పియూష్ గోయెల్,ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమన్నారు.బిజెపి చేసిన తప్పులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని అన్నారు.

## రైతు దీక్ష సభా స్థలం పరిశీలన

### మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్

**ప్రజాపక్షం/తలకొండపల్లి:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 18న బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపడుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వేంకటేశ్ అన్నారు.మాజీ మంత్రి,బిఆర్ఎస్ సీనియర్ నేత జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే చెర్లకోళ్ల లక్ష్మారెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వేంకటేశ్ ఆమనగల్ పట్టణంలో జరిగే రైతుదీక్ష సభ స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు,ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలు,రెండు మున్సిపాలిటీల నుంచి జన సమీకరణ చేపట్టాలని సూచించారు.ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ వర్కింగ్ కమిటీఅధ్యక్షుడు మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వస్తున్నట్లు తెలిపారు. తలకొండపల్లి మాజీ ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్,డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా,ఆమనగల్ మాజీ జెడ్పిటిసి అనురాధ పత్యనాయక్,మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య,మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి.ఇమ్రాన్,జగన్,అశోక్ తదితరులు ఉన్నారు.

## ఆకట్టుకున్న 'ఆక్స్‌ఫర్డ్' గ్రామర్ స్కూల్ జూనియర్లు



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** వార్షిక స్పోర్ట్స్ మీట్‌లో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ ఉత్సవభరిత వాతావరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంజలి రజ్దాన్, చీఫ్ పాట్రన్, పాఠశాల వ్యవస్థాపకుడు ఎం.వేదకుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అంజలి రజ్దాన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితుల్లా ఉండాలని, వారి చదువులో, ఎదుగుదలలో చురుకుగా పాలుపంచుకోవాలని సూచించారు. బోధనలో వినూత్న విధానాలు అవసరమని, కొత్త తరం జెన్ జెడ్, జెన్ ఆల్ఫా విధానంలో మరింత ముఖ్యమని తెలిపారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యావిధానాలను మార్చడంలో ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. వేదకుమార్‌మాట్లాడుతూ విద్యార్థుల ఐక్యత, కృషితో పాటు వారి అంకితభావాన్ని, సమగ్ర విద్య పట్ల పాఠశాల యొక్క నిబద్ధతను ప్రశంసించారు. ప్రతి పిల్లవాడి నాడిని అర్థం చేసుకొని వారి ఆశయాల వైపు వారి నడిపించాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకునేందుకు సరైన మద్దతు పొందేలా చూడడం ప్రతి తల్లితండ్రులు, అధ్యాపకుల కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రామాంజుల మేడమ్, ఒజిఎస్ జూనియర్స్ ప్రిన్సిపాల్ ఫాతిమా, సిబిఎస్ఈ ప్రిన్సిపాల్ రేఖారావు, కరస్పాండెంట్ కట్ట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద జంటలకు ఉచిత వివాహం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** పేదలకు సేవ చేయడమే తన ఏకైకలక్ష్యమని జగని ఫర్నిచర్ నిర్వాహకులు జగిని శ్రీనివాస్ అన్నారు. అదివారం ఎస్‌బిహెచ్‌కాలనీలో జగిని శినివాస్, నాగమల్ల అనిల్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో శృతి, శివకుమార్ నవనీత, ప్రవీణ్ లకు రెండు జంటలకు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు వివాహం చేయలేని స్థితిలో ఉన్నవారికి తమవంతు సహాయం అందిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పేదింటి జంటలకు ఉచితంగా వివాహం జరిపించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఉచిత వివాహాలు జరిపించడం కోటి జన్మల పుణ్యంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన మల్లన్న కల్యాణం





**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** శ్రీ మల్లన్న స్వామి కళ్యాణోత్సవం అంబరాన్ని తాకేలా భక్తులు నిర్వహించారు. ఆదివారం నందిగామ మండల పరిధిలోని బండోనిగూడలో ఆలయ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా స్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిముఖ్యఅతిథిగా మల్లన్నస్వామికిపూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీని సత్కరించారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని,సమాజంలో పేరు ప్రతిష్టలతో ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.సింగిల్‌విండోచైర్మెన్ గొర్లపల్లిఅశోక్, మాజీ సర్పంచులు జెట్ట కుమార్, గోవింద్ అశోక్, బిఆర్ఎస్ నాయకులు బండ మల్లేష్, జంగిలి కుమార్, సాములయ్య, నర్సప్పగూడ భూపాల్, బండ నర్సింలు, బుచ్చయ్య, శ్రీశైలం, పాండు, జట్లా అర్కె, కుమార్, శ్రీను, శ్రీరాములు, మల్లేష్ ఉన్నారు.

**నందిగామ:** శ్రీ మల్లన్న స్వామి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కొరుకున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం నందిగామ మండల పరిధిలోని బండోనిగూడలో పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహ్మా యాదవ్, పురుషోత్తంరెడ్డి, తుపాకుల శేఖర్, మాజీ ఉప సర్పంచ్ సీతారాములు, బుచ్చయ్య, పాండు, కావలి కృష్ణ పాల్గొన్నారు. అదే విధంగా షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో భవాని ఫ్యా మిలి రెస్టారెంట్‌నుమాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. నేతలు కృష్ణారెడ్డి, నవీన్, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, సీతారాములు, ఖదీర్, శ్రీనివాస్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కోటాను ఎపి తీసుకెళ్తోంది..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్‌జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన నీటి కోటాను ఎపి తీసుకెళ్తుందని, మిగులు నిల్వలు లేకపోయినప్పటికీ పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా నీటిని తరలిస్తూ ఎపి మొండిగా వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగల ఆధీనంలో ఉన్నదని, వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సిఉన్నప్పటికీ, ఎపి మాత్రం తమ ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని ఆదివారం పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కెఆర్ఎంబి పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాదిలో ఇప్పటివరకు త్రిమెన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించకపోవడాన్ని పరిశీలిస్తే ఆ బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడ్డూ, అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే సిఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఎపి తరలించుకుపోతుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నదన్నారు.

## ఆదర్శనీయుడు ధర్మభిక్షం



**ప్రజాపక్షం/కాప్రా:** నిస్వార్థ పోరాట యోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మ భిక్షం ఆదర్శనీయుడని సిపిఐ మేడ్చల్ జిల్లా నాయకులు, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. న్యూనాగోల్‌లోని ఎస్ఎ డంగే భవన్‌లో కందుల సుధాకర్ అధ్యక్షతన ఆదివారం ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, మమత, సుశీల, సౌజన్య, మల్లేష్, శివ, జైపాల్, తదితరులు పాల్గొన్నా రు.

# మహానగరి

## డీసెంట్ మొబైల్ షాప్‌ను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అలంపల్లి మెయిన్‌రోడ్డులో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ సర్వరాజ్ నూతనంగా ఏర్పాటుచేసిన డీసెంట్ మొబైల్ షాపును తెలంగాణ శాసన సభా స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి : కార్పొరేటర్

**ప్రజాపక్షం/అల్వాల్ :** ఓల్డ్ ఆల్వాల్ సాయిబాబా టెంపుల్ దగ్గర జీనియస్ టాట్స్ స్కూల్‌ను స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంతరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పిల్లలకు అన్నిరకాల గేమ్స్, యోగ, మ్యాజిక్ క్రాఫ్ట్ అండ్ పెయింటింగ్ క్లాస్సెస్ ఉంటాయన్నారు. విద్యార్థులకు సంబంధించి అన్ని రకాల విద్యా పరికరాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేస్తామని నిర్వాహకులు డైరెక్టర్ బిందు ప్రియా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోహిత్ రెడ్డి, అనురాధ రెడ్డి,స్వాతిరెడ్డి, స్థానిక నాయకులు అరుణ్ సాజిద్, తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక పరిజ్ఞానంతో శస్త్ర చికిత్సలు వేగవంతంః ఎమ్మెల్యే కెపి. వివేకానంద్

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ్ న్యూరో సెంటర్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే కెపి వివేకానంద్ మాట్లాడు తూ, మారుతున్న కాలానికి అనుగుణంగా శస్త్ర చికిత్సల నిర్వహణలో ఆధునిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సన్న శ్రీశైలం యాదవ్, మాజీ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు బర్మా వెంకటేష్, నాయకులు భూ లక్ష్మణ్, శన్ను, జైపాల్ గౌడ్, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ అల్లూరి నీరజ తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన అంభురామేశ్వర స్వామి ఆలయం

**ప్రజాపక్షం/తాండూరుః**పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి అటవి ప్రాంతంలో వెలసిన అంభురామేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. అంభురామేశ్వర స్వామి ఆలయ కమిటి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించివ శివ స్వాముల మహాపడి పూజ అంబురానంటింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహాపడి పూజకు తాండూరు పరిసర ప్రాంతా ల నుండి శివ స్వాములు, భక్తులు పెద్దఎత్తున హాజరై అంబురామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శివ స్వాముల మహాపడిపూజలో శివ స్వాము లు ఆడిపాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయ కమిటి సభ్యులు శివ స్వాములకు అన్న ప్రసాదాలను అందజేశారు. కన్నె స్వాములు ఆడిన ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు వెంకటయ్య, నర్సిములు, అంజప్పలతో పాటు ఆలయ పూజారులు, శివ స్వాములు, భక్తులు పాల్గోన్నారు.





## వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ రజతోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి రజతోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడులకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌లు వేర్వేరుగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. అమ్మవారి రజతోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఎల్లమ్మ తల్లి కృప, కటాక్షలతో ప్రతిఒక్కరు చల్లగా జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ్, రవి, నర్సింగరావు, సురేశ్, రాకేశ్, అంతయ్య, ఇంద్రసేనా రెడ్డి, బాలరాజ్, నాగిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/తాండూరుః** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బివీజి పౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్‌కుమార్ జన్మదిన వేడుకలు తాండూరు పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తాండూరు పట్టణంలో తన నివాసంలో అభిమానుల ఆరాటాల మధ్య జన్మదిన వేడుకలను ఘనగా జరుపుకున్నారు. డాక్టర్ సంపత్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తాండూరు నియోజవర్గంలోని అభిమానులు పెద్దఎత్తున్న తాండూరులోని తన నివాసానిక చేరుకుని పులభోకేలను అందించడంతో పాటు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు.



## మేడ్చల్ -శామీర్ పేట్ మార్గంలో జోరుగా మెట్రో రైల్ సర్వే పనులు

### నెలాఖరుకల్లా పూర్తి కానున్న ట్రాఫిక్ సర్వే, భూ సామర్థ్య పరీక్షలు

### మెట్రో రైల్ ఎం.డి.ఎన్‌విఎస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్/మేడ్చల్:** మెట్రోరైల్ రెండవ దశ కోసం సర్వే పనులు జోరుగా సాగుతున్నాయి. జూబ్లిబస్ స్టేషన్ (జెబిఎస్) నుండి మేడ్చల్ (24 కి.మీ), జెబిఎస్ నుండి శామీర్ పేట్ (21 కి.మీ) మెట్రో కారిడార్‌లకు డిపిఆర్‌ల తయారీకోసం అవసరమైన వివిధ రకాల సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రయాణించే విధంగా ఈ మెట్రో కారిడార్లను నిర్మించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ అధ్యయనాలు అన్నీ పూర్తిచేసి మార్చి నెలాఖరుకు శంషాబాద్ విమానాశ్రయం ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డిపిఆర్‌లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నా రు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత డిపిఆర్‌లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు.

**డిపిఆర్‌ల తయారీకి మూడు రకాల అధ్యయనాలు..**

డిపిఆర్‌ల తయారీకి మూడు రకాలైన అధ్యయనాలు





అవసరమని తెలిపారు. ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్వీరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) అని ఆయన చెప్పారు. ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్‌లలో ప్రస్తుతం జరుగుతున్న రోజు వారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో జరగబోయే రోజువారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్‌ల వద్ద ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తీసుకునే మలుపులు, పాదచార ప్రయాణికుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు పరిశీలిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాలలో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళిక ణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతు జీవాలజీవ వైవిధ్యం, జీవనాధార భృతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ఇక భూ సామర్థ్య పరీక్షల్లో ఈ మార్గాలలో ఉండే వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు, భూగర్భంలో నిక్షిప్తమైన నీటిస్థాయి అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తామన్నారు. సామాన్యంగా ప్రతి అర కిలోమీటర్‌కి ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్యపరీక్షల నమూనాలు తీసుకోవడం జరుగుతోందని, ఒక్కొక్క బోర్ హోల్‌ను 50 నుండి 100 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్‌చేసి, ఏ స్థాయిలో భూమి గట్టితనంగానీ లేదా రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ఇప్పటికే హెచ్ఎండిఏ, జాతీయ రహదారుల సంస్థ, కొన్ని భూ సామర్థ్య అధ్యయనాలు చేపట్టారని, ఇప్పుడు మెట్రో సంస్థ జెబిఎస్ మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జెబిఎస్ శామీర్ పేట్ మార్గంలో 19 చోట్ల ఈ భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో మేడ్చల్ మార్గం లో 14 చోట్ల, శామీర్ పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా మొత్తం అన్ని ప్రాంతాల్లో ఈ పరీక్షలు పూర్తి చేస్తామన్నారు.

## మనస్తాపంతో మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

### వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలింపు



**ప్రజాపక్షం/తాండూరుః** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండల పరిధి కాశీంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటయ్య చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన కలంకలం సృష్టించింది. బషీరాబాద్ మండల పరిధి కాశీంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ చింత కింది వెంకటయ్యను ఆర్థిక పరిస్థితు వెంటాడంతో మనస్థాపానికి గురైన ఆయన శనివారం రాత్రి పురుగు మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించి స్థానికులు అతడిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మిషన్ ఆసుపత్రిలో వెంకటప్ప చికిత్స పొందుతూ కొట్టుమిట్టాడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలిపారు.

గ్రామానికి సర్పంచ్‌గా సేవలు అందజేసిన ఆయన పలు అభివృద్ధి పనులను అప్పు సప్పలు చేసి కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేపట్టిన పనులకు డబ్బులు రాక అప్పులు తీర్చ లేక తీవ్ర మనస్థానికి గైరనట్లు తెలిపారు. ఇందు కుగాను వెంకటయ్య దాదాపుగా రూ.10లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దీంతో మనస్థాపానికి గురైన ఆయన పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా ఇది గమనించిన కటుంబ సభ్యులు వంటనే తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించిగా మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేయగా వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందజేస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం.




## గండి చిత్తారమ్మ చెరువులో పడి ఇద్దరు యువకులు గల్లంతు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సరదాగా గడపడానికి వచ్చిన ఆరుగురు యువకుల్లో ఇద్దరు చెరువులో పడి గల్లంతైన సంగటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట, నాగారంకు చెందిన ఆరుగురు మిత్రులు బాలు, సందీప్‌సాగర్, బాలకృష్ణ , నితీష్‌కుమార్, సాయిచందర్, సందీప్‌లు చిత్తారమ్మ దర్శనానికి వచ్చారు. అనంతరం కోడిని కోసుకుని మద్యం, కల్లు సేవించారు. కాగా ఇందులో ముగ్గురు యువకులు పాలసంతుల బాలు, అలకంటి సందీప్‌సాగర్, బాలకృష్ణలు చెరువులో ఈత కొట్టుటకు చెరువులో దిగారు. అందులో ఒకరు తిరిగి రాగ మరో ఇద్దరు బాలు, సందీప్‌సాగర్‌లు చెరువులో మునిగి పోయారు. వీరిని కాపాడటానికి స్థానికులు ప్రయత్నం చేసిన లాభం లేకపోయింది. ఈ మేరకు పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### ఎన్ఎంసి కాంగ్రెస్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ ఇంద్రానగర్‌లో రాజశేఖర్ రెడ్డి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇంద్రానగర్‌లో ముఖ్యంగా రోడ్డు సమస్య తన దృష్టికి వచ్చిందని, తక్షణమే సమస్యను పరిష్కరించే దిశగా అధికారులతో మాట్లాడతానని అన్నారు.

బస్తీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలందరికి సమన్యాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమం లో నాయకులు హరియా నాయక్, మన్నార్ , వెంకట్ రెడ్డి, చాంద్ పాషా, కృష్ణ నాయక్, బాబు, రమేశ్, స్వామి, బాలరామ్, హేమానాయక్, గోవింద్ పాల్గొన్నారు.

**కాలనీలు, బస్తీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు పాటుపడాలి**

**నిజాంపేట్ః** కాలనీలు, బస్తీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 191 ఎన్టీఆర్‌నగర్ కాలనీ పార్కు స్థలంలో కాలనీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి, టిడిపి నేత కొలను నర్సింహా రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలు, బస్తీల్లో సంక్షేమ సంఘాలు అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడాలని సూచించారు. ఎన్టీఆర్ నగర్ కాలనీ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, మదుసూదన్ రెడ్డి, ఆవుల రాము యాదవ్‌లు పాల్గొన్నారు.



## చదువుతోపాటు సామాజిక అవగాహన కల్పించాలి

### సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు

**ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధిః** విద్యార్థులకు చదువుతో పాటు సమాజీక అవగాహన కల్పించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్ట్ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు అన్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రం లో ఉన్నా బచ్చన్‌ప్లే స్కూల్ వార్సికోత్సవాని కి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల కు చదవుతోపాటు సామాజిక అవగాహన కలిగి ఉండేలా తయారుచేయాలని అన్నా రు. పిల్లలకు టీవీ, సెల్ ఫోన్లు ఇచ్చినేర్పించడంతో పిల్లల ఏకాగ్రత లోపిస్తుంది అని తెలిపారు. పిల్లలకు వినడం నేర్పించాలని దీంతో ఏకగ్రత పెరిగి ప్రతి విషయంలో నాలెడ్జ్ నిర్మాణం అవుతుందని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజ్యలక్ష్మి , ప్రిన్సిపల్ శ్వేతాప్రశాంతి , ఉపాధ్యాయులు .విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ప్రభుత్వమేదైనా ప్రజా సంక్షేమం కోసమే పాటుపడాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రభుత్వమేదైనా ప్రజా సంక్షేమం కోసమే పాటుపడాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ జయరాం నగర్‌లో రూ.90లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్డుని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి మంగళ హారతులతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం కాలనీలోని బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించినప్పుడే ప్రజల్లో మరింతగా గుర్తింపు వస్తుందని అన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమంకోసం పాటుపడినప్పుడే తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. బలమైన రహదారులను నిర్మించి ప్రజలకు రవాణా సదుపాయాలను అందించడమే తన బాధ్యత అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, నాయకులు కుంటి మల్లేశ్, మన్నె హరినాథ్, లింగ బిక్షపతి, నరసింహ, చంద్రయ్య, రాములు, ఉపేందర్, నరేశ్, అజయ్, కుమార్, యాది, రమేశ్, ఈశ్వర్, నరెందర్ రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

**వెంకటేశ్వరుని కళ్యాణం కమనీయం...**

శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం కమనీయంగా ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని దండమూడి ఎన్‌క్లేవ్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగింది. ఈ వేడులకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మల్లన్నా.. నీ చల్లని దీవెనలు ప్రజల పై ఉండాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రార్థించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ మెట్‌కాని గూడలోని శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, నాయకులు విజయ రాంరెడ్డి, శ్రీకాంత్, తెలంగాణ సాయి, తదితరులు పాల్గొన్నారు. సూరారం డివిజన్ వైష్ణవి నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ధ్వజస్థంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మనం చేపట్టే ప్రతి కార్యక్రమంలో విఘ్నా తొలగి విజయాలు చేకూరాలని మొట్టమొదటగా గణపతిని పూజిస్తామని, ఆ గణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

## మంచినీటిబోర్లు మంజూరు చేయాలని వినతి

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ మున్సిపల్ కార్యాలయంలోగల డబల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద 3, 5, 8వ బ్లాకల వద్ద బోర్ సౌకర్యం కల్పించగలరని మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎంపి అధికారికి ఫోన్ చేసి తక్షణమే బోర్లు సాంక్షన్ చేయాలని ఆదేశించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఎలాంటి సరైన సదుపాయాలు కల్పించకుండా ఎలక్షన్లు వస్తున్నాయని ఆదరబాధర ఇండ్లు కేటాయించడం జరిగింది. ప్రజలు ఇళ్లలోకి వచ్చి కరెంట్, నీళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఎంపి ఈటల రాజేందర్ చొరవతో రెండుబోర్లు వేయించామని, మరో మూడు బోర్లకు ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గణేష్, మధు, శ్రీనివాస్, ఆర్‌పి లక్ష్మి, హసీనా, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ




## భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు 'స్పెషల్ సర్‌ప్రైజ్'

పాకిస్థాన్ వేదికగా మరో మూడు రోజుల్లో ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లను చూడాలనుకునే క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఈ మ్యాచ్ కోసం ఎక్స్‌ట్రా టికెట్లను అందుబాటులో ఉంచింది అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ). ఇప్పటికే ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేసినట్లు తెలిపింది ఐసీసీ. ఫిబ్రవరి 16 మధ్యాహ్నం 1.30 గంటల నుంచి టికెట్ల అమ్మకాలను ప్రారంభించింది.

**టీమిండియా తలపడేది వీరితోనే..**

టీమిండియా ఆడే మూడు గ్రూప్ మ్యాచులకు అదనంగా టికెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు తొలి సెమీఫైనల్‌కు సంబంధించి పరిమిత టికెట్లు జారీ చేసినట్లు వెల్లడించింది. టీమిండియా తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో పోటీ పడనుది. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత జట్టు తలపడనుంది. మార్చి 4న తొలి సెమీస్ మ్యాచ్ నిర్వహించనున్నారు.

**తొలి సెమీస్ ముగిశాకే...**

మార్చి 9న జరిగే ఫైనల్ మ్యాచ్ టికెట్లను.. తొలి సెమీస్ ముగిశాక విడుదల చేస్తామని తెలిపింది. ఒకవేళ టీమిండియా ఫైనల్‌కు అర్హత సాధిస్తే.. దుబాయ్ వేదికగానే తుది పోరు జరగనుంది. లేదంటే లాహోర్ వేదికగా టైటిల్ పోరు ఉంటుంది. కాబట్టి ఫైనల్ మ్యాచ్ వేదిక ఫిక్స్ అవ్వాలంటే తొలి సెమీస్ రిజల్ట్ రావాల్సిందే. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ Aలో టీమిండియాతో పాటు న్యూజిలాండ్ పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి. ఫిబ్రవరి 19న ఓపెనింగ్ మ్యాచ్ పాకిస్థాన్ న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది.

## ఐపిఎల్ షెడ్యూల్ వచ్చేసిందోచ్..




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 పూర్తి షెడ్యూల్ వివరాలు వచ్చేశాయి. 65 రోజుల పాటు సాగే 74 మ్యాచుల పూర్తి వివరాలను అధికారికంగా మెగా లీగ్ నిర్వాహకులు ప్రకటించారు. మార్చి 22 నుంచి మే 18 వరకు 70 లీగ్ మ్యాచులు జరగనున్నాయి. ప్లే ఆఫ్స్ మే 20 నుంచి మే 25 వరకు నిర్వహించనున్నారు. మార్చి 22న ఓపెనింగ్ మ్యాచ్ కోల్ కతా వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. మార్చి 23న రెండు మ్యాచులు జరగనున్నాయి. అందులో తొలి మ్యాచ్ సన్ రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగగా... రెండో మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్ ముంబయి ఇండియన్స్ మధ్య జరగనుంది. ఎలిమినేటర్, క్వాలిఫయర్ 1 మ్యాచ్‌లు మే 20, 21 తేదీలలో హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్ కోల్‌కతా ఈడెన్స్ గార్డెన్స్‌లో జరగనుంది.

**హైదరాబాద్ మ్యాచులు ఎప్పుడంటే?**

హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను రాజస్థాన్‌తో మార్చి23న తలపడనుంది ఆ తర్వాత మార్చి 27న లఖ్‌నవూతో, మార్చి 30న ఢిల్లీ క్యాపిటల్స్, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో, ఏప్రిల్ 6న గుజరాత్, ఏప్రిల్ 12 పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 17న ముంబయి ఇండియన్స్, 23న ముంబయి ఇండియన్స్, 25న చెన్నై సూపర్ కింగ్స్, మే 2న గుజరాత్ టైటాన్స్, 5న ఢిల్లీ క్యాపిటల్స్, 10న కోల్‌కతా, 13న ఆర్సీబీ, మే 18న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

# రీల్

## జాతీయ అవార్డు కోసం ఎదురుచూస్తున్నా



'మలార్' నుంచి 'సత్య' వరకూ పాత్ర ఏదైనా సరే తన నటనతో ప్రాణం పోశారు నటి సాయిపల్లవి. అందం, అభినయంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్నారీ భామ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె జాతీయ అవార్డు కోసం తాను ఎదురుచూస్తున్నానన్నారు. అందుకొక బలమైన కారణం కూడా ఉందని చెప్పారు. 'జాతీయ అవార్డు అందుకోవాలని నాకు ఎంతో ఆశగా ఉంది. ఎందుకంటే, నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా మామ్మ ఓ చీర ఇచ్చింది. పెళ్లి చేసుకున్నప్పుడు దానిని కట్టుకోమని చెప్పింది. అప్పటికి నేనింకా సినిమాల్లోకి రాలేదు. కాబట్టి పెళ్లి చేసుకున్నప్పుడు దానిని కట్టుకుందామనుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు సినిమాల్లోకి అడుగుపెట్టా. నా తొలి చిత్రం 'ప్రేమమ్' కోసం వర్క్ చేశా. పరిశ్రమలోకి వచ్చిన తొలి నాళ్లలో ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకుంటానని నమ్మాను. జాతీయ అవార్డు అంటే ఆ రోజుల్లో ఎంతో గొప్ప. కాబట్టి, దానిని అందుకున్న రోజు ఈ చీర కట్టుకుని అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నా. దానిని అందుకున్నా, అందుకోకపోయినా.. ఈ చీర ధరించే వరకూ నాపై ఒత్తిడి ఉంటూనే ఉంటుంది' అని సాయిపల్లవి తెలిపారు. 'గార్గి' చిత్రానికి గాను సాయిపల్లవికి జాతీయ అవార్డు వరిస్తుందని ఆమె అభిమానులు ఎంతో ఆశపడ్డారు. కాకపోతే, చివరకు నిరాశ ఎదురైంది. ఆ ఏడాది నిత్యామేనన్‌ను నేషనల్ అవార్డు వరించింది.

# లింగా... ఓలింగా



(మొదటి పేజీ తరువాయి)



నుండి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చారు. ఉదయం పట్టణ, పరిసర ప్రాంతాల నుండి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వరంగల్ జిల్లా చిట్టాయిపాలెం నుండి గత మూడు రోజుల క్రితం తరలించిన దేవరపెట్టేను కేసారం గ్రామంలోని మెంతనబోయిన వంశస్తుల వారి ఇంట్లో ఉంచిన దేవరపెట్టే(దేవతమూర్తులు ఉన్న)కు ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుండి పెద్దగట్టుకు అర్ధ రాత్రి తరలించారు. ఈ పెట్టేలో శ్రీ లింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, సౌడమ్మ దేవతమూర్తుల విగ్రహాలు ఉంటాయి. వాటితో పాటు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి, కుంకుమ, కొబ్బరికాయ, నిమ్మలకాయలు, గుగ్గిళ్ళ, మైశాచిలు ఉంటాయి. అనంతరం ప్రాంతాల నుండి లక్షలాది మంది భక్తులు వెదురు గంపల్లో స్వామివారికి బోనానికి సంబంధించిన సామాగ్రిని నెత్తిన పెట్టుకొని అందులో అఖండ దీపం వెలుగించుకొని తీసుకవచ్చి గుడి చుట్టూ ప్రదక్షణలు చేశారు. పెద్దగట్టు జాతర మొదటి రోజు లింగా.. ఓ లింగా, ఓం నమశివాయ్య అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో దురాజ్‌పల్లి పరిసర ప్రాంతాలు మారుమోగాయి. పోతురాజుల వేషాదారణలో గజ్జెల లాగులు.. కాళ్లకు గజ్జెలు, భూజాన వీరచండు, మెడకు వీరడోలు వేసుకొని మోగిస్తూ భూమి అదిరేలా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

**65వ జాతీయ రహదారిపై దారి మళ్లింపు**

పెద్దగట్టు జాతర సందర్భంగా హైద్రాబాద్–విజయవాడ 65వ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను మళ్లించారు. హైద్రాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, హూజూర్‌నగర్ మీదుగా కోదాడకు, విజయవాడ నుండి హైద్రాబాద్ వైపుకు వెళ్లే వాహనాలను కోదాడ నుండి హూజూర్ నగర్, మిర్యాలగూడ, నల్లగొండ మీదుగా నార్కట్‌పల్లికు మళ్లించారు. ఈ వాహనాల మళ్లింపు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు పోలీస్ అధికారులు ముందే ప్రకటించారు.












## రాజీవ్ గాంధీ హిందువే కాదు

### ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ 'పార్సీ'

### బిసిలను తగ్గించి మోసం చేసేందుకే కాంగ్రెస్ కులగణన పేరుతో కుట్ర

### కేంద్ర మంత్రి బండి సంజయ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బండి సంజయ్ స్వదేశీ ఉత్పత్తులను తిలకించి వారు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని, రాజీవ్ గాంధీ హిందువు అయినందున కుమారుడు రాహుల్‌గాంధీ హిందువేనని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్సీ మతస్థుడని, పర్సియాలోని ముస్లిం సంతతికి చెందిన వారి పూర్వీకరులు ఇండియాకు వచ్చి పార్సీలుగా మారారని తెలిపారు. ఫిరోజ్ జహంగీర్ ఖాన్ మతమే రాజీవ్‌గాంధీకి వర్తిస్తుందని, కావున రాజీవ్‌గాంధీ అసలు హిందూ కానే కాదని స్పష్టం చేశారు. 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో బిసిలకు న్యాయం కంటే అన్యాయమే ఎక్కువ జరుగుతోందన్నారు. హిందూ ధర్మ సమాజం కోసం నిరంతరం పనిచేస్తామని, మమ్ముల్ని మతతత్వ వాదులుగా ముద్ర వేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇకనైనా బిసి జాబితాలో నుంచి ముస్లింల జనాభాను తీసేసి కేంద్రానికి పంపిస్తే తప్పనిసరిగా ఆ జాబితా ఆమోదం పొందేలా చేస్తామన్నారు.















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com